


యువ
ఏప్రిల్ '64
60 NP



నటసామ్రాట్టు ఉజ్వలభావ ప్రదర్శనంతో జీవంపోసిన
శిల్పి సామ్రాట్టు ప్రేమగాథ!
విక్రమ్ ప్రొడక్షన్స్
అమరశిల్పి
జక్కన్న
పూర్తి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం.
VIKRAM PRODUCTIONS MADRAS
నిర్మాత-దర్శకుడు
B.S.రంగా


వస్తున్నారు!
ప్రప్రథమంగా
యన్.టి.రామారావు
ద్విపాత్రాభినయం
సురేష్ ప్రొడక్షన్స్
రాముడు భీముడు
దర్శకత్వం.. చాణక్య .... నిర్మాత.. D.రామానాయుడు.
కథ,మాటలు :డి.వి.నరసరాజు ... పాటలు : శ్రీశ్రీ, కొసరాజు, సి.నారాయణరెడ్డి , ఆరుద్ర ...
సంగీతం : పెండ్యాల...కెమెరా: అప్పయ్య ... కళ : రాజేంద్రకుమార్...కూర్పు: మార్తాండ్ ...

తొలిమాట

జ్యోతి

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య

విడిప్రతి వెల : 60 న.పై. — ఏడాది చందా : ఏడు రూపాయలే

సంపుటి 2 ఏప్రిల్ 1964 సంచిక 4


పాఠక మహాశయా! ఈ నెల

ఇదో వరస...

ముఖచిత్రం :
చలనచిత్ర నటనావి "శారద"
ఫొటో : టి. వి. కుమార్

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers
Buckinghampet post, Vijayawada-2



ఉత్తరాయణం

జ్యోతి "ఉగాది సంచిక" బాగుంది. శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారిపై వ్రాసిన వ్యాసం చాల బాగుంది. నాగేశ్వరరావుగారు ప్రజలకు ఎక్కువ అలవాటు కావటం మంచిదికాదని. చిత్రాల సంఖ్య తగ్గించు కొనుట ఉచితమైనది కాదు.

బి. లక్ష్మణశాస్త్రి, భీమవరం.

మీరేమీ అనుకోకుండా వుంటే ఒక సందేహం: 'జ్యోతి' (మార్చి, 64 సంచిక) 47 వ పేజీలోని జోక్ కి ముళ్ళపూడి వెంకట రమణగారి 'నవ్వితే నవ్వండి' పుస్తకంలోని 63 వ పేజీలో రెండవ జోక్ కి తేడా ఏమిటి? అలాగే అదే 'జ్యోతి' 51వ పేజీలో జోకుకు —'న. న.' 75 వ పేజీ జోకుకు, అదే 'జ్యోతి' 55 వ పేజీలో జోకుకి, 'న. న.' 133 వ పేజీ ఒకటవ జోకుకి తేడా ఏమిటి? మీ ఉత్తరాయణంలో ఇది ప్రచురించగలరని ఆశిస్తున్నాను.

జి. విజయకుమార్, వుయ్యూరు.

● [తేడా లేదు.]

జ్యోతి ఉగాది సంచిక ఆశించినంతగా బాగాలేకున్నా. ఇదివరకటి సంచికల కన్నా ఈ సంచికలోని కథల విలువ బాగుంది. మీరన్నట్లుగా "గళ్ళరుమాలు" నిజంగా వెన్నెలజల్లు. ఈ జల్లులో పులకరిస్తుంది వొళ్ళు. "దొంగ" 'మామూలుకథ' రామలక్ష్మిగారి 'మాయాతిత స్వయంవరం' ఈ సంచికలో మాణిక్యంలాంటిది.

'మీరూ - మీ సిగరెట్లు' వ్యాసం ప్రచురించిన మీకూ, రచయితకు, సోదర పాఠకుల తరఫున మా కృతజ్ఞతలు. నాకు సిగరెట్లు కాల్చే అలవాటు లేకున్నా ఈవ్యాసం చదివాక నా స్నేహితుల్లో కొందరిని సిగరెట్లుకాల్చే వ్యసనంనుండి కాపాడాలని నిర్ణయించుకొని, పని చురుగ్గా చేయడం సాగించాను. కొందరు మొండికెత్తితే ఈ వ్యాసం చదవండిరా నాయనమ్మలూ అంటూ యిచ్చాక, వారు అప్పటికప్పుడే సిగరెట్ కాల్చడం మానేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ప్రగతి శ్రీ, వేములవాడ.

జ్యోతి ఉగాదిసంచిక బాగున్నది. కాని 'రాజకీయ వార్తావరణం' గురించి కొద్దిగా వ్రాయాలనివుంది.

తెలుగులో ఇన్ని పత్రికలున్నా ఒక్కటి గూడా అసలు విషయాన్ని బయటిపెట్టి న్యాయాన్యాయాలు ప్రజలకు చూపగల తాహతు దేనికీలేదని చెప్పటానికి విచారిస్తున్నాను. నూతన పోకడలుపోతున్న 'జ్యోతి'కూడా ఆ వాతావరణంలో కలసిపోతూంటే విచారమేగాదు. దుఃఖంగూడా వస్తోంది. నిజమైన విమర్శ ఎందుకు చేయలేక పోతున్నాయి పత్రికలన్నీ? బస్సురూట్ల జాతీయకరణంలో శ్రీ సంజీవరెడ్డిగారిపాత్ర సుప్రీంకోర్టు తీర్పులో బోధపడటంలేదా, లేక మీరు చదువలేదా. ఎందుకంత అలా దాగుడుమూత లాడతారు? ఎప్పుడూ ముఠా తగాదాల్లో తన్నుకుంటూండే మన రాష్ట్ర నాయకులగురించి ఏ పత్రికన్నా ఒక్క-

ఎడిటోరియల్ వ్రాసిందా ? మీరుకూడా నిజమైన వార్తలను దాచకుండా చెప్పరెందుకని?

ఎ. ఆర్. కె. రాజు, విజయవాడ.

ఉగాది సంచిక శోభాయమానంగా వుంది.

ముఖపత్రచిత్రం న ట రా జు నాగేశ్వరరావు పత్రికకు ఎంతో అందాన్నిచ్చింది. 'గళ్ళ రుమాలు' కథ చాలా చాలా బాగుంది. విశ్వానందంగారు లేకపోవడం మూలాన మాకూ అంత ఆనందంగా లేదంటేనమ్మండి. ప్రదర్శన యోగ్యమైన ఒక నాటికను ప్రచురించండి.

అప్పాజీ, రాజమండ్రి.

ముఖచిత్రం దానికదే సాటిగాఉంది. బాల గంగాధరతిలక్ వ్రాసిన 'దొంగ' కథ చాల బాగుంది. తిలక్‌గారికి ధన్యవాదాలు తెలుపగోర్తాను. బాపు బొమ్మలు ఎందుకని అంత బాగుంటాయో అర్థం కావటంలేదు 'జ్యోతి' వంటి పత్రిక తెలుగులో ఉండడం ఆంధ్రులకు గర్వకారణం. కార్టూనులు, విట్లూ చాల బాగుంటున్నాయి. 'జ్యోతి' తన ప్రకాశాన్ని ఇంకా అధికంచేసుకోవాలని కోరుతున్నాను.

కె. శేఖర్, తెనాలి.

ఉగాది "జ్యోతి" ఎంతోచక్కగాతయారుచేసి (మంచి, మంచి కథలతో) అందించిన మీకు నాహృదయపూర్వకాభివందనములు. ముఖచిత్రం "శ్రీ అక్కినేని నాగేశ్వర్రావు" చాలా ఆకర్షణీయంగావుంది."తొలిమాట"లో మీరు వ్రాసినట్లు "గళ్ళరుమాలు" నిజంగా వెన్నెలజల్లే. అందులో సందేహమేమీలేదు. రచన చక్కగా ఉంది. రచయిత శ్రీ హనుమంతరావుగారికి నా అభివందనాలు.

కె. చలమయ్యశెట్టి, విజయపురి.

ఉగాది సంచిక ఎక్కువ పేజీలతో వేస్తామని మాకు నిరాశ కలిగించారు. మామూలు సంచికలోకన్న ప్రకటనలు మాత్రం ఎక్కువయ్యాయి. కథలలో "దొంగ" కొత్తగా చాలాబాగుంది. తిలక్‌గారికి అభినందనాల్లు.

"మీరు - మీ సిగరెట్లు" వ్యాసం బాగానే ఉంది. కానీ ఒక్క సిగరెట్లగురించే వివరించారు. బీడీ, చుట్టలవల్ల నష్టాలు లేవనా ? వ్యాసకర్త వాటి విషయం రాయలేదు. అసలిప్పుడు సిగరెట్లకన్నా బీడీలు కాల్చేవాళ్ళే ఎక్కువగా ఉన్నారు. వారి విషయం మరోసారేనా చర్చిస్తారా ?

వేమూరి సూర్యప్రకాశరావు,
ఊ మ్మ లా డ.

ఎన్నడూ జ్యోతి చదివి ఎరుగని నేను ఇవ్వాళ ఈనెల సంచిక (మార్చి) చదవటం తటస్థించింది. వెంటనే ఉత్తరంవ్రాయకుండా వుండలేకపోయాను. శ్రీ బి. వి. రమణరావు గారు వ్రాసిన "మీరు. మీ సిగరెట్లు" అనే వ్యాసం చాలా బాగుంది. వాస్తవాన్ని సరైన పంధాలో వెలిబుచ్చారు. "గళ్ళరుమాలు" నన్ను భూకంపంలా ఊపివేసింది.

బి. వి. రత్నాకరం, కొత్తగూడెం.

జ్యోతి ఉగాది సంచిక చేతికి తీసుకోగానే ఒకవిధంగా సంతోషం, మరోవిధంగా విచారం కలిగాయి. సంతోషం ఎందుకంటే దానిలోని కథలు (అన్నీ కాకపోయినా) చాలా బాగున్నాయి.

ఇక విచారం ఎం దు కం టే ఉగాది పండక్కి సంబంధించిన శీర్షిక ఒక్కటీలేదు. కనీసం ఒకటైనా వుంటే ఎంచక్కా వుండేది. ముఖచిత్రంచాలాబాగుంది.కథలలోముఖ్యంగా 'దొంగ',మాయాతీతస్వరూపిణీ,గళ్లరుమాలు బావున్నాయి. కూనలమ్మ పదాలకి మరో రెండు పేజీలు కేటాయించాలని మనవి (మరి పంచపదులు మానేశారుగా). 'మామూలు కథ' ఒకరకంగా 'మామూలు'గానే వుంది.

అన్ని పత్రికల్లో కనీసం ఒక్క సీరియల్ కథ వుంటుంది. కాని జ్యోతిలోలేదు. కనుక సీరియల్ కథ ఒకటి ప్రవేశపెడితే బాగుంటుంది. మన జ్యోతిలో ఎప్పుడూ రచనలు పాతవారివే కనపడుతున్నాయి. దీన్నిబట్టి చూస్తే మీరుక్రొత్తవారికి అవకాశం కలిగించేలా లేరు. కనుక ఇకమీదట మీకు వీలైనంతవరకు క్రొత్తవారి రచనలు వేయమని కోరుతాను.

శాంతి, విజయవాడ.

"జ్యోతి" ఉగాది ఉదయాన, వధూహృదయాన మధురోహలా వుంటుందనుకున్న మాకు కొంచెం నిరుత్సాహం కలిగించింది. కాని కొత్త శీర్షికలు ప్రవేశపెట్టినందుకు ధన్యవాదాలు.

మనవైపు - తెలుగుగడ్డపై ఒకటో తేదికల్లా ఒకటోరకంగా వెలువడే ''జ్యోతి'' యిక్కడి కెందుకింత ఆలస్యమౌతోందో అర్థం కావడంలేదు. ఈనెల 'మిస్' అయిందనుకున్నా నిన్నటిదాకా రాకపోయేసరికి. తర్వాత ''కథా - కమామిషూ'' చూసి విషయాలు తెలుసుకున్నా!

''జ్యోతి''ని తొలిచూపులోనే వలచాను. నా హృదయంలో ''జ్యోతి''కో ప్రత్యేకస్థానం ఎప్పుడూ వుంటుంది: పుట్టినప్పటినుంచీ విడవకుండా చదువుతున్నా! నెలా నెలాభివృద్ధి గాంచుతున్నది గాని మోహం మొత్తటంలేదు. ''జ్యోతి''కి కొందరు ఎందుకు దూరంగా వుంటున్నారో అర్థంకాలేదు.

రాము, మణిపాల్ (మైసూర్)

మార్చినెల 'జ్యోతి' ఉత్తరాయణంలో 'అశ్లీలం' విషయమై సి. హెచ్. రామ్మూర్తి గారి అభిప్రాయం. మీ అభిప్రాయం చదివిన తర్వాత ఈ వుత్తరం రాయాలనిపించింది. మీ ఉభయులకూ మధ్యస్థమైన అభిప్రాయం నాది. చిత్తగించండి—

'జ్యోతి'లో అప్పుడప్పుడు హాస్యం కొంచెం వికటిస్తున్నమాట నిజమేకానీ, శృంగారం శృతిమించుతున్నట్లు మాత్రం నాకు ఎక్కడా అనిపించలేదు. ఇంగ్లీషు జోకులను తెలుగు చేసుకోవటంలో ఆక్షేపణ లేదు. కానీ "ఎడిటోరియల్‌లో నిప్పులు కక్కడం" అన్న జోక్ అనువాదం మాత్రం చప్పగానేవుంది. ఇంకొక్క మనవి-హాస్య సృష్టికి అనేక సాధనాలున్నాయి. వాటిలో 'పన్' ఒకటి మాత్రమే. కానీ హాస్యం అంటే పన్ మాత్రమేనని "జ్యోతి" వారు భావిస్తున్నారు అని సందేహించవలసిన అ వ స రం అప్పుడప్పుడు కలుగుతోంది. పన్నులు పాఠకుల తలకుమించిన భారం కాకూడదు. వరాభిగారి పన్‌చాంగం 'ఫర్వాలేదు' కానీ 'అమోఘం'గా లేదు.

ఇక 'అశ్లీలం' విషయానికొస్తే - అది ఈనాడు సర్వత్రా వున్నదని మీరు చెప్పారు. కానీ 'అశ్లీలం' అన్నది గత కాలపు సాహిత్యంతో పోల్చుకుంటే ఇప్పటి సాహిత్యంలో చాలా తక్కువగావుంది. బూతుమీద మోజు ఇప్పటివారికంటే అప్పటివారికే ఎక్కువ వుండేది. శ్రీనాథుడు, ముద్దుపళని రాసిన దాంట్లో పదోవంతు బూతు ఇప్పటివాళ్ళు రాయటంలేదు. 'దక్షిణాంధ్రయుగం'లో బూతు వర్ణనలులేని ప్రబంధంలేదు. వాటితో పోల్చితే 'జ్యోతి'లో జోకులన్నీ సభ్యంగానే వున్నాయి.

దక్షిణాంధ్రయుగందాకా అక్కర్లేదు. దాదాపు 20 సంవత్సరాల క్రితం వరకూ కూడా సాహిత్యంలో ఇప్పటికంటే ఎక్కువ బూతు వుంది. చెళ్ళపిళ్ళవారుకూడా రాశారు. కొవ్వలి రాశారు, చలం రాశారు. అయితే పూర్వపు ప్రబంధాల్లో కేవలం బూతేకాక మంచి కవిత్వంకూడా వుండేది. కావలసిన వారు బూతుని ఆస్వాదించేవారు. అక్కర్లేని వారు కవిత్వాన్ని మాత్రమే స్వీకరించేవారు. ఎవరురాసినా బూతుబూతే. శృంగారవర్ణనకు పరిహద్దు ఫలానా అని అనుకుంటే, దాన్ని మీరినవారు శ్రీనాధుడైనా నేటి కుర్ర రచయిత అయినా గర్హించవలసినదే.

ఇక సినిమాల్లోకూడా ఇంతే. పదిహేనేళ్ళక్రితం సినిమాల్లో కనిపించిన బూతు ఇప్పటి సినిమాల్లో కనిపించదు. ఇదివరలో రెండు అర్థాలువచ్చే మాటలు, పాటలు సినిమాల్లో కొల్లలుగా వుండేవి. అంత బూతు, అంత మోటు హాస్యం ఇప్పటి సినిమాల్లో కనిపించవు. అయితే ఇప్పటి సినిమాల్లో, సాహిత్యంలో అశ్లీలం లేదని నేను అనటం లేదు. అలాంటివాటిని గర్హించవలసిందే.

ఇంతకీ చెప్పవచ్చేది — 'జ్యోతి'లో గర్హించతగిన అశ్లీలమైనవి ఏమీ కనిపించలేదు నాకు.

పి. ఎస్., మద్రాసు.

"జ్యోతి" మార్చి (ఉగాది) సంచికలో శ్రీ సి. హెచ్. రామమూర్తి (కాకినాడ)గారికి మీరు ఇచ్చిన హామీకి సంతోషించాను. కాని మీ రడిగిన ఎదురుప్రశ్న ఆశ్చర్యకరముగా నున్నది. మీరన్నట్టు లక్షలాదిగా మేధావులనబడేవారు సైతము సినిమాలు చూస్తున్నమాట నిజమేగాని, ఎవరూగూడా అందులో కనిపించే అశ్లీల దృశ్యములలో తల్లీనులై కుర్చీల కంటుకు పోవడములేదు. ప్రేక్షకుల్లోంచి వచ్చే చప్పట్లు, ఈలలు, కేవలము సంతోషాతిశయం వల్లకాదని, ఆ దృశ్యము ఎడల తమకు కల్గిన తేలికభావం, జుగుప్స మాత్రమేనని గుర్తించ గోరుతున్నాను. ఆ దృశ్యాలను చెప్పుకొని వెకిలిగ నవ్వుకొంటారేగాని ఘనంగా ఎవ్వరూ చెప్పుకోరు. అయినా సాహిత్యానికి, సినీకళకి సావత్యం లేదు. కళ అనేకంటే వ్యాపారమంటే సరిపోతుంది. 'జ్యోతి' అశ్లీలాన్ని (సినీటెక్నిక్) ప్రయోగించి డబ్బు సంపాదిస్తుందనుకోను. మంచి వినోదాన్ని, విజ్ఞానాన్ని 'జ్యోతి' అందివ్వగలదని ఆశించాము., ఆశిస్తున్నాము.

నిజానికి 'జ్యోతి' దూరంగా వుండాల్సినంత 'సిల్లీగా' ఏమీలేదు.

కె. భాస్కరరావు, హైదరాబాద్.

జ్యోతిలో మంచి కథలేగాక, అభివృద్ధికరంగాను, విషయాత్మకంగాను ఉండే రచనలను ప్రచురించవలసిందిగా నా కోరిక. మద్రాసుకన్నా ఆంధ్రకు పంచదారకోటా తగ్గించటంలో కల కారణాలు, కేంద్రానికి అన్నింటిలోనూ మనరాష్ట్రంపైనున్న చిన్నచూపు, దేశాంతరాలలో ఉన్న తెలుగువారు, మన రాష్ట్రంలో విద్యపై తీసుకోవలసిన పెద్దచర్యలు, మనరాష్ట్రంలోని క్రీడాలోకం —వంటి విషయాలు ప్రచురించవలసిందని ప్రార్థన.

నిజంగా 'జ్యోతి' తెనుగుతనపు ప్రతిబింబంగా ఉండాలని నా ఆకాంక్ష.

గొడవర్తి రామ్‌ప్రసాద్, మద్రాసు.

రాజకీయ వాతావరణం

"ఇంట్లోకి చేరనిస్తే, ఇంటివాసాలు లెక్కపెట్టటం"—

షేక్స్పియర్ మహాకవి రాసిన ఒక నాటకంలో, ఒక పెద్దమనిషి భార్యా పాతివ్రత్యాన్ని గురించి అదే పెద్దమనిషితో మరోబుద్ధిమంతుడు పందెం వేసుకుంటాడు. నీభార్య శీలం లేనిదని నేనే స్వయంగా నిరూపిస్తాను" అంటాడు, పైగా;

ఇవి కథకోసం, సామెతకోసం చెప్పుకున్న విషయాలే కానక్కరలేదు. ఇంత 'సూటిగా' కాకపోయినా, ఇంత బాధనూ కలిగించే విషయాలు, ఈనాడూ మనకు అనుభవంలోకి వస్తూనే వున్నాయి.

కాశ్మీర్ మన భూభాగంలో విలీనం అయిపోయింది. (రాజ్యాంగరీత్యా కొంత 'అంశ' పూర్తి విలీనానికి కొంత అడ్డుతగిలినా అది వేరేవిషయం.)

కాశ్మీర్‌మీదకు (అంటే మనదేశంలోని ఒక అంతర్భాగం మీదకు) పాకిస్తానీయులు దండెత్తుతుంటే ఐక్యరాజ్యసమితి భద్రతా సంఘంలో అప్పుడు ఫిర్యాదు చేసుకున్నాం.

ఒకదేశం మీదకు మరొకదేశం దురాక్రమణకు సిద్ధపడటం, జరిగిన విషయం. కాని ఈనాడు భద్రతాసంఘంలో చర్చలు ఈ 'దురాక్రమణను' పట్టించుకోటల్లేదు, సరికదా, కాశ్మీరుప్రజలకు తమభవిష్యత్తును గురించి స్వయం నిర్ణయాధికారం వుండాలా, లేదా అనేది వారిప్పుడు ఆలోచిస్తున్నారు.

చాలా చిత్రంగా వుంది కదూ!

షేక్స్పియరే రాసిన 'సింబలిన్' నాటకంలో 'నీభార్య పతివ్రత కాదని నేనే స్వయంగా రుజువు చేస్తాను' అని బుకాయించిన పెద్దమనిషి వుదంతం మళ్ళీ గుర్తుకొస్తోంది.

కాశ్మీర్ మన దేశంలో కలిసి దాదాపు దశాబ్దందాటి అర్థభాగంకూడా గతిస్తోంది. ఇన్నేళ్ళు కాపరంచేసిన తరువాత 'నీ మొగుడంటే నీ కిష్టమేనా' అని యెవడో పరాయివాడు అడిగినట్లుంటుంది ఇప్పుడు ఆ రాష్ట్రప్రజలను "భారత దేశంలో కలిసిపోవటం మీకు ఇష్టమా, కాదా?" అని అడిగితే.

మరో చిత్రం.

1947 లో మన దేశాన్ని వదలి వెళ్ళిపోతున్న బ్రిటిష్‌వారు, మన దేశంలోని సంస్థానాధీశులకుకూడా ఒకవిధంగా స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్ళిపోయారు. తమ రాష్ట్ర భవిష్యత్తునుగురించిన నిర్ణయాధికారం ఆ సంస్థానాధీశులకే వదలివేశారు. ఆ అధికారం ప్రజలకు లేదన్నారు.

(దైవం. కాలం. పటేల్‌గారి రాజనీతి అన్నీ అప్పట్లో కలిసిరావటంవల్ల ఆ మూడు వందల సంస్థానాలు సాఫీగానే భారత దేశంలో విలీనం అయిపోయినాయి. అది వేరే విషయం.)

కాని అప్పటి బ్రిటిష్‌వారి మాటలకు, ఇప్పటి మాటలకు మధ్య అంతరం ఇలా కనిపిస్తూ వెక్కిరిస్తూవుంటే అందరూ ఆశ్చర్య పోతున్నారు.

కాశ్మీర్ విషయంలో దేశ భవిష్యత్తును నిర్ణయించవలసిన అధికారం ప్రజలదేకాని, సంస్థాధీశునిదికాదు అని బ్రిటిష్‌వారి ఇప్పటి వాదన.

పోని అట్లా అనుకున్నా - కాశ్మీర్ భారత దేశంలో కలిసినతరువాత రెండు సాధారణ యెన్నికలు జరిగినాయని. వానిలో, భారత దేశంతో విలీనాన్నికోరే నేషనల్ కాన్ఫరెన్స్' ప్రతినిధులనే ప్రజలు ఎన్నుకున్నారనే విషయం బ్రిటిష్‌వారు (యెందుకనో) గమనించటల్లేదు.

"యెందుకని?" అనేదానికి జవాబులు వెతుక్కుంటే 'మోడరన్ వెస్ట్రన్ డిప్లమెసీ" మీద ఒక ఉద్గ్రంథం తయారవుతుందేగాని, సంతృప్తినిచ్చే జవాబు ఒక్కటీ మనకు కనిపించదు.

మరో బాధాకరమైన విషయం—

పాకిస్తాన్‌లో మతోన్మాదులు చేసే అమానుష చర్యలను భరించలేక (ఈ నాటికి) దాదాపులక్షపాతికవేలమందిఅల్పసంఖ్యాకులు మనదేశం వారిపోయివచ్చారు. రోజుకు మూడువేలమంది చొప్పున శరణార్థులు వెల్లువలాగా తరలివస్తున్నారు ఇంకా. ప్రపంచాన్నే ఆందోళనపరుస్తున్న సంఘటన ఇది.

అయినా. బ్రిటిష్ పత్రికలు, అమెరికా పత్రికలు వీటి విషయాలేమీ పట్టించుకోకపోగా యదార్థ సత్యాలనుకూడా మభ్యపరచటానికి ఈనాడు ప్రయత్నం చేస్తున్నాయి.

యెందువల్ల పాకిస్తాన్‌మీద ఇంత అవ్యాజమైన ప్రేమ ఆ దేశాలు ప్రదర్శిస్తున్నాయో అర్థంకావటంలేదు.

ఆగ్నేయాసియాలో కమ్యూనిస్టు చైనా వల్ల సంభవించబోయే దండయాత్ర బెడదను యెదుర్కొనటానికి బ్రిటిష్ అమెకాలు ఒక సైనిక కూటాన్ని తయారుచేసినాయి. ఇది "సీటో". దీనిలో ఒకముఖ్యభాగాస్వామి పాకిస్తాన్.

అలాంటి పాకిస్తాన్ ఈనాడు చైనాతో ప్రగాఢమైన సంబంధ బాంధవ్యాన్ని ఏర్పరచుకుంది.

ఈ సంఘటన బ్రిటన్ అమెరికాలను కాస్త ఇరకాటంలో పెడుతున్నమాట వాస్తవమే. అయినా బహిరంగంగా ఆ రెండు దేశాలు పాకిస్తాన్‌ను మందలించలేక పోతున్నాయి.

అంతకన్న ముఖ్యమైన విషయం లడఖ్ రక్షణ సమస్య—

యుద్ధతంత్రరీత్యా దక్షిణాసియా సంరక్షణలో "లడఖ్" ఒక కీలకస్థావరం.

ఈనాడు దీని రక్షణ బాధ్యతలు భారత దేశానివి. ఇది అనాదినుంచీ ప్రపంచం గుర్తించిన విషయం.

రేపు, కీడెంచి - మేలెంచమన్నట్లు, కాశ్మీర్‌లోయ పాకిస్తాన్ హస్తగతం అయిపోతే—భారత సైన్యాలు 'లడఖ్ చేరుకోటానికి 'దారి తెగిపోతుంది.' లడఖ్‌తో భారత దేశానికి యెట్టి సంబంధమూలేకుండా పోతుంది.



తూర్పుపాకిస్తాన్ నుంచి మనదేశంలోకి తండోపతండాలుగా వచ్చిపడుతున్న శరణార్థులు

అంతేకాదు—ఇప్పటికి 'టిబెట్' ను ఆక్రమించుకుని తమ కబంధహస్తాలను ఇంకా ముందుకు చాచుకువస్తున్న చైనా వారికి, కాశ్మీర్ పాకిస్తాన్ చేతులలోకి వెళ్ళిపోతే 'లడఖ్' ను ఆక్రమించుకోవటం చాలా తేలిక.

అప్పుడు భారత పాకిస్తాన్ దేశాలు రెండింటికి 'నిప్పులకుంపటి నెత్తిమీద పెట్టుకున్నట్లే' అవుతుంది.

ఆగ్నేయాసియాలో కమ్యూనిస్టు చైనా దండయాత్ర బెడద యెంత భయంకరంగా అప్పుడు వుంటుందో వేరేచెప్పనక్కరలేదు.

అయినా - ఇన్ని విషయాలు, నాలాటి వారికికూడా తెలిసిపోయి భయపడుతున్నా - ఆ బ్రిటిష్ అమెరికాల విదేశాంగ శాఖలవారు వీటిని యెంతమాత్రం యెందుకు పట్టించుకోవటంలేదో ఎవరికీ అర్థంకాకుండావున్నది.

మా పక్కవీధిలో తెలుగు మాష్టరు మాత్రం దీనికికారణం. 'వినాశకాలే విపరీత బుద్ధిః' అని ఎనాడో మనవాళ్ళు రాసివేశారంటున్నారు. భారతంలో ధృతరాష్ట్రుడి పాత్రను జ్ఞాపకం చేశారాయన.

ఏది యేమైనా పార్లమెంటులో మొన్న ప్రధాని నెహ్రూ చేసిన ఉపన్యాసంమాత్రం అందరికీ యెంతో ఉత్సాహాన్ని యిచ్చింది. "అవసరమైతే కాశ్మీర్‌లో యుద్ధవిరమణ శ్రేణిని దాటి అయినా సరే, పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెపుతాం" అన్నారాయన. ఎంతో హర్షించదగిన విషయం యిది.

● ● ●

రాష్ట్ర రాజకీయం

రాష్ట్ర రాజకీయంలో కొంత నిలకడ కాస్తంత స్తిమితం యేర్పడింది. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య ఎన్నిక కావటం, రాష్ట్ర శాసనసభా నాయకుడుగా శ్రీ సంజీవరెడ్డి 'గంభీరంగా' నిలబడితే వారి అండదండలతో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి పదవిని చెలాయించటం, రాష్ట్రప్రభుత్వానికి కొంత స్తిమితాన్ని చేకూర్చింది.

అయినా రాజకీయం రాజకీయమే కాబట్టి యేదో ఒక పార్టీని అది అంటిపెట్టుకుంటూనే వుంటోంది రాష్ట్రంలో. ఇన్నాళ్లూ కాంగ్రెసు వంతైతే ఇప్పుడు దాని బాధ్యత కమ్యూనిస్టులమీద పడింది.

'కుడి యెడమల కుసుమపరాగం' కమ్యూనిస్టులలోకూడా ప్రవేశించింది.

మొన్న రాష్ట్రశాసనసభ నియోజకవర్గం నుంచి రాజ్యసభకు పోటీచేసిన 'అధికార కమ్యూనిస్టు అభ్యర్థి'తో మరొక అనధికార కమ్యూనిస్టు అభ్యర్థికూడా పోటీచేసి ఓడిపోయారు.

రాష్ట్ర శాసనసభలో కమ్యూనిస్టుల మొత్తం ఓట్లు యాభైరెండు. నిక్కచ్చిగా గెలవాలంటే యే అభ్యర్థికైనా నలభైఓట్లు రావాలి.

మరోవిషయం 'అధికారఅభ్యర్థిని ప్రతిఘటించకూడదని రాష్ట్రపార్టీ ఆదేశాన్ని ఇచ్చింది. అయినా దీనిని ఉల్లంఘిస్తూనే శ్రీ సుందరయ్యగారివర్గం తమ 'అనధికార అభ్యర్థి'ని నిలబెట్టింది.

"కుడి యెడమల కుసుమపరాగం" మరింత గుబాళిస్తోంది.

చిత్రమేమిటంటే—క్రమశిక్షణకు కమ్యూనిస్టులది పెట్టిందిపేరు. సిద్ధాంతాలను నమ్మితే "అరుపుతాలు" వేసినా వారిలో 'విశ్వాసం' అచంచలంగానే వుండిపోతుంది. అందుకే వారిలోని ఈ విభేదాలు అంత లోతుగా, ఘాటుగా, ఘనంగా పాతుకుపోయినాయి.

ప్రొద్దున్నే ప్రశ్నలతో ప్రారంభం. మంత్రులు సమాధానాలు సరిగ్గా అందించటలేదని సభ్యుల 'మొత్తుకోళ్ళు'. అందిన సమాచారాన్నే అందజేస్తూన్నాం. అలా కాదనుకుంటే వేరే ప్రశ్న వెయ్యండి. వేరే సమాధానం చెబుతాం—జవాబు.

రాష్ట్రశాసనసభ మొన్నీమధ్యన ముఖ్యమంత్రిగారి నడిగిన ప్రశ్నలకు సకాలానికి సమాధానాలు (జాబితాలోయెక్కిన ప్రశ్నలకు కూడా) అందలేదుకాబట్టి, ఆ ప్రశ్నలను మరో రోజుకు వాయిదావేశారు.

"సమాచారశాఖను నిర్వహిస్తున్న మంత్రికికూడా సకాలానికి సమాచారం అందలేదా అండీ" ఇది ఒక ఛలోక్తి (ముఖ్యమంత్రి సమాచారశాఖను కూడా నిర్వహిస్తున్నారు.)

ఒక కార్పొరేషన్ సరిగ్గా పనిచెయ్యటం లేదని చాలామంది సభ్యులు ఘాటుగా విమర్శించారు. లేదు, ఆ కార్పొరేషన్ చాలా దివ్యంగా పనిచేస్తోంది అని ఆ కార్పొరేషన్ అధికారి పంపిన 'రిపోర్టు'నే యథాతథంగా మంత్రిగారు చర్చకు సమాధానంగా చెప్పివేశారు.

చర్చలు ముగిసిన తరువాత, మంత్రిగారు సమాధానం చెప్పినతరువాతకూడా, సభ్యులు ఇంకా సందేహాలను వెలిబుచ్చుతూనేవుంటే — మళ్ళీమళ్ళీ మంత్రిగారు లేవబోతుంటే, వారితరఫునే స్పీకర్ జోక్యం కలుగజేసుకుని "మీరు చెప్పినవి బాగున్నాయి. అన్నింటినీ మంత్రిగారు ఆలోచిస్తారు" అని సమాధానం చెబుతారు.

"అవును ఆలోచించటానికి ప్రయత్నం చేస్తాం" అని మంత్రిగారి హామీ.

"ఆలోచనకు కూడా ప్రయత్నంకావాలా!" అని 'లాబీ'లో అనంతానికి సందేహం.

—అనంతం.

"నా మొహంలో ఏముంది ?"

"నా మొహం చూస్తే నీ కేమనిపిస్తోందీ ?" అన్నాడు అన్నయ్య.

"అంటే" అన్నాను. "ఇదేం ప్రశ్న" అనుకుంటూ.

"అదే. రౌడీగా కనిపిస్తున్నానా ? ఐడియలిస్టుగానా ? లేక పెసిమిస్టుగా ?" అన్నాడు.

నాకు వాడి ప్రశ్నల "తుదా" "మొదలు" తెలియటల్లేదు:

"బాగుంది. నన్నడిగితే నాకే యిస్టుగానూ కనిపించటల్లేదు. నాకు, అన్నయ్యగా ఇస్టుడుగా కనిపిస్తున్నావ్."

"పెద్ద తెలివిగా మాట్లాడకు. పూరికే అడుగుతున్నా. రౌడీగా కనిపిస్తాను కాబోలేం ?" అన్నాడు అన్నయ్యవిసుగ్గా.

"ఏ సైకాలజిస్టునన్నా సంప్రతించు" అన్నాను కొంచెం కోపంగా. వేసిన ప్రశ్న వెయ్యటమేకాకుండా నన్ను అనుమానిస్తున్నాడు.

"నీ అభిప్రాయం చెబుదూ !" అన్నయ్య గొంతులో యీసారి బ్రతిమాలే ధోరణి వినిపిస్తోంది.

"చెప్పటాని కేముంటుందీ ? నీ మొహంలోనూ ఒక ముక్కూ, నోరూ, కన్నూ, చెవి...."

"ఛాల్లే" నే చెప్పేదానికి మధ్యలోనే అడ్డొచ్చాడు అన్నయ్య చిరాగ్గా.

"సరే చెప్పటానికి ముందు ఏం జరిగిందో చెప్పాలి నాకు" అన్నాను సీరియస్‌గా.

"పిక్చరుకెళ్లాం, నేనూ, మరికొంతమంది స్నేహితులు కలిసి. ముగ్గురు అన్నగారూ, చెల్లెలూ, వదినగారూ కాబోలు, మేం కూర్చున్నవేపు కాకుండా అవతల తలుపు దగ్గర కూర్చున్నారు. అంతవరకూ బాగానే వుంది: ఇంట్రవల్‌లో మావాళ్ళు బఠానీలు కొని, ఒక్కొక్కళ్ళూ ఒక్కొక్క గింజ అమ్మాయిలు కూర్చున్న సీట్లో వేసొచ్చారు చీకట్లో పిక్చరు మొదలవబోతూండగా. నే వద్దని చెబుతూనేవున్నా. నామాటవింటేనా ?"

"ఇంతకీ నువ్వువెయ్యలేదా ?" అన్నాను అనుమానంగా.

"ఒట్టే. అలాటి పనులు చెయ్యాలన్నా, చేసేవాళ్ళని చూసినా, నువ్వే గుర్తొస్తావ్"

నాలో ఎక్కడో గర్వంతళుక్కుమంది.

"సరే, కానియ్" అన్నా.

"పిక్చరయిపోయింది. వాళ్ళంతా అటుపోతుంటే యథాలాపంగా నేను సినిమాని గుర్తుతెచ్చుకు నవ్వుకుంటూ ఖర్మం జాలక వాళ్ళు కూర్చున్న తలుపువేపు వెళ్తున్నాను. ఆ అమ్మాయి అన్నగారే అనుకుంటా, చటుక్కున్న కాలరే పట్టుకున్నాడో, చెయ్యే పట్టుకున్నాడో ఆ హడావుడిలో నాకు తెలీలేదు. తెల్లబోయి నోట మాటరాక నిల్చున్నాను. నలుగుర్నీ పోగుచేసి గట్టిగా అరుస్తున్నాడు. మా ప్రబుద్ధులూ వచ్చారు. హాలు మేనేజర్ని వెంట పెట్టుకుని. అతనంటాడూ-ఆ బఠానీలు నేనే వేశానని నా మొహమే చెబుతోందట. లేకపోతే నవ్వుకుంటూ అటెందుకు వెళ్తాననీ-అప్పట్నుంచీ చచ్చే భయంగా వుందనుకో. నా మొహంలో ఏం కనిపించకపోతే, నన్నే అపరాధిగా నిర్ణయిస్తారా ?"

"తర్వాతేం జరిగిందీ ?" అన్నాను.

"ఏం జరుగుతుందీ, మా వాళ్ళంతా ఆతే మాట్లాడే తంతామనీ, నా అంతమంచివాడు లేడనీ, కావాలంటే పెద్దపెద్దవాళ్ళ సాక్ష్యం తెస్తామనీ హడావుడిచేసి, అతనిచేత క్షమార్పణచెప్పించారనుకో. అయినా నా కేదివో బాధగానేవుంది. నా మొహాన్నిగురించి" అన్నాడు.

"ఫేస్ యీజ్ ది యిన్‌డెక్స్ ఆఫ్ ది మైండ్. బహుశా నువ్వుకూడా చెయ్యాలను

కుని వుంటావ్. దేవదాసు. దివోదాసు కథలో మాదిరి. ఒ క దే మో వేశ్యాలోలుడైకూడా భగవంతుని గురించి చింతపడేవాట్ట. రెండో వాడు భగవత్ప్రార్థనలో నిమగ్నమయినట్లే కనిపించినా, మనసులోమాత్రం మొదటివాడి అదృష్టానికి అసూయపడేవాట్ట. దే ము డు మొదటివాడ్నే కరుణించాడు" అ న్నా ను అన్నయ్యని యింకొంచెం వుడికించాలన్నట్లు.

"ఛా". అన్నయ్య మొహం వివర్ణమై పోయింది. నాకు జాలేసింది.

● ● ●

"పోతన భ క్తి ప రు డ ని, గుంటూ, గిండూతో వర్ణిస్తారుగానీ. అది తప్పు. పోతన ఎంత భక్తిరసంగా రాసినా. అతను చాలా శృంగార ప్రియుడు. శ్రీనాధుడు యెంత శృంగారం రాసినా ఆధ్యాత్మిక చింతన కల వాడు" అంటారు మా తెలుగు మేష్టారొకా యన. ఆ విషయం నాకట్టే తెలీదనుకోండి!

తేనెపూసిన క త్తి. పయోముఖ విష కుంభం. తడిగుడ్డతో గొంతులు కోయటం మొదలయిన మాటలు ఎలా వాడుకలోకి వచ్చాయో ? మనసులోమాట బైటికి తెలి యక పోవటం, ఆ తర్వాత వాళ్ళు చేసే పన్లు తెలియటంవల్లగదా! అ ర్ధ రా త్రి పన్నెండింటికి వచ్చి తలుపులు కొట్టే అతి ధిని చూడగానే "వీడిదుంపతెగ. వీడెందుకు వచ్చాడ్రా నిద్రచెడగొట్టేందుకా కపోతే" అనిపిస్తుంది మనసులో. మనసులో అనుకో గానే. ఆ మాటలబోర్డు మొహంమీదికొచ్చే మిషనేదన్నా వుంటే! అమ్మో! ఇంకే వన్నా వుందీ? తెల్లారిలేచింది మొదలు కొని 'ఎన్ని విసుగులూ. యింట్లో వాళ్ళ మీదా బైటివాళ్ళమీదాకూడా, ఎంతకథా!

అయినా, తప్పుచేసినవాళ్ళ మొ హం ఏదో విడిగా వుంటుందనుకోవటం హాస్యా స్పదమే! కనిపించకుండా నిబ్బరం నటించ గలవాళ్ళూ వుండవచ్చు. దొంగా! దొరా! అన్నారు. పట్టుబడనంతకాలం దొరేగా దొంగ?

కనుబొమ్మలూ. చెవులూ. ఆడవాళ్ళల్లో మగలక్షణాలు. వాతావరణం, వయస్సూ. వంశం, పెరిగిన పరిసరాలు. రాజకీయాలు. ఆర్థిక బాధలు, సమయాసమయాలు. మత వ్యవస్థా మొదలయిన కారణాలు. నేరస్థులను తయారు చేస్తాయని. నే ర ం చేసేందుకు దోహదం చేస్తాయనీ అంటారు. వాటిలో కొన్ని నిరాధారమైనవి. ఎవరికన్నా తమని చూస్తే తమకి అసహ్యంవేస్తుందా? ఏదో పత్రికలో కాబోలు ఒక కథ చదివాను. ఒక రాజకుమార్తెని నువ్వు కురూపివని, పదేపదే వేధిస్తూంటుందొక అవ్వ. నిజమే కాబోలని ఆమె మనోవ్యాధిపడుతుంది. ఆ మె ని ప్రేమించినవాడికి. కా ద ని నమ్మించట మెలాగో తెలీదు. ఏదో కారణంవల్ల అతని కత్తిలో ఆమె ప్రతిబింబం కనిపించి. ఎంత మురిసిపోతుందనీ?

ఒకసారి క్లాస్ ఫొటో వ చ్చిం ది. అం ద రూ ఎగబడుతున్నారు మేష్టారు మటుకూ, ఫొటో యివ్వకుండా ఒక్కొక్కళ్ళ మొహాలు పరిశీలిస్తున్నారు.

"మీలో చాలామందిలో, మ న మె లా వున్నా మా ఫొటోలో అని కాక వాళ్ళూ, వీళ్ళూ. ఎలా వున్నారో చూ ద్దా మ న్న కుతూహలం కనిపిస్తోంది. అది తప్పు. మీ మొహాన్ని మీకు మీరు ప్రేమించాలి. ఆ తర్వాతనేఎవరిదయినా.ఇంద, ఎవరిమొహాలు వాళ్ళు చూసుకోండి" అన్నారు.

ఆయన చెప్పిన అభిప్రాయం అందరికీ స రి పో యి నా, సరిపోకపోయినా, నాకు మటుకూ, ఆ క్షణంలో సరిగాసరిపోయింది. ఫొటోకు పోజులివ్వటం చేతయినవాళ్ళూ, "మాది ఫొటో జెనిక్ ఫేస్" అన్నవాళ్ళూ. "వ్ప ఏవిటో. సైముకి తలదించేసేను." "ఎలావుంటే ఏం? సినిమాల్లో చేరబోవట ల్లేదుగా" అనేవాళ్లూ. రకరకాలు. ఒకరనే మిటి? అందుకే అత్రుత ఏమిటో? ఈ సంగతి ఎలా కనుక్కున్నారూ ఆయన? అనుభవం సార్; అనుభవం! □□□

—కె. త్రిపుర.



"నవో నవో భవతి జాయమానః"

"ఆశీర్వచనపు వనస-అమ్మయ్యా!" అనుకున్నాడు సుబ్బా

రాయుడు రిక్షాదిగుతూ.

అక్షతలు జల్లి యువతులకు వస్తున్న ఒక ముసలాయన పలకరించేడు–

"— ఇప్పుడా రావడం !"

'బండి గంటలేటు'.

ఎరిగినవాళ్ళ యింకో యిద్దరు పలకరించేరు సుబ్బారాయుణ్ణి. ఎరగని వాళ్ళకు పరిచయం చేసేడు ముసలాయన.

"పావన రామయ్య బావమరిది! ఎరుగుదువుకదూ! నీలవేణమ్మకు స్వయానా తమ్ముడు."

సుబ్బారాయుడు సన్నగా పొడుగ్గా తుదవంగిన చెఱకు గడలా ఉంటాడు. ముతక గుడ్డలు. ముతక మొహం.

సుబ్బారాయుడికి ఎవరో పీట ఇచ్చేరు. ఇంకెవరో చేతికి తువ్వాలిచ్చేరు.

"రిక్షావాడికి కూలెంత బావా!" అని పావనరామయ్య పినతల్లి కొడుకు అడిగేడు.

"అర్ధరూపాయి" అని "నే నిస్తాను" అన్నాడు.

చేతులు తుడుచుకుంటూ సుబ్బారాయుడు లోనికి వెళ్ళేసరికి పావనరామయ్య అప్పుడే పీటలమీంచిలేచి సభకు నమస్కరిస్తున్నాడు. పురోహితుడు తనకి రావల్సినవి నోట్లు కుంటూ "సభాయైనమః" అన్నాడు గొణుగుడుగా.

పావనరామయ్య ఒకచాయ నల్లగా కొంచెం వల్చగా ఉంటాడు. ఎర్రని పాత పట్టు తాపితా కట్టుకున్నాడు. దాని రంగు చాలా వెలిసి తూట్లుపడి ఉన్నది. అతడి జుత్తు చాలావరకూ తెల్లపడింది. అరవయ్యో పడి సమీపించినా అంతకన్నా చిన్నవాడిలా ఉంటాడు.

నీలవేణమ్మ పొట్టిగా కొంచెం స్థూలంగా ఉంటుంది. బావమరిదిని చూసి పావనరామయ్య-

"సుందరం స్టేషన్‌లో కనపళ్ళేదూ?" అన్నాడు.

అది అతడు పలకరించే పద్ధతి.

"రిక్షావాడి కిల్లు గుర్తులు చెప్పి వాడేదో సామాను కొనాలని దిగబడ్డాడు." అప్పగారికేసి చూస్తూ జవాబిచ్చేడు.

"వంట బ్రాహ్మడు గోధుమ్నూక చాల్లేదంటే తెమ్మన్నాను."—నీలవేణమ్మ మాటలో మాట కలిపి వెళ్ళిపోయింది.

పావనరామయ్య సుబ్బారాయుణ్ణి లోపలికి వెళ్ళమని చెప్పి తను వీధిలోకి వెళ్ళేడు.

దిగంతాల మంచు తెరలింకా విడుతూనే ఉన్నాయి. సూర్యోదయమై నిండా పొడియ ప్రొద్దవుతుంది. ఎదుట దక్షిణ దిశను నగరం ఏటవాలుగా పరుచుకుని ఉన్నది.

"చక్కటి దృశ్యంరా అబ్బీ! ఆ ఎదురుగా వేసిన పునాదులమీద ఇల్లు లేచిపోతే ఏమీలేదు."

కాశీపట్నపు రామారావు

ముసలాయన పావనరామయ్యకు బాబయ్య అవుతాడు. స్కూల్ మేష్టరీ చేసి రిటైర్ అయ్యాడు. ఇప్పటికీ ప్రైవేట్లు చెపుతాడు.

"ఏమున్నది ఇంకో ఆరునెల్లు పోయాక వస్తే యీ యిల్లు యెక్కడని వెతుక్కోవలసిందే."

పావనరామయ్య స్నేహితుడన్నాడు.

"రా! కూర్చో!!" అన్నాడొకతను. మరొకాయన జరిగి చోటిచ్చాడు.

కూర్చుంటూ "ఇంకా ఎవరూ రాలే" దన్నాడు పావన రామయ్య. వాకిట్లోనిలబడి చుట్టలు కాలుస్తున్న వాళ్ళిద్దరూ పై ఊరు నుండి వచ్చిన బంధువులు.

"చలి! అందునా ఇవాళ విపరీతమైన మంచు. సముద్రపొద్దున చలి వెయ్యదంటారు!" వాళ్ళల్లో ఒకడన్నాడు.

పావనరామయ్య ఇంటికి తూర్పునఉన్న పెద్ద డాబా నీడ పెరటికేసి వ్యాపించి ఉండడం చూస్తున్నాడు.

"బాబూ ఇప్పటికి గృహప్రవేశం తంతయ్యింది. ఇంక సత్యనారాయణవ్రతం- వెంకటేశ్వర దీపారాధనా కావాలి. అర గంటలో వర్జంవస్తుంది".

—పురోహితుడు.

పావనరామయ్య లేచి పెరట్లోకివెళ్లాడు. పెరట్లోకూడా చిన్న పందిరిఉన్నది. దానికి తూర్పుకేసి గాడిపొయ్యి ఉన్నది. నలుగురు ఆడవాళ్లు ఎండలోచేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇద్దరు ఆడవాళ్ళు వంట బ్రాహ్మడికి చెకచెక కూరలు తరుగుతున్నారు. పిల్లలు కొందరు ఆకలి కేడుస్తున్నారు. ఒకావిడ తీరిగ్గా బిగించి బిగించి జడవేసుకుంటూంది.

పావన రామయ్య ఆడవాళ్ళను కదిలించడానికి చేసే ప్రయత్నం కలిసి రావడంలేదు. అప్పుడే స్నానం చేసి వస్తున్న సుబ్బారాయుడు "నువ్వువద! నే నన్నీ ఏర్పాటు చేస్తా"నన్నాడు.

2

పగలు పదకొండు గంటలవుతుంది. పావన రామయ్యగారిల్లు కిటకిటలాడుతోంది.

శుభకార్యం జరుగుతున్న నట్టింట ఆడవాళ్ళూ పిల్లలూ - కొందరు ముసలివాళ్ళూ- ఇరికిరికి కూర్చున్నారు. వీధి వరండాలో స్నేహితులూ తన బంధువులూ కూర్చున్నారు. చోటు చాలనివాళ్లూ, ఎండకావలసిన వాళ్ళూ కొందరు రోడ్డుమీదా వాకిటా నిల్చుని పొగలు పీలుస్తూ దిక్కులు చూస్తున్నారు. పడమటి గోడనీడను పడుచుపిల్లలు కొందరు మంచాలేసుక్కూర్చుని కబుర్లు చెప్తూ గడబిడ చేస్తూ మిడిసి మిడిసి పడుతున్నారు.

పాత జార్జెట్ చీరలూ అంతకన్నా పాత పట్టుచీరలూ కట్టుకున్న కొందరు ఆడవాళ్ళ పెరటి ఎండలోనుండి ఇంటినీడలోకి నీడలోనుండి ఎండలోకీ తిరుగుతున్నారు. ఒకటి రెండు చీరలప్పు డప్పుడూ పడమటి గోడచుట్టి వీధిలోకి వచ్చి వెనక్కిపోతున్నాయి.

గాడీమీద ఆవిర్లొస్తున్న అండాలు వంట బ్రాహ్మడు దింపుతున్నాడు. దిగిన వేడి వేడి అండాలను యింటిలోకి సాయం పడుతున్నాడు.

ఆ యింటికి పడమటివైపున క్రొత్తగా పడుతున్న పునాదుల వెనుక—వాచరు పూరిపాక గుమ్మంలో కూర్చున్న ఏడేళ్ళ పిల్లవాడికి ఆ యిల్లు చీమలు పట్టిన కలకండ ముక్కలా ఉన్నది. ఆ పునాదుల కెదురుగా ఉన్న మేడమీద ఉన్న ఓ పదహారేళ్ళ అమ్మాయి యిదంతా తీరిగ్గా చూస్తున్నది. ఆమె కా సీను వాళ్ళ ఆర్టిస్టు బావ రంగులు తుడుచుకునే తెల్లటి పాత షర్టు ముక్కలా గున్నది.

అంతవరకూ అందరికీ అన్నీ అందిస్తూ వచ్చిన సుందరం ఇంతమందికి భోజనాల ఏర్పాటు ఎక్కడ ? ఎలా ?' అన్న ప్రశ్న ఎదురుపడగా హడావుడిగా మేనమామను వెతుక్కుంటూ బయలుదేరేడు.

అతడు పెరట్లో గాడిపొయ్యి ;దగ్గర దొరకలేదు. వీధిలో జనంమధ్యన ఉన్నా డేమోనని వెళ్ళేడు.

"వీడే"—అన్నాడు తాతగారు. సుందరం నిర్ఘాంతపోయేడు.

"ఐదుగురు మగపిల్లలకూ దక్కినవాడు వీడొక్కడే ఉన్నాడు. ముగ్గురాడ పిల్లలకూ ఇందాక నాకు మంచినీళ్ళు తెచ్చిపెట్టిన పిల్ల సూర్యమణి ఉన్నది."

అందరిచూపులూ ఒక్కసారి సుందరం వంక తిరిగాయి.

సుందరానికి యిరవై యేళ్ళంటే ఎవరూ నమ్మరు. వాడి ముఖంమీద వున్న పెద్ద పెద్దగంట్లుచూస్తే వాడైనా పొరపాటున బ్రతికిపోయాడని తెలుస్తుంది. ఎటొచ్చీ వాడివి పెద్దపెద్ద కళ్ళు.

అంతమంది ఒక్కసారి తనవంక అలా చూసేసరికి వాడు వచ్చినపని మరిచి వెళ్ళి పోయేడు.

"పెద్దవాడు యిరవైయేళ్ళవాడు. ఫస్టు క్లాసులో డిగ్రీపుచ్చుకున్నాడు. ఉద్యోగంలో చేరి నిండా నెల తిరగలేదు. ఆస్పత్రిలో చేర్చేరు. ఆస్పత్రిలో చేర్చిన పదిహేను రోజులనాడు హరీమనేశాడు. ఆ షాకునుండి తేరుకోకుండానే రెండో దెబ్బ. పద్దెనిమిదేళ్ల పెంచి పెద్దదాన్ని చేసేరు ఆడపిల్లను. వెయ్యి రూపాయిలు కట్నం. పదిహేనువందలు యితర ఖర్చులు. కడుపుతోఉంది. ఇవాళో రేపో కంటుంది. మనవడా, మనవరాలా అని ఎదురుచూస్తున్నారు. ఆ పిల్ల అసలుకే మోసంచేసిపోయింది...."

విన్నవాళ్ళు వింటున్నారు. విననివాళ్ళు కొందరింకే వేవో కబుర్లు చెప్పుకుంటు న్నారు. అందరూ తంతు ఎప్పుడు ముగు స్తుందాఅని చూస్తున్నారు.

చివరకు ముగిసింది. పీటలమీంచి లేచిన వాళ్ళతోపాటు తక్కినవాళ్లుకూడా లేచేరు.

కొంతమంది యింటిలోనుండి బయటకు వెళుతున్నారు. మరికొంతమంది బయట నుండి లోనికి వెళుతున్నారు.

ఇల్లు చిన్నదన్నాడు ఒకాయన. చిన్న వీధికొట్టు. అంతకన్నా కొంచెం పెద్దది వరండా. మధ్యను ఒకటే పెద్దగది. గది నానుకొని వరండా, వంటగది ఉన్నవి. ఆ వెనుక తగుమాత్రం పెరడున్నది. ఈశాన్యమూలను లెట్రిన్. వాయవ్య మూలను నూయి.

ఇల్లు బొమ్మరిల్లులా ఉన్నాదన్నాడు ఒకాయన.

ఇల్లు బాగున్నదన్నా డింకొకాయన.

"నుయ్యి మనదేనా ?" అడిగా డెవడో.

"ఉమ్మడి" అన్నాడు ప్రక్కాయన.

"ఎవరు"

"ఈ యిల్లు అమ్మిన వాళ్ళే"

నట్టింట నిలుచుని దానికి సరిపడా ఉన్న ఓ పట్టుచీరావిడ అడుగుతోంది—

"కోడలొస్తే కొడుకూ కోడలూ ఎక్క డుంటారు ?"

"పండుక్కి కూతురొస్తే కోడలు వెళ తుంది. ఫరవాలేదు." అనుకుంది ఒక పిల్లల తల్లి.

వీధిలో రోడ్డుమీద నిల్చుని వళ్లు విరుచు కుంటున్న ఆవలింతలు రాయుడు - అంతా అయ్యాక అన్నాడు.

"అన్నీ సరిపెట్టుకోవచ్చుగాని ఒక్కటే యిబ్బంది"

ప్రక్కవాడు ఏమని ప్రశ్నించలేదు.

"చుట్టూ అన్నీ ఎత్తునఉన్న ఇల్లు. ఆడ వాళ్ళు ఏ చిన్నగుడ్డో కట్టుకొని పెరట్లోనైనా తిరగడానికి వీలుండదు.

దీర్ఘదర్శి దీర్ఘదృష్టులను గమనించి విస్తు పోయాడు రెండవవాడు.

వెళ్ళినవాళ్ళు వెళ్ళగా ఉన్నవాళ్ళు భోజ నాలకు లేచేసరికి పన్నెండు దాటింది.

సుబ్బారాయుడు వీధివరండాకు దుప్పట్లూ వగైరాలుకట్టి దానినికూడా ఉప యోగంలోకి తెచ్చాడు. మొదటి పంక్తిలో మొగవాళ్ళూ పిల్లలూలేస్తే రెండవ బంతిలో ఆడవాళ్ళు కూర్చున్నారు.

"పిల్ల చామనచాయైనా పెద్దకళ్ళూ కళైన ముఖం. పరిశుభ్రతా మాట మృదువూ-అన్నీ ఉన్నాయి. మరి దీని ఖర్మం ఎలాఉన్నదో."

—అన్నదొకావిడ.

సూర్యమణి సన్నగా సళాకులా దట్టమైన నిడుపాటి కురులతో నీటుగా వోణీ చెంగు మొలను ముడిచి వడ్డిస్తోంది-వరుసలుపెట్టి.

"పిల్లకు పదహారేళ్లు ఉండవూ ?" అన్న దొకావిడ.

"ఉండకేం మొన్న పెళ్ళయిన మా చిట్టీ ఇదీ ఒక్కతోటివాళ్ళే."

ఎదుటిపంక్తినుండి జవాబు వచ్చింది.

"ఉండనిస్తూ ! ఇప్పుడేం తొందర వచ్చింది ?"

ఇంకొకావిడ.

● ఆంధ్ర రాజధానిని చూడ్డానికి వెళ్ళిన ఓ పల్లెటూరి ఆసామీ ఒక పెద్ద హోటలుకి వెళ్ళాడు. హోటల్ యజమాని గది అద్దె వివరాలూ అన్నీ చెప్పి "ఉదయం ఐదునుంచి పదకొండువరకు కాఫీ టిఫిన్లు. పదకొండునుంచి రెండు గంటలవరకు భోజనం, మళ్ళీ రెండునుంచి ఆరుగంటలవరకు కాఫీ టిఫిన్లు. రాత్రి పదిన్నవరకు భోజనం సప్లయి చేస్తాము." అని ముగించాడు.

"ఇలా అయితే ఊరుచూడ్డమెప్పుడూ ?" అని పల్లెటూరాయన హోటల్లోంచి పైకి వచ్చేశాడు.

— రమణమూర్తి.

పిల్లల్ని పెట్టుక భోజనాలు కానిస్తున్న ఆ ఆడవాళ్ళలో సూర్యమణి వంక జాలిగా చూసేవారు జాలిగా చూస్తే, ఆశగా చూసేవారు కొందరు ఆశగా చూశారు. ఒక శ్శిద్దరికి ఆ పిల్లకూడా తిన్నుకుంటున్నట్టూ విరగబడి పోతున్నట్టూ కనిపించింది.

భోజనాలయ్యాక ఇంటికి తూర్పుకేసి చేరిన నీడను రెండు మంచాలు - మూడు కుర్చీలు వడేసుకొని ఐదుగురు మగవాళ్ళు ఆయాసం తీర్చుకుంటున్నారు.

వాళ్ళల్లో ఇద్దరు నడికారువారు మంచా లెక్కారు. ఒకాయన వెల్లకిలా పరుండి నీలాల నింగికేసి చూస్తున్నాడు. అతడు కలెక్టరాఫీసులో ఏదో సెక్షనులో ఏదో గుమస్తాగా పనిచేస్తున్నాడు. రెండవఆయన ఒక తలగడాకూడా సంపాదించి పట్టెమంచం మీద బోర్లగిలా పడుకొని ఎదురుగా కనిపిస్తున్న గడ్డిమొక్కల్లోకి చూపులు వదలి మనసును ఇంకేదో లోకాల్లో పారాడనిస్తున్నాడు. అతడు జిల్లాకోర్టులో బాగా ప్రాక్టీసుఉన్న లాయరువద్ద చాలాకాలంగా పనిచేస్తూఉన్న ప్లీడరుగుమస్తా.

మడత కుర్చీలో కూర్చున్న మనిషికి ముప్ఫయిఐదేళ్ళుంటాయి. ఒక్కడంటే ఒక్కడే కొడుకు. ఒక్కర్తంటే ఒక్కతే కూతురు. లోకల్ ఎన్. జి. ఓస్ అసోసియేషనుకు శ్రకటరీ. కాస్తంత కవి. కొంచెం నటకుడు చాలా భావుకుడు. కండ్లనున్న కండ్లద్దాలలోనుండి ఆ చుట్టువున్న మేడల్ని చూస్తూ వాటిగురించి భావిస్తున్నాడు.

ఎ. పీ. టి. యస్. ఆఫీసు క్లర్కుకి ముప్ఫయియేళ్ళేఉంటాయి. అతడు పేంటు మడతలు నలక్కుండా పొందిగ్గా పేము కుర్చీలో కూర్చున్నాడు. దర్జాగా కాళ్ళు ఊపడం అలవాటు ఇప్పుడు అప్రయత్నంగా కూడా సాగుతూఉన్నది.

చేతుల్లేని కర్రకుర్చీలో యిబ్బందిగా కూర్చున్న అబ్బాయి యీమధ్యనే యూనివర్సిటీ చదువు ముగించి సిండియాలో ఉద్యోగంకూడా చేస్తున్నాడని వినికిడి.

నీలాల నింగికేసి చూస్తున్న పెద్ద గుమస్తా చూసిచూసి అన్నాడు.

"పశువులకూ పక్షులకూ కూడా తమ స్వంత గూడంటూ ఒకటి ఉంటుంది. మనిషి చచ్చిందాకా బ్రతికికూడా గూడు కట్టుకోలేక పోతున్నాడు. దీనికి ఎవరిని ఏమనాలో తెలియడంలేదు" అన్నా డాయన.

ఎవరూ ఏమీ అనలేదు.

"బ్రతుకు బ్రతుకల్లా బ్రతికి కూడబెట్టిందంతా ధారపోస్తేగాని ఒక గూడు రాకపోవడం చాలా అన్యాయం" అన్నాడు ఆయనే. ఈసారి జవాబు వచ్చింది.

"ఎంతయ్యింది ఏమిటి?" అన్నాడు పేముకుర్చీలో ఆయన కాళ్ళూపడడం ఆపకుండానే.

"ఆరువేలు!''

ఈసారి కాళ్ళూగడం ఆగిపోయింది.

"ఆరువేలే!!''

ఆ రేటున తాను కట్టదలచిన యింటికి యెంతలేదన్నా పదిహేనువేలుదాకా అయ్యేట్టుంది. అతడికాళ్ళు మళ్లా ఊగడం ప్రారంభించాయి.

"అద్దైనా యీ వాడలో కొంపట్టి!—'' అనిక్షణ మాగి "యీ పెన్షన్ ఉద్యోగంకన్నా పి. యఫ్. ఉద్యోగాలేనయమేమో!'' అన్నాడు మొదటాయన.

"వాళ్ళ నడుగుతే ఇంకోలా అంటారు''

మడత కుర్చీలో వాడు మొదటిసారి మాటాడాడు.

"చూస్తే మనలాటివాళ్ళ బ్రతుకు కొసవరకు అద్దె కొంపలలోనే గడిచేటట్టున్నది" పేముకుర్చీ.

"మనబ్రతుక్కా- అద్దెకొంపైనా ఉన్నది. అదీ లేనివాళ్ళ సంగతో" అన్నాడు ప్లీడరు గుమస్తా.

"ఆకాడికి మనకన్నా పల్లెటూళ్ళవాళ్ళే నయం. తినటానికి తిండిమాట ఎలాఉన్నా ప్రతివారికీ ఉండటానికో ఇల్లంటూ ఉంటుంది." పేముకుర్చీ.

"పూరిపాకలు మనమూ వేసుకోవచ్చు. మన ఉండటానికి నామోషీగాని" కర్రకుర్చీలో యూనివర్సిటీ అబ్బాయికూడా మాట కలిపాడు.

"వేసుకచూస్తే తెలుస్తుంది. మర్నాటికి మునిసిపాలిటీవారు సిద్ధం." ప్లీడరుగుమస్తా.

"ఊర్లో ఉన్న పాకలన్నీ ఏమిటి?"

"వెళ్ళి అడగండి వాళ్ళు ఎందరినోళ్ళు ఎలా మూస్తున్నారో తెలుస్తుంది?"

"ఏం? పాక వేసుకుంటే మునిసిపాలిటీ వారి కభ్యంతర మేమిటి?", పేముకుర్చీ ఆయన అడిగాడు.

"మీ పాక అంటుకుంటే మామేడ కాలిపోతుంది" మడతకుర్చీ ఆయన చెప్పాడు.

"అది చాలా అన్యాయం."

"మీరు స్వయంగా మేడకట్టిననాడనండి" ప్లీడరుగుమాస్తా.

"మీరు మేడకట్టరాదని నేనంటే"

"అనడం అందరం అంటాం. అక్టులు కొందరే చేస్తారు" మడతకుర్చీఆయన జవాబిచ్చాడు.

యూనివర్సిటీలో చదివిన అబ్బాయి కొంతసేపు ఊరుకొని అడిగాడు.

"నాకు తెలియకడుగుతాను. మనుషులు మేడకట్టడం పురోగమన మంటారా లేక పాకలు కట్టడం పురోగమనమంటారా?"

"పదిమంది మేడదిగుతూఉంటే దిగుతున్నారంటాను.

పదిమంది మేడ ఎక్కుతూఉంటే ఎక్కుతున్నారంటాను.

నలుగురు దిగి నలభైమంది ఎక్కుతూ ఉంటే చూసిననాడు జనం ఎక్కుతున్నారనే అంటాను"

యూనివర్సిటీ అబ్బాయి ఓటమి నంగీకరించలేదు. నవ్వుతూ అన్నాడు.

"ఉపమానాలతో చేసే తర్కం ఎంత పనైనాచేస్తుంది. దానితో నందిని పందినీ చెయ్యవచ్చు. పందిని నందినీ చెయ్యవచ్చు"

"అవును నిర్గుణుడని తెలుసుకున్నాక కూడా కొందరు అవసరంకొద్దీ దేవుణ్ణి సగుణుణ్ణిగానే ఉంచితే మరికొందరు ఆ పందినే దేవుడనుకొని మొక్కం డని కూడా అంటూవుంటారు."

వాదం వివాదమౌతుందేమోనని పేము కుర్చీఆయన భయపడ్డాడు కాని కాలేదు. మడతకుర్చీఆయన మరికొంత సేపయాక అన్నాడు.

"జీవితావసరాలన్నింటికీ రేషనింగులు పెట్టిన ప్రభుత్వాలు బియ్యం పంచదారల

వంటివాటికి మాత్రమే రేషనింగులు ఏల పెడతాయో తెలుసా."

"జనం చచ్చిపోతారు కాబట్టి." పేము కుర్చీ.

"కావలసినవాళ్ళు ఎంత దాచుకున్నా పట్టుబడరు కాబట్టి"-ప్లీడరుగుమాస్తా.

"ప్రభుత్వాలు కూలుతాయని" యూనివర్సిటీ అబ్బాయి నవ్వుతూ అన్నాడు.

"కాదు, జనంలో చాలామందికి ఊర కుక్కల్లా బ్రతకటానికి అభ్యంతరంలేదు కాబట్టి"

ఆతరువాత అతడేమన్నా యింకెవరూ అతడి నోట నోరు పెట్టలేదు.

ఆనాడు ఎంద రెన్ని చెప్పినా సీలవేణమ్మ భోజనానికి లేవలేదు.

పీటలమీంచి లేస్తూనే వెళ్ళి పెరట్లో ఒక నులక మంచం వడేసుక పడుకుంది. ఎవరో వచ్చి—ఏమని అడిగితే ఒంట్లో బాగులేదంది. ఆమెకు తన వంకా భర్త వంకా బంధువులు ఆడవాళ్ళల్లో కొందరు వున్నారు. వాళ్ళు 'మేం చూసుకుంటాం నువ్వు పడుకో' అన్నారు. తీరా ఆడవాళ్ళ పంక్తిని భోజనానికి లెమ్మంటే ఆమె ఏడుస్తున్నది.

శుభమా అని గృహప్రవేశమౌతూ ఏడవ రాదన్నారు. శుక్రవారంపూట నిండింట కంట తడిపెట్ట రాదన్నారు. పిల్ల బెగిలిపోతోంది చూసుకోమన్నారు. ఎవరెన్ని చెప్పినా ఆమె దుఃఖం ఆపుకోలేదు.

"అవిడగారంతే! మీరు పదండి!!" అని గదిమింది ఆడబడుచు - చుట్టూమూగిన ఆడవాళ్ళను.

సీలవేణమ్మ ప్రవర్తన చూస్తే చాలా మందికి చాలా కారణాలవల్ల ఎంతో కొంత కోపంవస్తుంది. ఒక్క పావన రామయ్యకు మాత్రం ఆమె ప్రవర్తనకు కోపంరాదు.

ఆమెతో రమారమి నలభై యేండ్లయి అతడు కాపురం చేస్తున్నాడు. మొదట్టి ఐదారేండ్లూ బాధ్యత గుర్తించలేని అజ్ఞానంలో వాళ్ళే కొంతహాయి అనుభవించారో అంతే. ఆ తరువాత ఉద్యోగం మీద చెంబులూ గిన్నెలూ పేకేజీ దొక్కులూ ఇనుపసామానూ కుక్కి-కుక్కి మంచాలూ పెట్టె బళ్ళల్లో రైళ్ళల్లో బస్సుల్లో వేసుకొని వాళ్ళెన్నెన్ని ఊళ్ళు తిరిగారో వాళ్ళకే తెలియాలి.

చీకటి కొట్లలో పూరియిళ్లల్లో పాడుపడ్డ కొంపల్లో ఒంటి ఒంటి గదుల్లో మురికిలో చీదరలో అద్దెల కిచ్చిన యజమానులతో అద్దెలకున్న పొరుగువాళ్ళతో అద్దెల వసూలు కొచ్చే ఆసాములతో వాళ్ళెన్నెన్ని పాట్లుపడ్డారో వాళ్ళకే తెలియాలి.

పురుళ్ళతో పుణ్యాహవాచనాలతో శాంతులతో బాలీచాలని పాలకేడ్చే చంటిపిల్లల కింకఏడ్పులతో పాలడబ్బాలతో, జబ్బు గేదెల నీళ్ళపాలతో కంట్రోళ్ళతో బ్లాక్ మార్కెట్‌లతో ఉప్పుడు బియ్యాల స్టేండర్డ్ గుడ్డల రేషనింగ్‌లతో మందులతో పిల్లల కడుపుల బల్లలతో వాంతులతో భేదులతో అమ్మవార్లతో ఆటలమ్మలతో వాటితోనే ప్రయాణాలతో వారాలకొద్దీ జాగారాలతో నెలాఖరులో చావులతో వాళ్ళెన్ని కష్టాలుపడ్డారో వాళ్ళకే తెలియాలి.

చుట్టాలు - చుట్టాల చుట్టాలు - చుట్టాల పెళ్ళిళ్ళు - వడుగులు - తమయింటి వియ్యాలవారు - తమ పిల్లల చదువులు - వాళ్ళ వడుగులు - వాళ్ళ పెళ్ళిళ్ళు -

ఇన్నింటినీ తట్టుకున్నాడు. తట్టుకున్నారంటే కడుపునీ కంటినీ కాలునీ-అన్నింటినీ కట్టుకొని తట్టుకొన్నారు.

కాని వాళ్ళు తట్టుకోలేనిది ఒక్కటే— కడుపుశోకం!

కడుపు శోకమేమీ క్రొత్తదికాదు. అది కడుపు శోకమని తమ్ము తాము నమ్మించుకుంటే వారు దానినికూడా తట్టుకునేవారు.

నాలుగోఏట మొట్టమొదట కడుపుశోకం రుచి చూపిన అమ్మాయిని తాను బాది బాది చంపేశానని అంటుంది సీలవేణమ్మ. మూడవఏట కడుపు బల్లతో పోయిన ఐదవ అబ్బాయి సరియైన మందులు సకాలంలో పడక చచ్చిపోయాడని ఆవిడ నమ్మకం. ఆఖరు పురిటికి తాను పిల్లను కనలేకపోతే ఆపరేషను చేసిన ఆసుపత్రివాళ్ళు ఆ పిల్లవాణ్ణి కావాలని చంపేశారంటుంది. టైఫాయిడ్ పడి సంధిలో పద్యాలు చదువుతూ చచ్చిపోయిన అబ్బాయిని మేష్టర్లు చంపేశారంటుంది.

అందర్లోకీ పెద్దబ్బాయిని తా నెన్నడూ కొట్టకపోయినా 'పరీక్షలు! పరీక్షలు!! ఫస్ట్‌క్లాస్! ఫస్ట్‌క్లాస్!!' అని హైరాన పెట్టి రాత్రిం బగళ్ళు కంటికి నిద్రా కడుపునిండా తిండీ లేకుండా చేసినభర్తే వాడికి చావు తెచ్చి పెట్టారంటుంది. చిట్టచివర పొట్ట చిచ్చుపెట్టి పోయిన మహాలక్ష్మిని కట్టుకొన్న మగడూ పట్టుకెళ్ళిన అత్తగారూ పొట్టను పెట్టుకున్నారంటుంది.

పావన రామయ్యకు తక్కిన చావుల సంగతెలా ఉన్నా పెద్దబ్బాయి చావుకు కారణం తాను కాదని చెప్పుకోవడం సాధ్యమయ్యిందికాదు. అందుచేత తక్కిన ఆరోపణలనుకూడా అతనికి కాదనే అవకాశం లేకపోయింది. అందుచేతే అతడు సీలవేణమ్మ ఏడుస్తూ ఉంటే అమె ఊరుకునే దాకా తానుకూడా నోరుమూసుకు ఊరుకుంటూ ఉంటాడు.

దీపాలు పెట్టాకగాని సీలవేణమ్మ శోకముడిగి ఇంటిలోకి రాలేదు.

3

రైలుకు బయలుదేరిన సుబ్బారాయుణ్ణి అంపకం పెట్టడానికి పావనరామయ్య కూడా బయలుదేరేడు.

ఆ తెల్లవారుజామున కుప్పల నూర్పులకు ముహూర్తం. అందుచేత త్రయోదశి నాడు పెళ్ళాం పిల్లలను పంపించే షరతుపై అత డొక్కడే బయలుదేరేడు.

● అయిదేళ్ళ కొడుకును వెంటబెట్టుకుని సుబ్బారావుగారు మేటినీ ఆటకి సినిమాకి బయల్దేరారు. ఆయన టిక్కెట్లు కొంటుండగా కొడుకు గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. "నాన్నా! నన్ను లోపలికి నడిపించుకు తీసుకెళ్ళు."

"ఏం, కంట్లో ఏమన్నా పడిందా?" అని సుబ్బారావుగా రడిగారు.

"కాదు, లోపలికెళ్ళాక తడుముకోక్కర్లేకుండా సీట్లు కనిపిస్తాయి" అన్నాడు కొడుకు.

దశమివెన్నెల - తొలిజాము - మంచు పలచగా కురుస్తోంది. వాళ్ళు సి టీ బ స్ కోవరం జంక్షనుకేసి వడుస్తున్నారు.

"మొత్తానికి యిల్లే కొన్నావ్" అన్నాడు సుబ్బారాయుడు.

"ఆఁ. అప్పుకూడాచేసి."

ఆ యిల్లు కొనటంగురించి మూడునెలల క్రితం కొంత రభసఅయ్యింది.

ముప్ఫైఐదేళ్ళ టైపిస్టు కాపీయిస్టుగా పనిచేసిన పావనరామయ్యకు రిటైర్ అయ్యే నాటికి ప్రావిడెంటుఫండ్ మూ డు వే ల పైచిలుక్కు మొత్తమయ్యింది. ఎవడో ఏజంటు బలవంతాన కట్టించిన ఇన్సూరెన్సు బాపతు వేయి రూపాయలు వచ్చాయి. అందులో రెండువేలు కట్నం లాంఛనాలు పెట్టి ఒక వెయ్యి ఖర్చులతో పిల్లకు పెళ్ళి చేసేయమంది భార్య. వెయ్యి రూపాయిలు చేతఉంటే ఒక కాలునొచ్చినా చేయినొచ్చినా పనికివస్తాయని ఆవిడ ఉద్దేశం. పి. యు. సి రెండుసార్లుపోయి యిక చదవను నాన్నా అన్న కొడుక్కు మునసబుకోర్టులో గుమస్తా ఉద్యోగమయ్యింది. వాడి జీతమున్నూ, చేయ గలిగినంతకాలం ఖర్చుచేసే జాబ్ వర్కులతో మన్నూ సంసారం వెళ్ళుబుచ్చవచ్చని ఆవిడ భావం.

ఎంతమంది ఎన్నిచెప్పినా యిల్లే కొంటా నన్నాడు పావన రామయ్య. అదీ మంచిదే. కట్నాలబజారులో కొడుక్కు ధర పెరుగు తుందన్నారు కొందరు.

పైవాళ్ళేమన్నా పావన రామయ్య మన సులో మాటేమిటో త న కు తెలుసనుకుం టాడు సుబ్బారాయుడు. కాని అప్పనేసరికి అతడు సహజంగానే భయపడ్డాడు.

"మళ్ళా ఆదొకటా!" అన్నాడు దాన్ని బయట పెడుతూ.

"మనకు కావలసిన లొకాలిటీలో మనకు కావలసినపాటి యిల్లు మనదగ్గరున్న బావితో రాదు మరి"

సుబ్బారాయుడు ఆలోచించి ఒకనిట్టూర్పు విడిచాడు.

"కాని ఎలా తీరుతుంది?"

"అదే నేనూ అనుకున్నాను. అంతగా తీరకపోతే తీరదనుకున్నాను మళ్లా"

సుబ్బారాయుడు మరి కొంతసేపూరుకొని అడిగాడు.

"పిల్ల పెళ్ళి ఎలా చేస్తామనుకున్నావ్?"

"అది బ్రతికి బట్టకడితే అయింటిమీదే తేవాలి" అని. "—ఇంతకూ అది ఐదేళ్ళ తరవాతమాట" అన్నాడు పావన రామయ్య.

చాలాదూరం ఆలోచించి అపును మరి అనుకున్నాడు సుబ్బారాయుడు.

వాళ్ళు జంక్షనుకు చేరుకొని కావాగిట్ల మీద కూర్చున్నారు. కూర్చున్నాక కూడా చాలాసేపటివరకూ ఇ ద్ద రూ మౌనంగానే ఉండిపోయారు.ఆతరువాత పావన రామయ్య ఆరంభించాడు.

"ఆబ్బీ ఒకవిషయం నీతో చెప్పాలి. బావ ఏమిటి యిలా మాటాడుతున్నాడను కోకు. నాకు మనసులో మా ట లు సరిగా చెప్పడంరాదు. అయినా నువ్వు ప్రయత్నం చేస్తే సరిగా అర్థంచేసుకోవచ్చు -" అని సరిగా సర్దుకు కూర్చొని చెప్పడం ఆరంభిం చాడు.

"నేను మొదట్లో అంటే చిన్నప్పుడు దేనిగురించీ ఏమీ ఆలోచించేవాణ్ణి కాదు.

ఏదో తింటున్నాం అంటే తిం టు న్నా ం ఉంటున్నాం అంటే ఉంటున్నాం అన్నట్టుండే వాణ్ణి. తరువాత నలుగుర్నీ చూసి ఓహో బ్రతుకంటే యిదా అనుకున్నాను.

పుణ్యం పా ప ం పరలోకం గురించి అందరూ మాటాడేవారు. కాని అందరూ ఇహంకోసమే బ్రతుకుతారు.

ఈలోకంలో ఎవడు సాహసించి తన కోరక్రిందికి ఎంత లాక్కుంటే అంతే దక్కుడు. నావంతు నాకు న్యాయంగా వస్తుందంటే భ్రమ.

— అని తెలుసుకున్నాను.

కాని నా తెలివి నాకేమీ ఉపయోగపడ లేదు. లాక్కోవడమెలాగో నాకు తెలుసు కాని లాక్కోవడానికి నాచేతులు, కాళ్ళూ పుణ్యపాపాల పేరా న్యాయా న్యాయాల పేరా కట్టేసి ఉన్నాయి. నాగుండెంతా పిరికి మందుతో బలహీనమై పోయి ఉన్నది.

అందుచేత ఉన్నంతలో వెసులుబాటు చేసుకుంటూ ఎవ్వరూ చూడనప్పుడు ఏ కొంచెం దొరికితే ఆ కొంచెమే సంగ్రహిస్తూ ఏదోవిధంగా బ్రతుక్కుంటూ వచ్చాను.

ఆరోజుల్లోని నాగురించి నేను జ్ఞాపకం తెచ్చుకుంటే నా కిలా అనిపిస్తుంది.

నాకా ఉద్యోగం తప్ప చేతనయ్యింది యింకేమీలేదు. ప్రాణంపోయినాఫరవాలేదు, ఉద్యోగం ఊడుతుందంటే మాత్రం ఉపద్ర మైన హడలు. దారిద్ర్యాన్ని భరించడానికి నేను సిద్ధం. గౌరవం దెబ్బ తింటుందంటే చచ్చినంత భయం.

అందుచేతే గతీ మతీ లేని ఆ బ్రతుకు ఆలా సాగించడం తప్ప నాకు మరోమార్గం లేకపోయింది. భారతదేశంలో నూటికితొంభై మంది ఉద్యోగాలు చెయ్యకండానే బ్రతుక గలుగుతున్నారనే విషయం ఒక్కనాడు తట్ట లేదు. కనీసం తులం బంగారంగాని సెంటు భూమిగాని చేరెడు ఇల్లుగాని ఉంటే నేనాడు మరీ అంత పిరికి బ్రతుకు బ్ర తి కి ఉండ నక్కరలేదని ఆరోజుల్లో నేను తరుచు అను కునేవాణ్ణి.

నా బ్రతుకుయొక్క బండారం మా పెద్ద వాడు పోయాక మరీ స్పష్టమయ్యింది. వాడు పొయ్యాక నే నెన్నోరోజులు అదేపనిగా ఆలోచిస్తూ ఉండేవాణ్ణి.

వాడు నా కడుపున పుట్టి ఎ న్న డూ ఏసుఖమూ అ ను భ విం చ లే దు. తిట్లూ చీవాట్లూ కసుర్లూ దెబ్బలూ తప్ప ఒక అచ్చటా ముచ్చటా ఎన్నడూ ఎరగడు. ఎందువల్ల అని ఆలోచించాను.

నా పేదతనం కొంతవరకూ కారణం. కాని అదిఒక్కటేకాదు. నా ముసలితనానికి నేను వాడిపై ఆధారపడి ఉన్నాను. అందుకే వాడి లేత బ్రతుకుమీద వాడు మోయలేని భారాన్ని మోపి వాడి నూరేళ్ళ బ్రతుకూ బండలుచేశాను.

నేను ఎప్పు డేది చేసినా వాడిమేలును కోరి ఏదీ చేయలేదు. వాడికి చెప్పే నీతులు వాడి భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొనికాక నా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెప్పాను. వాడికి చెప్పించిన చదువంతా నాకోసమే చెప్పించుకున్నాను. బ్రతికిఉంటే వాడికి పెండ్లి నా శ్రేయస్సును దృష్టిలోఉంచు కొనేచేసేవాణ్ణి. వాడుపిల్లలుకంటే దానివల్ల కలిగే ఆనందం, ఆనందంలేమీ నా శ్రేయ స్సునుబట్టే తేలిఉండేవి. కనుక్కున్న పిల్లలకూ కన్న తల్లి దండ్రులకూ కల

సంబంధం యీ విధంగా కనిపించిననాడు నా గుండె బేజారై పోయింది."

పావన రామయ్య ఆగిపోయాడు. సుబ్బారాయుడికి అతని గుండె చిచ్చుతీరుచూస్తే గుండెలు నీరు నీరౌతున్నాయి. పావన రామయ్య మరికొంతసేపు ఊరుకొని ఆరంభించాడు.

"నేననుకుంటాను - నాకు జీవితంలో ఆదినుండీ భరోసా. అన్నదిలేదు. అందుచేతే నేనిన్ని బాధలుపడి నా సంసారాన్ని బాధలుపెట్టి దానికోసం మళ్లా నేను బాధలు పడుతూవచ్చాను. మనిషిలో సాహసానికైతేనేమి బ్రతుకులో ఆనందానికైతేనేమి మూలం భరోసా. అది లేనినాడు మనిషి జీవచ్ఛవంగా తప్ప మనిషిగా బ్రతకలేడు"

పావన రామయ్య మళ్లా ఆగిపోయాడు. సుబ్బారాయుడు అతనిమాటల వెనక అతడు ఈ అరవయ్యేళ్లూ బ్రతికిన బ్రతుకు నర్ధం చేసుకుంటున్నాడు.

కురుస్తున్న పొగమంచు అంతకంతకు దట్టమౌతున్నట్టున్నది. కాస్తున్న వెన్నెలలు క్రమ క్రమంగా కాంతితగ్గుతున్నట్టున్నాయి. దూరాన్నీ హెడ్‌లైట్లు ఎటో ఎటో కదులుతున్నాయి. పావన రామయ్య మళ్లా ప్రారంభించాడు.

"చెప్పవచ్చేదేమంటే నేనీ యిల్లు కొనడమా మానడమా అన్న ఆలోచనలో ఉన్నప్పుడు ఒక నిశ్చయానికి రావడం చాలా కష్టమయ్యింది. 'ఆ డబ్బుపెట్టి పిల్ల పెళ్ళి చేసేస్తే'నో అని ఆలోచించినప్పుడల్లా నా గుండెలు దడదడలాడేవి. కాళ్ళక్రింద భూమి అందకండా పాతాళానికి జారిపోతున్నట్టనిపించేది. చివరికి ఇలాఅనుకొన్నాను. ఈ యిల్లు కొవడమొక్కటే నేను నా జీవితంలో అడగల జూదం. ఇది కొంటే నేను నా ముసలితనాన్ని ధైర్యంగా ఎదుర్కోవచ్చు. అదృష్టం బాగుండి దక్కించుకోగలిగితే నా పిల్లలు నాకన్న అదృష్టవంతులవగలరు. దక్కించుకోలేక పోవడానికి చాలాకాలం పడుతుంది. ఈలోగా దేవుడు హాని చేయకపోతే నేను కన్ను మూసేయక పోను."

—పాపం! అనుకోలేదు. సుబ్బారాయుడు. ఏమనుకోవటానికి అతనికి టైము లేదు. అతన్ని బస్సెక్కించి అది వెళ్ళాక పావన రామయ్య యింటిముఖం పట్టాడు.

పావనరామయ్యకు ఎంత కాదనుకున్నా అరవై యేళ్ళుంటాయి. వెన్నెల ఉన్నప్పటికీ దారి మరీ కొత్తది. అందుచేత అతడు ఆ రోడ్డున చీకట్లోనడుస్తున్నట్టు నడుస్తున్నాడు.

పావనరామయ్య క్రొత్తగా కొనుక్కున్న యింటికి దీపాలు లేవు. అవి వేయించేసరికి ఎన్నాళ్ల వ డు తుం దో తెలియదు. డబ్బెక్కడ వెతకడమన్న ప్రశ్న ఎదురైనప్పుడల్లా దాని నతడు జోరీగను తోలినట్టు తోలుతున్నాడు. మనిషి వీధి చివర చీకట్లో చీకటిగా ఉన్న యింటికేసి నడుస్తున్నాడు.

ఆ కాలనీలో క్రొత్తగా లేచిన భవనాల్లో చాలావాటికి నిర్మాణం పూర్తికాకముందే దీపాలు పడ్డవి. కాని వెచ్చదనం కోసం వాటి తలుపులన్నీ మూసిఉన్నవి. ఇళ్ళల్లో బంధించిన వెలుతురుతో వీధుల్లో విహరించే చీకటితో ఊరికిఉత్తరాన వేస్తున్న ఆ క్రొత్తవాడ కలకల్లాడుతూ క ని పిం చే కన్నెపిల్ల లా కాకుండా కాలంలో వైధవ్యం దాపురించిన కాంతలా ఉన్నది. □□□

పట్టాభి పదభంగము

ఏప్రిల్

1. ప్రభుత్వానికి పాలసీలు సున్న
పాలసీలుండేది భీమా సంస్థలోమటుకే

2. పాకిస్తాను వప్పుకోబట్టి బంగాళం
పంచబంగాళమయింది

3. నరలోకమునకు
'క' ప్రత్యయంచేరుటవల్ల
నరకలోకం ఏర్పడుతుంది
అంతేగాని వేరే నరకలోకంలేదు

4. జారత్వం ఎక్కువై వానిజన్మ
క్రుతిమించి రోగానపడింది

5. భావకవిని కాను.
అహంభావకవిని నేను

6. ఆర్థికచింత ఎక్కువగనుకనే
మనదేశంలో
పారమార్థికచింతన ఎక్కువ

7. రాగమువల్ల ప్రణయము
విరాగమువల్ల ప్రణవము

8. వనిత చక్కదనం
వంపులోవుంది

9. ఉద్యోగ్యం పురుషలక్షణం
నిరుద్యోగం మహాపురుషలక్షణం

10. నీతులూ గీతులూ. వీనిలోనాకు
గీతులే యిష్టం

11. ఈనాడు థర్డుక్లాసు కంపార్టుమెంట్లో
సామాన్లతో ప్రయాణంచేయుట
ఇరుకులో సరుకు

12. రామాయణంకన్నా పాప్యులర్
లోకాభిరామాయణం

13. తలంబ్రాలు కాదు.
అది తలన్‌బ్రాలు

14. దంతికన్నా వదంతి పెద్దది

15. హాయిహీల్డు బూట్సు వేయుటవల్ల
కొందరు కన్యలకు కులుకు
మరి కొందరికి లుకలుకు

16. ఆఅలువచ్చాక అతగాడు
కాగుణింతమగు
కొక్కోకం నేర్చుకుంటున్నాడిప్పుడు

పద్యాని పదభాంగము

17. దగ్గుకు పరుషస్వరూపమనే
క్షయ అంటారు.

18. నిలకడగా నీరు త్రాగుటకన్న
పరుపెడుతూ బీరు త్రాగుట
కొందరికిష్టం

19. సమాన హక్కులుండాలి స్త్రీకి
ఆమెకు అర్థస్థానం
పురుషుని ప్రక్కను

20. వంగదేశం వానికెక్కినది
టాగూర్లకు. టయిగర్లకున్ను

21. సుధాకరుని "క్షుధాకరా" అని
సంబోధనచేస్తారు
ప్రజాసాహిత్యవాదులు

22. ప్రియుడు ప్రియురాలితో
కలకాలం ప్రేమిస్తానంటే అర్థం ;
తన ప్రేమ స్వప్నప్రాయమని

23. మాయాప్రపంచమందు మనుచున్నట్టి
మానిసిమొక్క తిరుగుబాటు సినిమా

24. కవులు చంద్రుని
అమృతమండలం అంటారు
కాని శాస్త్రజ్ఞులు చెప్పేది
మృతమండలం అని

25. వెలయాలికి
'రండా' పర్యాయపదం కద్దు
ఇందులో ఆహ్వానసూచక
ధ్వనివుందా ఏమి ?


26. మనజాతిలోని సవర్ణ వివాహాలు.
సువర్ణ వివాహాలుపోవాలి

27. వధూవరులకు చదువుకన్నా
చదివింపు లెక్కువగావున్నవి

28. పనివాండ్రు, పతితులూ ఒకేరకం
అందుకనే వాళ్ళనంతా పిల్లలంటారు

29. ఒక కీలుబొమ్మ
మరో కీలుబొమ్మతో ఏమన్నది ?
"మరతలా" అని

30. చనిపోయినవాని నామస్మరణంకన్న
వాని పీలునామస్మరణంచేస్తుంటారు
బంధు మిత్రులు.



నిత్యానందంగారి బొంబాయి విలాసయాత్ర

"ఏమండీ, మీరూ, మీ స్నేహితులూ కలిసి విజ్ఞానయాత్రకి వెళ్ళేయోగం మీ కెలానూ లేదు. నా స్నేహితురాలు బొంబాయి వెళుతోంది. దానివెంట బహుశా దాని మొగుడూ వెళుతున్నాడు. మనమూ వెళితే బాగుంటుందనుకుంటున్నాను. వొస్తారా" అంది ఓనాడు అకస్మాత్తుగా మా ఆవిడ.

"నాతో చెప్పకుండా మనం వెళదామని నువ్వు అనుకోడమేమిటి ?" అన్నాను. అప్పుడప్పుడు అలా నిలవదీసి అడుగుతూ వుంటేనేగాని పెళ్ళాలు మరీ పేట్రేగి పోతారు.

"ఇప్పుడు నే చేస్తున్న పనేమిటి ? మీతో చెబుతున్నానుగా" అంది.

"ముందే చెప్పవలసింది."

"దేనికి ముందే ?"

"నీ స్నేహితురాలితో కలిసి వెళదామని నువు అనుకోడానికి ముందే."

"నా స్నేహితురాలితో వెళదామని అనుకున్నాను అన్నానా. వెళితే బాగుంటుందని అనుకున్నా నన్నాను. ఒకటే పరధ్యానం. చెప్పిన మాటలన్నా తిన్నగా విని అర్థం చేసుకోరు." అంది కించిత్తు విసుగూ, కించిత్తుకోపమూ గొంతుకలోస్ఫురింపజేస్తూ. మా ఆవిడ స్వరాన్నిబట్టి ఇట్టే మనసు కని పెట్టెయ్యగల శక్తిసామర్థ్యాలు సంపాదించు కున్నానేమో. ఓహో కొంచెం కారం పా లెక్కువగావుంది మాటలధోరణిలో. మనం ఒకటంటే తను రెండనే స్థితికి దిగిపోయే

ప్రమాదం లేకపోలేదు. నిలవదీసి అథారిటీ చెలాయించడానికి ఇది సమయంకాదు. అని క్షణంలో నిశ్చయాని కొచ్చేసి "ఇంతకీ ఎవరా స్నేహితురాలు. బొంబాయి ప్రయాణంలో ఆవిడదృష్టి ఏమిటి ? ధ్యేయం ఏమిటి" అన్నాను.

"వొస్తారా రారా. ముందర ఆ సంగతి తేల్చండి" అంది.

"నీ స్నేహితు రాలెవరో తెలీకుండా ఆవిడ వెంట పడిపోవాలంటే."

"ఆవిడ వెంటపడి పొమ్మనలేదు. నా వెంట రమ్మంటున్నాను."

"నీవెంట రావడానికి నేను ఎప్పుడూ సిద్ధమే. కాని"

"కానీ లేదు. అర్థణా లేదు."

"నయాపైసలన్నా వున్నాయిగా"

"పైసలతో అయ్యేకార్యం కాదు. రూపాయలు కావాలి."

నా జోకు విని ఆనందించడానికి సుముఖురాలు కాలేదు మా ఆవిడ.

"బొంబాయి ప్రయాణం మనకో విలాస యాత్ర. దానికి చిలకా గోరింకల్లాగ మనిద్దరం కాక. వెనక తీతువు పిట్టల్లాగ ఎవరో స్నేహితురాలు. దాని మొగుడూ యేమిటి. కూడా ? మనమే సమయంచూసి ఎప్పుడో చల్లగా జారిపోదాం." అని ప్లేటు మార్చాను.

"ఆ. మిమ్మల్ని నమ్ముకుంటే ఈవూరు దాటామే. ఇంతకీ దూరప్రయాణానికి తోడుండడంమంచిది. నీళ్ళనమలక ప్రయాణానికి ఒప్పించి. మీనాన్నని అడిగిసొమ్ము పట్టుకురండి. వెంటనే టిక్కెట్లు కొనెయ్యాలిట" అంది.

ఏమన్నా సబవుగావుందీ. మేంబొంబాయి వెళ్లాలని తను నిర్ణయం చేసింది. సొమ్ము మాత్రం నేను పట్టుకురావాలిట. అందులో మానాన్నని అడిగి. మూడ్ లో లేకపోయినప్పుడు మా ఆవిడతో మాట్లాడం యెంత కష్టమో. మానాన్నతో మాట్లాడం అంతకి రెట్టింపు కష్టం. ఆయన ఎప్పుడూ మూడ్‌లో వుండడు. ముఖ్యంగా డబ్బు ఖర్చుచెయ్యవలసొచ్చినప్పుడు. చివరికి ఏ సినీమాకివెళ్ళడానికి లాటి చిన్న సరదాకైనా సరే డబ్బు అడిగితే "చిల్లిగవ్వంత అర్జనలేదు. పెళ్లాంతో కులకడానికి మాత్రం ఎప్పుడూ సిద్ధం. "అని లెక్చరిస్తాడు. వారే అర్థం కాక అడుగుతాను. కులకడానికి కాకపోతే నసపెట్టి కోసుకు తినడానికిటరా పెళ్ళాం! ఈ పెద్దవాళ్ళతో యిదో బ్రహ్మాండమైన తంటా. ముద్దూ ముచ్చట తీరడంలేదని పెళ్ళిచేసుకునేదాకా పోరతాడు. తీరా పెళ్ళి చేసుకుని. ముద్దుముద్దుగా ముచ్చటలు తీర్చుకుందామంటే. మరీ పోరుపెట్టేస్తారు.

" నీ స్నేహితురాలి పేరైనా చెప్పకుండా నీవెంట బొంబాయిరమ్మని కట్టడి చేసేదానివి ప్రయాణానికి సొమ్ముకూడా నువ్వే సంపాదించు" అన్నాను.

"మీకు చేతకాదని కాళ్ళ పారజాపితే అంతే చెయ్యవలసొస్తుంది. అయినా కాస్త మొగతనం చూపించండి."

మాట ధాటీగానేవున్నా. మనిషి మెత్తనయినట్టు గొంతుకలో కనిపించగా "నా మొగతనం ముందు నీకు చూపించి యితరులకి....నిన్ను బొంబాయి ప్రయాణం కట్టిస్తున్న ఆ స్నేహితురాలి పేరేదో ముందర చెప్పు. అది బైటపెట్టడానికి పూర్వం పెళ్ళిళ్ళల్లో తలుపులదగ్గిర మొగుడిపేరు చెప్పడానికి పెళ్ళికూతురు చేసినంత బెట్టుచేస్తున్నావు" అన్నాను.

"ఈ సరసాలకికావలసినంత సమయముంది సొమ్ము వసూలు చెయ్యడానికి నడుం బిగించండి." అని అస్త్రసన్యాసంచేసిన అర్జునుడి మీద శ్రీకృష్ణుడు విరుచుకుపడ్డట్టు నన్ను బొంబాయి ప్రయాణానికి తొందరపెట్టేసింది.

నాయనమ్మ కనక బతికివుంటేనా. అర గంటలో అవసరమయిన డబ్బంతా యిప్పించేసి వుండేది.

"కుర్ర నాగమ్మ సరదా పడుతున్నాడు. డబ్బిచ్చి పంపించర్రా." అనేది.

"యేడిశాడు. వాడు బొంబాయి వెళ్ళకపోతే ముంచుకుపోయిందేమీ లేదు. నే చూశాను కనకనా. ఆవూరు వాణ్ణి పంపించడానికి" అని యధాప్రకారం కసిరేసి వుండేవాడు నాన్న.

"వాడి డబ్బు వాడి కివ్వడానికి ఇదయిపోతావేమిటిరా" అనేది.

"వాడి డబ్బేమిటి ?"

"మరికట్నం తీసుకోలేదురా వాడిపెళ్ళికి? అదివాడిపేరని ఏ బాంకులోనో వెయ్యవలసింది. సొంతానికి వాడేసుకుంటున్నావు. కొంతసొమ్ము వాడికి విదుల్చు." అనేది. దాంతో నాన్న చిత్తయిపోయి. "పోరా. తీసుకుపోరా" అని నామీద నోట్లు గిరవాటు పెట్టేసేవాడు. నేనే సొంతంగా అడుక్కోవలసి వొచ్చేసరికి ఎంతో ఘర్షణ. మాఆవిడ కంఠం యెత్తి. ఓమాటు కాస్త దబాయించి. అది ఫలించకపోతే. శుక్రవారం పూట సావిట్లో గడపమీద కూర్చుని బెక్కులు బెక్కడం ప్రారంభిస్తేనే గాని సొమ్ము రాలలేదు. శుక్రవారంపూట యింట్లో గడప మీద కూర్చుని కన్నీళ్ళు కారిస్తే. మా అమ్మకే కాదు మానాన్నకికూడా ఖలే గాభరా. ఇంకేపాచికా పారకపోతే. మా ఆవిడ ఆ నారాయణాస్త్రం ప్రయోగించి నెగ్గుకొచ్చేస్తూ వుంటుంది. ఆవిడద్వారా మనం గెలుచుకొచ్చేస్తాం. కనకమరే అటంకాలు లేకుండా ఛలో బొంబాయి. కంది గుండ. ఆవకాయ. గోంగూర పచ్చడి. నిమ్మకారం. వెన్నకాచిన నెయ్యి జంతికలు వగైరా యిష్ట భోజన పదార్థాల డబ్బీలతో కూడిన ఒక పెద్దబుట్టతో సహా ఆ బుట్ట ఏ సీటు కిందికీ దూరక మమ్మల్ని కొంత అల్లరిపెట్టినమాట నిజమే. కిష్టయ్యగారు— అంటే మాతో వొచ్చే మా ఆవిడ స్నేహితురాలి మొగుడు.

"ఎందుకండీ ఇవన్నీ? ఎక్కడ పడితే అక్కడ మంచి భోజనందొరుకుతుందిట. ఎన్నో దక్షిణాది హోటళ్ళున్నాయిట" అన్నాడు."సాంబారుమెతుకులతో తృప్తిపడేవాళ్ళకి దక్షిణాది హోటళ్ళున్నాయని సంతోషంగాని పచ్చడి కలిపితేనేగాని భోజనం పూర్తికాని. మనకేం చాలతాయండి ఆ హోటలు తిళ్ళ"

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

"బొంబాయి స్టేషన్లోనే దిగుతాంలెండి."

"బొంబాయి స్టేషనంటూ లేదయ్యా"

"ఇదేమిటండీ. బొంబాయిలో స్టేషన్ లేదూ రైలు ఆగదూ!"

"బొంబాయికి స్టేషను వుందయ్యా. ఒకటి కాదు. రెండు. దాదర్, వి. టి అని పేర్లు వాటికి.

ఏమిటో ఇదంతా గజిబిజిగావుంది. రాజమండ్రి. ఏలూరులాటి రెండు స్టేషన్లున్న వూళ్ళున్నాయి. నాకు తెలుసు. కాని అవూరి పేరే ఏస్టేషనుకి లేకపోతే ఎలా!

"ఏస్టేషన్లో దిగితే దగ్గిరండి?"

"దేనికి దగ్గిర"

"వూరు చూడ్డానికి"

"వూరు చూడ్డానికి వూళ్ళో ఎక్కడ దిగినా వొకటేగా!" మహ తెలివిగా జవాబు చెప్పాననుకున్నాడు కాబోలు. నవ్వడం ప్రారంభించాడు. సాచి రెండు జెల్లలుకొడితే. పరాయి ప్రదేశం. తొందరపడకూడదు అని తమాయించుకున్నాను. కిష్టయ్య నిటాగ్గా కూర్చునే గుర్రుపట్టి నిద్రపోతున్నాడు. వాడు మేలుకుంటే సహాయమనికాదు.

దాదర్లోదిగాలా. వి. టిలో దిగాలా అని మేంనిర్ణయించుకోకుండానే గాదరొచ్చేస్తోం దని అందరూ పెట్టే బేడ సర్దుకోడం ప్రారంభించేశారు.

"ఏం చేద్దామండీ కిష్టయ్యగారూ."

"గాభరాపడకండి. నాకు దూరపు బంధువు ఒక పెద్ద ఆఫీసరున్నాడు ఈ వూళ్ళో. తిన్నగావాళ్ళింటికి వెళ్ళిపోయి. ఆయన సలహామీదే తరవాత ఏపనయినా చేద్దాం."

"ఎక్కడున్నాడు ఆయన. ఇంతకీ ఏ స్టేషన్లో దిగాలి." ఆయన ఎడ్రసుకోసం వెతకడం ప్రారంభించాడు కిష్టయ్య. జేబులన్నీ వెతికాడు. కనిపించదు. పెళ్ళానికిచ్చా వంటాడు. ఆవిడ, అతనికే తిరిగి యిచ్చే వంటుంది. రభస. ఏమయినా ఎడ్రసు కాగితం కనిపించలేదు.

మద్రాసీవాళ్లు చాలామంది దాదర్ సమీపంలోనే వున్నారు. అక్కడే దిగుతే వారిని పట్టుకోవడం తేలిక. దాదర్లోనే దిగండి అని యెవరో సలహా యిచ్చారు. ఆంధ్ర రాష్ట్రం వొచ్చినా యింకా మన్ని మద్రాసీ వాళ్ళే అంటున్నారని కష్టంతోచినా, స్టేషను వొచ్చెయ్యడం వల్ల, వాదన పెట్టుకుని లాభం లేదని దిగిపోయాము. కిష్టయ్యకి ఆ తెలిసిన తెలుగు ఆఫీసరుగారి ఎడ్రసు తెలియదు సరికదా, పేరైనా తిన్నగాతెలీదు. ఏవో రెండు మూడు ఎ. బి. సి. డి. పొడి అక్షరాలు చెప్పి రావుగారు అంటాడు. ఆపొడక్షరాలు తిన్నగా తెలీవుట.

"రావుగారని" మాత్రం నిశ్చితంగా తెలుసుట, సవాలక్ష రావుగార్లుండే బొంబాయిలో, కిష్టయ్య దూరపు బంధువు రావుగారిని పట్టుకోడం ఎలా. ఇంకా తెల్లారలేదు. స్టేషన్లో దీపాలు ఆర్పేస్తే కటికచీకటి. సామాను దించిన కూలివాడు డబ్బిచ్చి పంపించెయ్యమని ఒకటే వొత్తిడి. ఇంత సామానూ టిక్కట్టు మాస్టరుగారు చూస్తే బోలెడంత ఎక్సెస్ చార్జీకూడా చేసి వుండునుట. ఆయనకన్నుగప్పి. సామాను బయట చేర్చారుట. కూలి డబ్బులేకాక. ఈ సహాయానికికూడా వాడికి సొమ్ము చెల్లించుకోవాలిట. వాడు ఓపట్టానపోడు. ఏదో తెలియని భాషలో ఇదంతా మాకు చెబుతాడు. కిష్టయ్య తనకి వొచ్చిన హిందీ వాడిమీద ప్రయోగించబోయాడు. మరికొంత గొడవ.

"మీరు తెలుగువారిలా వున్నారే" అని సూటూబూటూ వేసుకున్న ఓ పెద్దమనిషి స్వచ్ఛమయిన తెలుగులో పలకరించాడు. అమ్మయ్య తెలిసినమాట. ప్రాణం లేచొచ్చింది. మా పరిస్థితి చెప్పుకున్నాం. కూలివాడి గోల ఆయన మాకు చెప్పాడు. చివరికి రాజీచేసి, మూడురూపాయలిచ్చి వాడిని వొదిలించాడు. మా వూళ్ళో పావలా డబ్బులిచ్చి ఎక్కించిన సామాను దించిన కూలివాడికే మూడు రూపాయలు వొదిలిపోతే, ఈ వూళ్ళో ఎంతడబ్బు చాలేటట్టు!

"ఇక్కడ దొంగలుంటారు. డబ్బు జాగర్తగా పెట్టుకోండి" అన్నాడు ఆ తెలుగు పెద్దమనిషి. "తియ్యనిమాటలుచెప్పి సొమ్ము లాగేస్తారు. గూండాలూ. రౌడీలూకూడా చాలామంది వుంటారు. పరాయివాళ్ళని నమ్మకండి" అనికూడా హెచ్చరించాడు.

సమయానికి భగవంతుడిలా దొరికావు నాయనా, అని నేనేకాదు, మా ఆవిడకూడా సంతోషించింది. తన కిడివరకే ఇలాటి విషయాలన్నీ తెలిసినట్టు కిష్టయ్య మొహం పెట్టినా!

"పదండి మీ బంధువుని వెతికి పట్టుకుందాం'' అన్నాడు. ఆ తెలుగుపెద్దమనిషి.

అందరం కలిసిపోదాం అని నేను సలహాయిచ్చినా వినిపించుకోకుండా సామానుకి ఆడంగులకి నన్ను కాపలాపెట్టి వుండమని, ఆ తెలుగు పెద్దమనిషితో ఒక్కడూ బయలుదేరాడు కిష్టయ్య.

పావుగంటయింది. అరగంటయింది. కిష్టయ్యరాడు. వాడి పిల్లలు నిద్దరలేచిపోయి 'నాన్నోయ్' 'నాన్న కావాలోయ్' అని ఒకటే యేడుపు. వాళ్ళని వూరుకోపెట్టండని నేను సలహాయిస్తే, 'వెధవలు ఏడిచి ఏడిచి కోషొచ్చి వూరుకో వలసిందేగాని, ఇలాటప్పుడు మనం చెబితే మానరు. ఏడవనివ్వండి"అని తోసిపారేసింది గంగారత్నం. మా ఆవిడ దిగాలు పడిపోయి, పెట్టిమీద కూచుండిపోయింది. అయ్యో, మా ఆయన చెప్పిన మాటవిని, యిద్దరమే వొచ్చివుంటే ఈ బాధలన్నీ వుండకపోనుగదా అని మనస్సులో అనుకుంటూ వుండివుంటుంది.

నాకు ఆకలేస్తోంది. కాలకృత్యాలు తీర్చుకోవాలి. చుట్టుపక్క లెక్కడన్నా కూర్చుందామంటే ఎటుచూసినా పోలీసువాళ్ళు. మరీ దూరం వెళదామంటే తప్పిపోతానేమోనని భయం.

ఓ గంటయిన తరవాత కాళ్ళీడ్చుకుంటూ బుర్ర గోక్కుంటూ వొచ్చాడు కిష్టయ్య. ఆ తెలుగు పెద్దమనిషి జాగర్తగా దాచిపెడతానని. కిష్టయ్యగాడి దగ్గిర్నించి యాభయి రూపాయలు పుచ్చుకుని, నాలుగు సందులు తిప్పి అదృశ్యమయిపోయాట్ట.

"ఓరి వాజమ్మా. నువ్విలా చేస్తావని నాకు ముందరే తెలుసురా" అనుకున్నా మనసులో.

"ఆ వెధవ నెవడినో నమ్మి డబ్బెలా చేతిలో పెట్టారండీ" అంది గంగారత్నం పళ్ళు పటపట కొరుకుతూ.

"దూరదేశంలో సాటి తెలుగువాడు మోసం చేస్తాడని అనుకోలేకపోయాను" అన్నాడు.

"అయినా వాడికి డబ్బివ్వవలసిన అవసరమే మొచ్చింది. పెట్టిలో దాచండి అంటే మహా పొడిచేసేవాడిలా జేబులో పెట్టుకున్నారు."

"పెట్టమ్మా. అలా చీవాట్లుపెట్టి. గర్వం వొదిలించు'' అనుకున్నాను మనసులో.

కిష్టయ్య చెప్పుకొచ్చాడు వెండితెరమీద చూపించేలాటి కథ.

"నేనూ, ఆ తెలుగు పెద్దమనిషి కొంత దూరం నడిచేసరికి యిద్దరు ముగ్గురు మనుష్యులు మా వెనక తగిలారు. ఈలవేశారు. తెలుగుపెద్దమనిషి ఓమాటు వెనక్కితిరిగి వాళ్ళని కూకలేస్తే వెనక్కితగ్గారు. అప్పుడా పెద్దమనిషి చెప్పాడు. వీళ్ళు ఈ వూళ్ళో గూండాలు. కొత్తగా వూరికివొచ్చిన వాళ్ళ వెంటతగిలి సొమ్ము కాజేస్తారు. మీకూ ఈపాటికి ఇది జరిగివుండవలసింది. నేను వుండబట్టి వాళ్ళు వెనక్కిపోయారు. వాళ్ళకి నేనంటే హడల్. మీ డబ్బు జాగర్తగా దాచిపెడతాను నా కివ్వండి'' అన్నాడు.

"అబ్బే నాదగ్గిరేం డబ్బులేదండీ'' అన్నాను.

''ఓహో అయితే భయంలేదు. మీరు ఇక్కడే వుండండి. పక్కసందులో వాకబు చేసివొస్తానని వెళ్ళాడు. ఆయన అలా వెళ్ళాడో లేదో ఆ గూండాగాళ్ళు మళ్ళీ వొచ్చారు.

''తుమ్ క్యాకర్తాహై'' అన్నాడు అందులో దున్నపోతులా వున్న ఒకడు.

"కుచ్‌నై" అన్నాను.

'తబ్ ఇవ్ గల్లీమే క్యాహై, కాయద్ తుమ్ చోర్‌హో పైసా నికాలో"

అని మీదకొచ్చాడు. వాళ్లు సొమ్ము లాగేసే వాళ్ళేకాని, ఆ క్షణంలో 'భాగ్ జావ్' అని కేకవేస్తూ ఆ తెలుగు పెద్దమనిషి ప్రత్యక్షమయాడు. 'నే చెప్పలా అండి. ఈవూళ్ళో జాగర్తగా వుండాలి. మీ సొమ్ము నాదగ్గిర దాచండి. మీ స్నేహితుడి యిల్లు పత్తా తెలిసి, మీరక్కడ చేరగానే భద్రంగా యిచ్చేస్తానన్నాడు. నమ్మి యిచ్చేశాను. ఆతరవాత రెండుసందులుతిప్పి మళ్ళీ కనిపించకుండా పోయాడు. అరగంట అయినా మళ్ళీ రాకపోతే మీరిక్కడ ఏమైపోతున్నారో అని స్టేషను దారి వాకబుచేసుకుంటూ ఇక్కడికి చేరుకున్నాను"

తెచ్చిన డబ్బంతా క్షవరమ్! కాదట. వున్న డబ్బంతా యిదేనని యాభయి రూపాయలు ఆ తెలుగు వాడి చేతిలో పెట్టినా, మరో పదిరూపాయలు బనియను జేబులో దాచుకున్నట్టు, అవి మిగిలిపోయాయని, అవి దాచిన తెలివికి సంతోషిస్తూ ప్రజ్ఞ చెప్పుకోబోయాడు.

"పోలీసుకి రిపోర్టు చెయ్యండి." అంది మా ఆవిడ.

"ఎందుకులెండి. పోలీసుల చేతిలోపడితే యీ వూర్నించి తెమలలేము" అన్నాడు. నిజానికితనతెలివితేటలుబయటబడిపోతాయని నిగ్గుపడిదానికి ఒప్పుకోలేదు. బొంబాయంటే ఏదో మంచివూరు అనుకునేరు. అంతా శుద్ధ మోసం. మనం జాగర్తగా వుండాలి." అని మళ్ళీ లెక్చరు ప్రారంభించబోయాడు కిష్టయ్య. మోసపోయి డబ్బు క్షవరం చేసుకున్నదేమో తను, మాకెందుకు నీతులు చెప్పడం.

ఏమిటి తరవాత ప్రోగ్రాము!

గంగారత్నం దగ్గిర దాచిన డబ్బుకూడా కలుపుకుంటే కిష్టయ్య సకుటుంబంగా తిరుగు రైల్లో యిల్లు చేరడానికి మాత్రం సరిపోయినడబ్బు మిగిలింది. "చాలా అశుభం జరిగిపోయింది. ఇంకోమాటు జాగర్తగా రావొచ్చు వెళ్ళిపోదాం" అని గంగారత్నం సలహా యిచ్చింది.

అమ్మా గంగారత్నం, నువ్వు మీ ఆయనా ఏదో నిర్వాకం చేసి పెడతారని, మా ఆవిడ మీతో మమ్మల్ని లాక్కొచ్చింది. వూరుచేరగానే మీఆయన గంగలోదింపాడు. ఎప్పుడూ రైలెక్కి ఏవూరువెళ్ళే యోగం లేకుండా చేస్తావు అని మనసులో అనుకుని, వెళ్లాలంటే "మీరు వెళ్ళండి, మేము ఒకటి రెండురోజులు వుండి వొస్తాం" అన్నాను. "నిత్యానందం, నువ్వు మన వూళ్ళోనే పరధ్యానంగా దారులుతప్పి పోతూవుంటావు. ఈవూళ్ళో అసలు గజబిజి అయిపోతావు. మేం వెళ్ళిపోయే పక్షన మీరూ మాతోనే వొచ్చేసెయ్యండి" అంటాడు కిష్టయ్య! ఏం చెప్పను వాడి ధైర్యం. నోరునొక్కి పారేసేవాడు లేక.

"ఏదోఅశుభంమననివెంటాడుతున్నట్టుంది. ఇప్పుడు వుండి లాభంలేదు మళ్ళీ వొద్దాం. మనమూ పోదాంపదండి" అని వాళ్ళపక్షమే పలికింది మా ఆవిడాను!

''మనం ఎన్నిమాటలు పడి ఎంత కష్టనిష్ఠూరాలకి ఓర్చి, నువ్వు ఎంత హంగామా చేసినమీదట ఈ ప్రయాణానికి సొమ్ము వగైరాలు లభించాయి. వూరు చూడకుండా తిరిగిపోతే మళ్ళీ రావడం పడుతుందా. కొన్నేళ్ళదాకా, అమ్మా, నాన్నా మన్ని విడిచిపెడతారా. జరిగే అశుభమేమిటో జరిగేపోయింది. ఇంకా మోసం జరిగినా, డబ్బే కదా పోతుంది. మనుష్యుల్ని కొరుక్కుతినరుకద! ఈ వూళ్లో మంచి తెలుగువాళ్లూ వుండే వుంటారు. అలాటి ఆయన ఎవరైనా కనిపించి సహాయంచెయ్యరా! ఒకవేళ ఎవరూ దొరక్క, డబ్బూ హరించిపోతే, కాలినడకనన్నా వూరుచూసే వెళదాం గాని వూరికే రైలెక్కొద్దు. మీరందరూ పోయినా, నేను రాను." అని ఖచ్చితంగా చెప్పేశాను. నా ధైర్యానికి పట్టుదలకి మా ఆవిడే దంగెత్తిపోయింది. రహస్యంగా మెచ్చుకుంది. దాంతో కిష్టయ్యగారి కుటుంబం వెళ్ళినా వుండినా మేం మాత్రం బొంబాయిలోవుండి రెండురోజులుండిపోవాలనే నిశ్చయమయిపోయింది. సాయంత్రందాకా తిరిగి వెళ్ళిపోడానికి రైలు లేదని తెలిసినతరవాత కిష్టయ్యకూడా"ఈ రోజంతా ఎలానూ వుండాలిగదా. రోడ్డుమీద కూచోలేము. ఆశ్రయం చూచుకోవాలి. అవసరమయితే యింటికి టెలిగ్రామిచ్చి సొమ్ము తెప్పించుకుంటాము.అందరంకలిసే వూరుచూసి,యింటికి తిరిగిపోదాం"అన్నాడు వొదిలి పోతాడనుకుని సంతోషపడబోతూ వుంటే, మళ్ళీ తగులుకున్నావురా నాయనా, అనుకున్నాను.

"ఇప్పుడు తెల్లారిపోయింది. ఇహమనకి భయంలేదు.టాక్సీచేసుకునిహోటలుకిపోదాం, దగ్గిర్లో చవగ్గా ఎదైనా హోటలుందేమో, ఆ పోలీసాయన్ని అడిగితే చెప్పొచ్చు అంది" మా ఆవిడ.

"హోటలుకంటె సత్రందొరికితే మంచిదండి. ఇంత పెద్దవూళ్ళో సత్రాలుండకపోతాయా" అన్నాడు కిష్టయ్య. పైగా వెళ్ళి పోలీసు ఆయన్ని,

''ఇదర్ సత్రం కిదర్‌హై" అని అడిగాడు.

''క్యా'' అన్నాడు పోలీసు.

''సత్రం కహాఁ.''

''క్యా సత్రం.''

సత్రమంటే ఏమిటో ఆ పోలీసాయనికి హిందీ తెలుగుల్లో బోధచెయ్యబోయాడు.

''సత్రం గిత్రంవొద్దు. శుభ్రంగా హోటలుకే పోదాం. మీ రెళ్ళి హోటలు సంగతి అడిగిరండి ఆ పోలీసుని'' అని

మా ఆవిడ నాకు హుషారిచ్చింది. అనవసరంగా పోలీసువాళ్ళతో మాట్లాడం నాకు కొంచెం భయమయినా, ఈ పరిస్థితుల్లో మనం ధైర్యం విడనాడకూడదని గుండె నిబ్బరంచేసుకుని, వాడి సలహా అడిగి, టాక్సీలోయెక్కి దగ్గరలోవున్న ఓ అరవ హోటలు చేరుకున్నాం.

వూళ్ళో చూడవలసిన వింతలు, విశేషాలూ అన్నీ పాపం హోటలువాడే లిస్టు రాసియిచ్చాడు. రెండంతస్తులబస్సులెక్కాం, ట్రాములెక్కాం. మా చిన్నతనంలో మా జమీందారుగారి దగ్గిరుండేది అలాటి గుర్రబ్బండీకూడాయెక్కాం. ఎటొచ్చీ ఆగుర్రం కల్యంలావుంది. తిన్నగా తిండిపెట్టరు కాబోలు. మా జమీందారుగారి బగ్గికి కట్టిన జోడు గుర్రాలూ, మిలమిల్లాడుతూవుండేవి. మోటారుకారుకంటె చవక అని గుర్రంబండిలో ఎక్కితే, రెట్టింపు వొదిలిపోయింది. నిజానికి బొంబాయిలో అంతా అదోతమాషా. చవక అనుకున్నది ఖరీదు. పేరునిబట్టి ఏమీ వూహించుకోడానికి వీల్లేదు. 'గేట్‌వే ఆఫ్ ఇండియా'కి వెళితే అక్కడ గేటు లేదు. 'హేంగింగ్ గార్డెన్స్' చూస్తే, అది నేల మీదే వుందిగాని, ఎక్కడా వేళ్ళాడ్డంలేదు. మలబార్ హిల్సుమీదనించిచూస్తే, క్వీన్సు నెక్లేస్ కనిపిస్తుందన్నారు. కళ్ళుపొడుచుకు చూసినా ఎక్కడా నెక్లేస్ కనిపించలేదు. రాణీబాగ్‌లో కోతుల్నీ, ఆరే కాలనీలో గేదెల్నీచూస్తే బాగానే వున్నాయికాని, కోతుల్నీ, గేదెల్నీ చూడ్డానికి బొంబాయికి వెళ్లాలిట్రా. చెన్నపట్నంలోలా పెద్ద బీచిఅయినాలేదు. ఏదో చపాతట. అదే బీచన్నారు. మా వూళ్ళో యేట్లో వున్నంత ఇసకన్నాలేదు అక్కడ. పైకి చూడ్డానికి యిళ్ళు పెద్దవేగాని లోపల గూళ్ళు. కిక్కిరిసిపోయిన జనం. ఎక్కడికి వెళదామన్నా తోసుకు ముందుకి పోడానికి వీల్లేదుట. ఏదో క్యూట. లైనులో నించోవాలిగంటలకొద్దీ. మొత్తంమీద నాకే కాదు మా ఆవిడకీ బొంబాయి ఏమీనచ్చలేదనుకో. పైగా, చూసినవన్నా ఖలాసాగా, మజాగా కబుర్లుచెప్పుతుంటూ చూద్దామంటే కిష్టయ్యగాడి ఫామిలీ అడ్డు. అన్నిటికీ ఏవో కామెంటరీలు చెబుతూ లెక్చర్లిస్తానంటాడు కిష్టయ్య. కనిపించిందల్లా బేరంచేసి, మా వూళ్లో యింతకంటె చవగ్గా దొరుకుతాయే ఇవి అని, అమ్మే ఆసామీచేత గుడ్లు ఎర్రజేయించుకునేది గంగారత్నం. వీటన్నిటినీ మించి, ఫిలిములో 'బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్'లాగ హమేషా వాడి పిల్లల సన్నాయి మేళం.

ఏమయినా, మాటపట్టుదలొచ్చింది కనక అన్ని కష్టాలకీ వోర్చి లిస్టుప్రకారం అన్నీ చూసి మరీ బొంబాయినించి కదిలాము. కిష్టయ్యగాడు కుదేలయిపోయాడు.

హుఁ ఏమనుకున్నావురా! నాయనమ్మ బతికుంటే "నాకుతెలుసురా; వెర్రినాగమ్మా. పైకి మెత్తనివాడిలా కనిపించినా, గట్టివాడివేరా. చిన్నప్పుడు గుక్కపెడితే పావుగంటదాకా మానేవాడివి కాదు. ఉక్కిరిబిక్కిరి అయిపోయేవాడివిగాని, ఏడుపు మానేవాడివికాదు. అప్పుడే తెలుసురానాకు నువ్వు చాలా గట్టివాడివని." అని మెచ్చుకునేది. ఏడిశావు.... మా ఆవిడా మెచ్చుకుందని చెప్పానుకాదురా! మానాయనమ్మలా, బాహాటంగా కాకుండా, సున్నితంగా, రహస్యంగా, విలాసంగా, చేసిందిరా ఆపని.

దానికీ థాంక్స్, బొంబాయికీ థాంక్స్.

ㅁㅁㅁ

షాపింగానా

లీలావతి కారుని అల్లూరాం బట్టలషాపు ముందర క్రీక్‌మంటూ పార్కుచేసింది. అల్లూరాం గాభరాగా తన మెళ్లోని జరీ ఖండువా, సవరించుకుంటూ "రండి రండి. చాలారోజులకి దయ చేశారు" అని సాదరంగా ఆహ్వానించాడు.

ఒక్కసారి షోరూమ్ లోని సేల్సుమెన్ కళ్ళు జిగేల్‌మన్నాయి. లీలావతి హుందాగా రాజమహల్‌లోని రాజకుమార్తెలా నడిచి వచ్చింది. అల్లూరాం తన బంగారుపళ్లు అన్నీ బయటకు కనపడేలా నవ్వుముఖం పెట్టి కుర్చీ చూపించాడు. ఒక సేల్సుమేన్ ఫాన్ స్విచ్ ఆన్‌చేశాడు. వేరొక సేల్సుమేన్ "ద్రాక్ష"గ్లాస్ తీసుకవచ్చాడు. షోరూమంతటా, ఎదురుమదురుగా వున్న జనం, లీలావతికి జరుగుతున్న సన్మానానికి అద్భుతపడి తమకి కావల్సిన గుడ్డలను ఎన్నుకోవడం మర్చిపోయి, శిల్పాల్లా నిలబడ్డారు. ఒకరిని ఒకరు కనుబొమ్మ లెగరేసుకుంటూ "ఎవ్వరీవిడ? మంత్రిగారి భార్యా లేక మార్కెటింగ్ ఆఫీసరా?" అన్న ప్రశ్న లేసుకుంటూ, వాళ్ళ ప్రశ్నలకి జవాబులుదొరక్క బిక్కముఖాలతో నిలబడ్డారు. స్త్రీ కస్టమర్స్ లీలావతి అందానికి, ఆమె యొక్క వేషభాషలకి, ముచ్చటపడుతూ ఆమె అదృష్టానికీ, తమ నీరసత్వానికీ దిగులుపడ్డారు. పేవ్‌మెంట్ మీద నడిచి పోయే జనం, ఫ్లడ్ లైట్ల వెలుతురులో చేతిలో ద్రాక్ష గ్లాసులోని జ్యూస్‌ని, స్ట్రాతో కొద్దికొద్దిగా పీలుస్తూ, కూర్చున్న లీలావతిని చూసి "ఎవరీ మోనాలిసా!" అని ఆగి చూసి మరీ వెళ్ళుతున్నారు. లీలావతి ద్రాక్ష జ్యూస్‌ని సిప్ చేయటానికి అరగంటపట్టింది. క్రొత్తగా సేల్సుమేన్‌గా వచ్చిన ఫిరోజ్, పాత సేల్సుమేన్ అహమ్మద్‌ని అడిగాడు "ఎవరీవిడ?" అని.

"ఏమో నాకు తెలియదు. కాని ఈవిడ వస్తేమటుకు ఆ రోజు మన వ్యాపారం సాగదు. చూడు! వచ్చి అరగంటపైగా అయిందా? తన కేం కావాలో చెప్పదు. పోనీకూర్చుంటె కూర్చుందిలే, మాడల్‌గా పనిచేస్తుంది అనుకుందామనుకో! మిగిలిన కస్టమర్స్ ఆవిడ్నే చూస్తూకూర్చుంటారు

కె. వి. ఎస్. అచ్యుతవల్లి

కాని. వాళ్ళకొక్కవల్సినవేవో కొనుక్కో పోరు! షాపు మూసే టైం అయ్యేదాకా అల్లానే. ఆవిడ అందాన్ని గుడ్లప్పగించి చూస్తూ, నిలబడిపోయి, షాపు మూసేవేళకి తొందర తొందరగా వెళ్ళిపోతారు" అన్నాడు అహమ్మద్.

"పోనీ ఈమెగా రేదయినా లార్జ్‌స్కేల్‌లో పర్చేజ్ చేస్తుందా?" అన్నాడు ఫిరోజ్.

"పాపం! చేస్తుందిలే! ఆయిదారు వందలదాకా!" తేలిగ్గా అన్నాడు అహమ్మదు.

గతుక్కుమన్నాడు ఫిరోజ్.

అయిదారు వందలు! ఎంత తేలిగ్గా అన్నాడు అహమ్మదు? ఒక అందాల రాణి వూసుపోక వచ్చి షాపింగ్ చేసుకునే తీరువ అయిదారు వందల ఖరీదన్నమాట! అదృష్టవతి! కళ్ళనిండుగా చూశాడు ఫిరోజ్ లీలావతిని. లీలావతి పచ్చగా పొడుగ్గావుంది. మెరిసే కళ్ళు! తళతళ్లాడే వొళ్ళు! ఎర్రని పట్టుమీద జరీగళ్ళువున్న చీర కట్టుకుంది. వంటిరంగులో కలిసే పసుపుపచ్చని టెరిలిన్ స్లీవ్‌లెస్ బ్లవుజు వేసుకుంది. వంకులు వంకులు తిరిగే లావాటి జుట్టుని గట్టిగా బిగించి, నడినెత్తిమీదకు ముడివేసింది. చెవులకి జిప్సీరింగులు. సన్నని పెదాలకు లిప్‌స్టిక్. సన్నగా పొడుగ్గావున్న చేతివ్రేళ్ళకి. క్యూటెక్స్! పెద్దపెద్ద నల్లని కళ్ళని చుట్టూవున్న అద్దాల బీరువాల వెంపు త్రిప్పి త్రిప్పి చూస్తూ కూర్చుంది లీలావతి.

"చాలా రోజులయింది. మీరు వచ్చి!" మళ్ళీ అన్నాడు.

"అవునవును." అంది లీలావతి నవ్వి. నవ్వినప్పుడు, ఆమె సన్నని పెదాలమీద మంచిముత్యాలు మెరిశాయి!

"నువ్వు వీళ్ళందరికి ఏం కావాలో చూడు! నేను ఆమెగారికి ఏం కావాలో 'బాస్'ని అడిగివొస్తాను," ఆమె సాన్నిధ్యాన్ని వొదులుకోలేని ఫిరోజ్ అన్నాడు.

"సర్లేవెళ్ళు! ఇంకా షాంలాల్, మున్నీరాం వున్నారుగా!" అన్నాడు అహమ్మద్. తనలో పాపం పసివాడు అనుకున్నాడు అహమ్మద్. ఫిరోజ్ చాలా అందంగా ఉంటాడు. కొత్తగా సేల్సుమేన్‌గా వచ్చాడు. తను చాలా అందమైనవాడినని ఫిరోజుకి తెలుసును. అవకాశంవస్తే ఒక అరిస్టోక్రాట్‌ని ప్రేమించాలనీ, అందమైన సినిమాతార ప్రక్క రొమాంటిక్ హీరోగా నటించాలనీ ఆరాట పడుతూన్నాడు. లీలావతిని చూడగానే అతనికి అరాధ్యదేవత దిగివచ్చినట్లనిపించింది. నెమ్మదిగా 'బాస్' దగ్గర కెళ్ళి నించుని నెమ్మదిగా.

"ఆమెకేం కావాలి సార్?" అన్నాడు. అల్లూరాం ఫిరోజ్‌ని గమనించలేదు. లీలావతితో సంభాషణలో నిమగ్నమైపోయాడు. లీలావతి ఏదో సోదిగా చెప్పుకపోతోంది. ఫిరోజ్ ఆమె మాట్లాడేటప్పుడు ముఖంలో, మెరిసే హావభావాలను పరిశీలిస్తూ నిలబడ్డాడు.

"ఆరోజు యిక్కడే మొదటిసారిగా కలుసుకున్నాను కేశవరావుని. ఉట్టి దగుల్బాజీరకం అని నేను అనుకోలేదు. ఆ రోజు యెంత పెద్దమనిషిగా వ్యవహరించాడు? మీరే చూశారుగా? తర్వాత రెండు సార్లు, టెన్నిస్‌కోర్టులో కలుసుకున్నాం.



ఒకసారి తనింట్లో పార్టీయిచ్చాడు. దానికి నేను వారం తిరక్కుండానే మళ్ళీ పార్టీ యిచ్చాను. ఇల్లా పార్టీలు యిస్తూ, సినిమాలూ, షికార్లూ తిరుగుతూ రెండేళ్ళు గడిపాం. ఇంక ఒకరోజున నేనుఅడిగేద్దా మనుకున్నాను."

"ఏమని?" అల్లూరాం అడిగాడు.

ఆ ప్రశ్నని మనసులోనే వేసుకున్నాడు ఫిరోజ్.

"అతనికి ఈ వూళ్లో రెండు మేడలున్నాయి. గూడూరులో మైకాగనులుకూడా వున్నయ్యంటాడు. అసంగతి మనకి నికరంగా తెలియదు అనుకో! అతని ఆస్తిపాస్తుల విషయం ఎల్లావున్నా, అతని ముఖంలోని స్ట్రయికింగ్ ఫీచర్స్ నన్ను ఆకర్షించాయికాబోల్ను! కనుక అనాలోచితంగా అడిగేశాను. నన్ను పెళ్ళిచేసుకోవటం ఇష్టమేనా! అని. అంతే! నిలువునా నీరయిపోయాడు మనిషి.

"నిజమేనా ? అన్నాడు కేశవరావ్."

"అబద్ధం ఎందుకు చెప్పాలి! అన్నాను."

"నాకు చాలా సంతోషంగావుంది. మన స్వంతా దూదిపింజల్లె ఎక్కడికో ఎగిరిపోతూంది. నిజంగా నువ్వు దేవతవి లీలా !" అన్నాడు.

"దేవతనికాను మానవినే !" అన్నాను.

"అప్పుడేం జరిగిందనుకున్నావ్ !" అని ఆగింది లీలావతి.

"ఏం జరిగిందీ ?"

అదే ప్రశ్న అల్లూరాం పైకి అడిగాడు. ఫిరోజ్ మనస్సులో మననంచేసుకున్నాడు.

"అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాం. డేటు కూడా ఫిక్స్‌చేసుకున్నాం. అప్పుడు తెలిసింది ఈ వార్త !"

"ఏవార్త ?"

"అదే! అతని ఆస్తిపాస్తులమీద, దాయాదు లెవరో దావా చేసేరన్న సంగతి. బతికాను దేముడా ! ముందే తెలిసింది అనుకున్నాను. అంత లక్జూరియస్ లైఫ్ లీడ్‌చేసే వ్యక్తి ఆస్తి అంతా పోతే ఏమవుతాడు ? ఇంక నా ఆస్తిమీదకు దృష్టిమళ్ళిస్తాడు. ఎవరితోనో అన్నాట్టకూడా. నా ఆస్తి పోయినా నాకేం లోటు ? కొన్ని రోజుల్లో లీల నా అధీనమవుతూండగా. ఇల్లాంటి అప్పు లెన్నిఅయినా ఒకగంటలో తీర్చిపారేస్తాను." ఓరి బంగారు నాయనా ! అనుకున్నాను. "మన వివాహం క్యాన్సిల్ చేసుకుందామోయ్ !" అన్నాను. "ఆఁవేం ?" అన్నాడు. "నా కిప్పుడప్పుడే పెళ్లాడాలని లేదు." అన్నాను. తర్వాత ఎక్కడన్నా కనిపించినా, ముఖం ముడుచుకుపోయేవాడు. కాని, ఫార్మల్‌గా విష్‌కూడా చేసేవాడుకాదు. ఇంతలోవుంది అనుకున్నాను. ఆ సంగతి మనస్సులోంచి చెరిపిపారేశాను." గర్వంగా అంది లీలావతి.

"అంతేమరి !" అన్నాడు అల్లూరాం.

"అమ్మయ్యా !" అనుకున్నాడు ఫిరోజ్.

"ఏం కావాలి మాడమ్ !"

ధైర్యంచేసి ఆమెనే అడిగాడు ఈసారి. లీలావతి అతనికేసి చూసింది. ఒకక్షణం అతనివచ్చని. విశాలమైన నుదురుమీద, అల్లరిచేస్తూ, కదులుతూన్న ఉంగరాల జుట్టుకేసి ఆమె దృష్టి నిలబడింది.

"హేండ్‌సమ్ మేన్ ! నేను క్రితంసారి వచ్చినప్పుడు లేడే ? కొత్తగా ఎపాయింట్ చేశావా ?" అంది, అల్లూరాంకేసి తిరిగి.

"అవును. ఇతనువచ్చి ఆర్నెల్లే అవుతోంది." అన్నాడు అల్లూరాం.

"ఇదివరకు యెక్కడన్నా వర్క్ చేశావా ?" అంది లీలావతి. ఆమె తనతో మాట్లాడటం వించి, ఉల్లాసం కలిగినా, ఏకవచన ప్రయోగానికి - చిన్నపుచ్చుకున్నాడు ఫిరోజ్.

"ధనీరాం షాపులో రెండుసంవత్సరాలు చేశాను." ముక్తసరిగా అన్నాడు, ఫిరోజ్.

"గుడ్‌గాడ్ ! వాడిదగ్గర రెండేళ్ళ ఎల్లా చేశావోయ్. నాయనా! వాడి కొడుకు నిర్మల చంద్ లేడూ ? వాడూ నేనంటే పడి చచ్చేవాడనుకో ! వాడి తండ్రి. టిరనీ ని నేను భరించలేకనే. అతన్ని వదులుకోవల్సి వచ్చింది. నిజానికి! నిర్మల్‌చంద్ హృదయం నవనీతమనుకో ! కాని ఏం చేయను ? కన్నకొడుక్కి, ఏవయినా సరదాలువుంటాయని తెలియని, నాయిక్కాళ్ళ జంతువు ఆ ధనీరాం ! పిల్లలు ఎదిగాక వాళ్ళకి సినిమాలనీ, షికార్లనీ, తిరగాలని వుండదూ ? కాస్త ఆ ఖర్చులకి 'పాకెట్‌మనీ' ఇయ్యకపోతే ఎల్లా ! పేరుకి కోటీశ్వరుడే ఆధనీరాం ! కాని ఇంట్లో రోజూ ఆ కర్రపెండలం పిండి రొట్టెలుతప్ప, వేరే వంటకాలే వుండవట. మా ఇంట్లో 'డిన్నర్' టైంకి ఎప్పుడన్నా వస్తే. ఆ డిషెస్ కేసి, వళ్ళంతాకళ్ళుచేసుకుని చూసేవాడు నిర్మల్ !"

"రావోయ్ ! నువ్వుకూడా మీల్స్ తీసుకో" అనేదాన్ని. "వద్దు వద్దు!" అని మొహమాటపడేవాడు. కాని, కళ్ళతోనే ఆ పదార్ధాలని తినేసే చూపుని నేను గమనించలేనిదాన్నా ? బలవంతంచేసి తినిపించేదాన్ని."

"పాపం !" సానుభూతిగా జంటగా అన్నారు అల్లూరాం, ఫిరోజూనూ.

"మా నాన్న ఎన్నాళ్ళవుంటాడు లీలా ! పుట్టికట్టుక పూరేగుతాడా ఏం ? ఆయన కారణంగా నన్ను తిరస్కరించకు లీలా ?" అని బ్రతిమాలాడు.

"అవును అందులో నిజంలేకపోలేదు" అన్నాడు అల్లూరాం. తన కొడుకు అమీర్ చంద్ గుర్తుకువచ్చాడు అల్లూరాంకి.

"అతనికి నామీదవుండే ఆరాధన్ని తృణీకరించలేను. కాని, ఇంటికోడలుగా చేరి, మామగార్ని, మనసులోనే రోజూ శపించుకోవటం, నాకు తప్పనిపించింది. ఆయన పీనాసి తనాన్ని అంగీకరించే వ్యక్తే కోడలుగా రావొచ్చును ! అది వాళ్ళ అదృష్టం! నా తత్వానికి పీనాసితనం పడదు. కనుక



మేష్టారు : "చివరకి రాముడు సీత ఎక్కడుందో తెలుసుకున్నాడా ? హనుమంతుడు క్షేమంగా లంకనుంచి తిరిగి వచ్చాడా ? వానర సైన్యమంతా సముద్రందాటగలిగిందా ? మిగతా కథ కోసం రాత్రి హోంవర్కుగా తెలుగు పాఠం చదవండి వెధవల్లాలా,"

నాది నేను ఖర్చుచేసుకుంటాను. కాని ఇతర్లు కూడా నామార్గాన్నే నడవాలనుకోవటం, తప్పుకాదూ ? అదే అన్నాను నిర్మల్‌తో. "నీ నిర్మలానురాగానికి నా హృదయం స్పందిస్తోంది. కాని, నీ ఇంట్లోచేరి, రోజూ ఆ ముసలాయనకి మృత్యువుని ఆహ్వానించటం నాకిష్టంలేదు. అంచేత మనిద్దరం పెళ్ళి చేసుకోవటం కుదరదు." అన్నాను.

"అవును. మంచిపనిచేశారు" అన్నాడు అల్లూరాం.

"ఆయనకి ఇప్పుడు ఇద్దరు పిల్లలు" అన్నాడు ఫిరోజ్.

"అవును. అప్పటి కప్పుడే వాళ్ళచుట్టాల అమ్మాయిని చేశాడు, ధనీరాం "

"మామకి తగ్గ కోడలే నండి ఆవిడ." అన్నాడు, ఫిరోజ్.

"పోన్లే అదృష్టవంతుడు. నాలుక్కాలాల పాటు బ్రతుకుతాడు. ఎందుకనో అంతకూడిక చెయ్యటం! కూచమ్మ కూడబెడితే, మాచమ్మ, మాయంచేస్తుందట! అంత ఇరుకుగా, పిల్లల్ని పెంచితే, ఆస్తి వాళ్ళచేతికి వచ్చిన మర్నాడు, విపరీతఖర్చులు చేసేసి, అడుక్కుపోతారు. పిల్లల్ని మనసు వికసింపచేసి, వాళ్ళ ఆర్థికఅంతస్థులు తెలిసేలా పెంచాలి. అల్లా చేస్తే, వాళ్ళు సుఖపడుతారు. మన్ని గురించి కఠినంగా అనుకోవటానికి ఆస్కారం వుండదు. వున్న డబ్బంతా మనకోసం, మన తల్లితండ్రులు ఖర్చుపెట్టారు అనే భావన పిల్లలకి కలిగిన్నాడు, ఆ పిల్లలు ఆ తల్లితండ్రులని పూవుల్లో పెట్టి పూజిస్తారు. అంతేకాని కాని డబ్బుకూడా డిబ్బీలోంచి తీయకుండా ఎదిగే పిల్లల సంతోషాలని ఆరికట్టి పెద్దయ్యాక, ఒక కోటి రూపాయిలు ఇస్తేమటుకు ప్రయోజన మేమిటి? ఆకలేసినప్పుడే అన్నం! డబ్బుకి అనవసర ప్రాముఖ్యత నిచ్చి, డబ్బు యొక్క విలువపెంచినది మనమే!"

"అవునండి! ఇంతకీ మీ కేం కావాలో....." నసిగాడు ఫిరోజ్. ఎంతకీ ఒక గొడవలోంచి ఇంకో గొడవలోకి అల్లా గొలుసుకట్టుగా మాట్లాడుతుందితప్ప, తన కేం కావాలో చెప్పటంలేదు. వ్యాపారం స్తంభించింది. వచ్చినవాళ్ల కాస్సేపు లీలావతినిచూసి సేల్సుమెన్ తమ మాటవినిపించుకోవటం లేదని, కోపగించుకుని పోతున్నారు. లీలావతి వచ్చిన యీమూడు గంటల్లోనూ, వాళ్ళకి, ఒక మీటరు గుడ్డయినా అమ్ముడుకాలా! "అదే, టెరిలీన్ శారీస్ చూపించు! హల్లో!" గుమ్మంకేసి చూశాడు ఫిరోజ్. సన్నగా పొడుగ్గావున్న ఒకమనిషి లోపలికి వచ్చాడు. అల్లూరాం మళ్ళీ కంగారుపడి, బంగారం పళ్ళతో నవ్వి....

"దయచెయ్యండి. దయచెయ్యండి." అని కుర్చీ చూపించి "బోయ్!" అన్నాడు. ఒక సేల్సుమేన్ ద్రాక్షగ్లాసు తెచ్చిఇచ్చాడు. అతను స్తిమితంగా కూర్చున్నాడు. కోటు విప్పి కుర్చీకి తగిలించాడు.

"ఏమిటిమాట్లాడవేం? మర్చిపోయావా?" అంది లీలావతి.

"నువ్వేనా అని అనుమానిస్తున్నాను." సాఫీగా అన్నాడు వచ్చిన వ్యక్తి.

లీలావతి గట్టిగా నవ్వి అంది,

"చూడు అల్లూభైయ్యా! నేనేనా అని అనుమానిస్తున్నాడట!" అల్లూరాం నవ్వాడు.

"ఏం కావాలండి?" వచ్చినవ్యక్తిని అడిగాడు ఫిరోజ్.

"అతని కేం కావాలో నన్నడుగు చెప్తాను. దిండిగల్ చీరెలు, నాలుగ్గజాల చీటీ పువ్వులగుడ్డా! కదూ నటేశన్?" అంది హేళనగా లీలావతి.

ఇతనిపేరు నటేశన్ అన్నమాట! అనుకున్నాడు, ఫిరోజ్.

నటేశన్, ద్రాక్షజ్యూస్ నిమ్మళంగా పుచ్చుకున్నాడు.

"నువ్వొకసారి లోపలికి రావాలి. అల్లూభాయ్!" అన్నాడు. అల్లూరాం ఇబ్బందిగా ముఖం పెట్టాడు. లీలావతిని ఒంటిగా వొదిలి రావడం యిష్టంలేదు అల్లూరాంకి.

"ఆ సంగతేదో ఇక్కడ్నే చెప్ప కూడదా?" అన్నాడు.

"నాకు వెయ్యిరూపాయిల సరుకు దాకా క్రెడిట్ ఇయ్యాల్సుంటుది" అన్నాడు నటేశన్.

"అల్లాగే. తీసుకెళ్ళండి! ఫిరోజ్! ఈయన్ని తీసుకెళ్ళి ఏంకావాలో చూడు" అన్నాడు అల్లూరాం.

నటేశన్ అల్లూరాం ఉదారతకి ఆశ్చర్యపోలేదు. లీలావతి వుందికనుక అంత సులభంగా తనకి అల్లూరాం క్రెడిట్ ఇచ్చాడన్న సంగతి అతనికి తెలియందికాదు. ఫిరోజ్ సగం అయిష్టంగానే, నటేశన్ని లోపల వేపు భాగానికి తీసుకెళ్లాడు. నటేశన్ కంజీవరం, ధర్మవరం, బెనారస్ పట్టుచీరలు చూస్తూన్నాడు.

"క్రెడిట్ నా యెదుట అడక్కూడదనుకున్నాడు కాబోలు! పూర్ ఫెలో!" అంది లీలావతి.

"అంతే అయ్యుంటుంది!" అన్నాడు అల్లూరాం.

"ఇంతకీ యిప్పుడు వెయ్యిరూపాయల సరుకు యెందుకంటావు? ఏదన్నా చిన్న బిజినెస్ ప్రారంభం చేయాల్నా?" అంది

"అబ్బే! బిజినెస్‌కి కాదు. ఆయన కూతురికి పెళ్ళట! మొన్న వాళ్ళింట్లో అద్దెకున్న నాయర్ చెప్పాడు. ఏదోమాటల సందర్భంలో. అందుకయి వుంటుంది."

"అల్లాగా!" గంభీరంగా అంది లీలావతి. "ఇతనుకూడా మీరంటే చాలాఇష్టంగా వుండే వాడుకదూ?" అన్నాడు అల్లూరాం.

"అవును అలానే నటించేవాడు!"

"నటనంటారా?"

"కాక మరేమిటి? తీరా నేనూ పోనీ పెళ్లాడుదాం అనే నిర్ణయానికి వచ్చేసరికి, ఒక యాభైవేల రూపాయిలు యివ్వమన్నాడు."

"మిమ్మల్నా?" ఆశ్చర్యపోయాడు అల్లూరాం.

"అవును. ఎందుకోతెల్సా? తనకి నాతో సమానమయిన "స్టేటస్" లేదట! అంచేత తను కంజీవరం, కోయంబత్తూరు, సేలం, మొదలయిన వూళ్లు, వెళ్ళి, అక్కడ హోల్ సేల్‌గా, బట్టలుకొని ఇక్కడ షాపు పెడ్తాడట! దాంతో అతని స్టేటస్ పెరుగుతుందట! అప్పుడు పెళ్ళిచేసుకుంటే ముచ్చటగా వుంటుందట!"

"మీ రేమన్నారు?"

"ఎప్పుడయితే, నేను నిన్ను పెళ్ళి చేసుకుంటానో, అప్పుడే నీకు, స్టేటస్ కలుగుతుంది. అంతకన్నా ఏమిటి? స్టేటస్‌ని కొనుక్కుంటేకాని పెళ్ళి చేసుకోని పక్షంలో, నాకు ఈ పెళ్ళి ఇష్టంలేదు." అన్నాను. చచ్చినట్లు తప్పుకున్నాడు. ఎక్కడ కనిపించినా మనస్సు విప్పి మాట్లాడలేడుకదా! వెధవ కుళ్ళుబోతు సమాధానాలు ఇస్తాడు. నాకు పళ్ళమండుకవస్తుంది" అంది కోపంగా లీలావతి. లోపల్నుంచీ ఫిరోజ్, నటేశన్ వచ్చారు. నటేశన్ చేతులో వెయ్యిరూపాయల సరుకువుంది. ఫిరోజ్ కొన్ని టెరిలీన్ చీరలుకూడా లీలావతి కోసం తీసుకవచ్చి, లీలావతి కుర్చున్న బల్లమీద పరిచాడు. అహమ్మదుఖాతా పుస్తకం తీసుకవచ్చి అల్లూరాంకి ఇచ్చాడు. అల్లూరాం నటేశన్ ఏయే బట్టలు ఖరీదు చేసినదీ అడిగి వ్రాసుకున్నాడు.

"మీ అమ్మాయి పెళ్ళట?" అంది.లీలావతి. "అవును," ముక్తసరిగా అన్నాడు నటేశన్.

"మాటమాత్రం చెప్పకూడదా ఏమిటి?" అన్నది లీలావతి.

"ఇంకా ఇన్విటేషన్స్ పంపించలా ఎవ్వరికీనూ!" అన్నాడు.

''రేపొకసారి మా ఇంటికేసిరా!'' అంది లీలావతి.

''అల్లాగే'' అన్నాడు నటేశన్.

''మర్చిపోక తప్పకుండా రా!'' మళ్ళీ అంది లీలావతి.

''నువ్వు పిలుస్తే మరుపా? ఎంతమాట. నిన్ను మర్చిపోతే నన్ను నేనే మర్చిపోయి నట్లు!'' అన్నాడు.

''ఆమాటలు పోనిచ్చుకున్నావుకాదు'' అంది లీలావతి.

''ఏ మాటా పోనిచ్చుకునే వుద్దేశ్యం నా కెప్పుడూలేదు. మరి వస్తా! వస్తా అల్లూ భైయ్యా!''

వెళ్ళిపోయాడు నటేశన్. రాత్రి పదిన్నర అయిపోతోంది. సగం బజారంతా ఖాళీ అయి పోతోంది. సేల్సుమెన్ వూరికే విసుక్కుం టున్నారు. రోడ్డుమీద అప్పుడో కారూ-ఇప్పుడో కారూ పోతున్నాయి.

ఫిరోజ్ 'ఇవిగోనండి. టెరిలీన్ చీరలు'' అన్నాడు. లీలావతినెమ్మదిగా ఒక్కొక్కటీ విప్పి చూస్తోంది. పమిటిచెంగుకు గజంమేర జరీ అంచు, చుట్టూ దోసెడు వెడల్పు జరీ అంచు వున్నయ్ ఆ చీరలకి. ముదురు ఎరుపు, లేక నీలం, పసుపు, లేత ఆకుపచ్చ మొదలైన రంగుల్లో వున్నాయి ఆ చీరలు. ఫిరోజ్‌కి, ఆమె లేత పసుపు చీరకట్టుకుంటే చూడాలనిపించింది. ఆమె వేసుకున్న జాకెట్ ఆమెవంటి రంగులో కలిసిపోయి, ఆమె జాకెట్ వేసుకోలేదేమో అనే భ్రమ కలిగి స్తోంది ఫిరోజ్‌కి. చీరకూడా అల్లాంటిదే కట్టుకుంటే!!

లీలావతి తెల్లని చీరలు రెండూ, లేత గులాబి చీరలు రెండూ, లేత నీలంచీరలు రెండూ తీసింది.

''ఇంక ఇవి చాల్ను! డెకరాన్ శారీస్ చూపెట్టు!'' అంది లీలావతి. పసుపురంగు చీరలు తీయకపోవటంతో హతాశుడైనాడు ఫిరోజ్.

''పసుపురంగు తీయలేదు మీరు! అది ఎంతో బాగా వుంటుంది మీకు: ఆ పచ్చని చీరతో ఇప్పుడు మీరువేసుకున్న జాకెట్ వేసుకుంటే దేవతాస్త్రీలా వుంటారు" విన యంగా భక్తిగా అన్నాడు ఫిరోజ్.

లీలావతి గర్వంగా నవ్వింది. ఆమె చెంపలు గులాబీరంగుతో సొట్టలుపడ్డాయ్. నల్లని చారెడేసి కళ్ళు నక్షత్రాలల్లె మెరి శాయ్.

''ఈ చీరలు నాకుకాదులే! మా అమ్మా యికి! మా అమ్మాయి నల్లగా వుంటుంది. తండ్రి పోలిక వచ్చింది. దానికి రేపు పుట్టిన రోజు, అంచేత పార్టీకి వుంటాయి అని కొంటున్నాను. మళ్ళీ కాలేజీకి బోయేరోజు లొచ్చాయిగా! అందుకని ఏకంగా కొం టున్నాను,'' అంది లీలావతి.

''రేపు మీ అమ్మాయి పుట్టినరోజా!' అన్నాడు అల్లూరాం.

''అవునోయి. కార్డ్సు యింట్లో మర్చి పోయాను. రేపు మీస్టాఫ్ అంతటినీ తీసు కు పార్టీకిరా!'' అంది.

''చదువుకుంటూందా?''

అన్నాడు అల్లూరాం.

''ఆఁ నాగపూర్‌లో యం. ఎ. చదువు తోంది!'' అంది లీలావతి.

నీరసంగా డెకరాన్ చీరలున్న బీరువా వేపు కదిలాడు ఫిరోజ్!

లీలావతి వాళ్ళ అమ్మాయి మంచితనాన్ని గురించీ, వాళ్ళ నాన్నకి(అంటే తన భర్తకి) తనమీదవుండే అపార ప్రేమను గురించీ మాట్లాడుతోంది. అల్లూరాం వింటున్నాడు.

□□□

హలో! హలోహలో!



అప్పలరాజూ
అప్పులరాజూ

చాలాకాలం తర్వాత ఆగొంతు వినిపించింది. చటుక్కున వెనుతిరిగి చూశాను.

తపీమని అంతవరకు విచ్చివున్నగొడుగు మూతపడిపోయింది. ఆ గొడుగు చాటునించి ముఖం కనిపించింది. అప్పలరాజు!

అప్రయత్నంగా నా పెదవులమీద చిరు నవ్వు మొలకెత్తింది: "ఏమిటోయ్ మా ఇంటివైపు రావడం మానేశావ్?" అన్నాను అనాలోచితంగానే.

"మీ ఇల్లు చాలా దూరమైపోయిందోయ్!" చూస్తూండగానే అప్పలరాజు ముఖంలో విచార జీమూతాలు అలముకున్నాయి.

"అంటే, నువ్వు వేరేఇంటికి మారావా?"

"ఛా - ఛా .... నేను ఆ ఇల్లు మార్చ డమే! ఈ జన్మలో మళ్ళీ అలాంటి ఇంటా విడ-సారీ-ఇల్లుగలావిడ దొరకొద్దూ?"

"మరి మా ఇల్లు నీకు ఎలా దూరమైంది?"

"మీ వీధి ఇప్పుడు వన్ వే ట్రాఫిక్ అయిందిగా?"

"ఐతే ఏం—మార్కెట్.వీధివైపు నించి రావొచ్చుగా?"

"అక్కడే వచ్చిందయ్యా చిక్కు."

"అదేమిటీ?"

"అవైపు వీధి మొగదలలో ఒక పత్రిక అమ్మే కొట్టును పోయిన సంక్రాంతినాడు ఎవరో తెరిచారుగా?"

జి. వి. జి.

"అవునూ - జైహింద్ న్యూస్ పేపర్ మార్ట్."

"ఆ కొట్టువాళ్ళదగ్గర ఆ సంక్రాంతినాడే ఐదు రూపాయిలకు ఏవేవో సంక్రాంతి సంచికలు అప్పుగా పుచ్చుకున్నాను...."

"ఓహో - సరేలే ...ఇప్పుడు విషయం అర్థమైంది" అన్నాను నవ్వుతూ.

ఇదీ అప్పలరాజు వరస .... అతను అప్పులు చేయడానికే పుట్టాడు; అతనికి అప్పులుఇవ్వడానికే కొందరు పుట్టారు.

హఠాత్తుగా అప్పలరాజు సీరియస్ గా ముఖంపెట్టి "అది సరే కాని, మన రామారావుగాడు డబ్బంతా ఏం చేస్తున్నాడురా - ఎప్పుడడిగినా, లేదు లేదనే ఏడుస్తూంటాడు?" అన్నాడు.

"ఇంతకీ, నీకు ఎంత డబ్బు బాకీ ఉన్నాడేవిటీ ?" అన్నాను ఆశ్చర్యంగానే.

"నాకు బాకీ ఏమిటీ—నేనే వాడిదగ్గర బదులు పుచ్చుకోవాలని చూస్తున్నాను." అంటూ అప్పలరాజు ఠీవిగా షర్ట్ కాలర్ సరిచేసుకొని, "బ్రదర్....చాలా అవసరంగా ఉందోయ్....అర్జంటుగా ఓవంద రూపాయల అరువు ఎక్కడ పుట్టుతుందో చెప్పు" అన్నాడు.

"రక్షించావు....నన్ను అరువు అడుగుతావేమోననుకున్నాను." అంటూ ఆక్కడ్నించి చల్లగా జారుకోబోయాను.

అప్పులు పుట్టించడంలో_అప్పులు తీర్చడంలో కాదు—మా అప్పలరాజు నిష్ణాతుడు. అసలు కొందరికి అప్పులు చేయడానికే ధైర్యం చాలదు. మరికొందరికి అప్పుపుచ్చుకున్న మరుక్షణంనించి దాన్ని ఎలా తీర్చడం అన్న బెంగ ఆవహిస్తుంది. ఐతే, మాఅప్పలరాజు విషయం వేరు....

బాకీమాట ఏమిటని అడిగినప్పుడల్లా డబ్బు లేదని అబద్ధ మాడుతావేవిటయ్యా?" అని కోమలవిలాస్ కాఫీ క్లబ్బు అయ్యరు అడిగితే—

"అందుకే, ఇటుపైన నా చేత అబద్ధ మాడించకండి, స్వామీ!" అని శపీమవి అనేస్తాడు అప్పలరాజు.

పుట్టనిచోట్లనైతం అప్పు పుట్టించడం ఒక అద్భుతమైన కళ. ఈ నేర్పు అందరికీ సిద్ధించదు. మా అప్పలరాజుకు_వెనుక ఆస్తి ఏమీ లేకపోయినా, ఒకటిమాత్రం ఉంది. అది సమయస్ఫూర్తి. అందులోనే అతనికి ఉంది కీర్తి.

"ఇది బాగా లేదండి. ఊర్నించి వచ్చిన తర్వాత మా బాకీ తీర్చేస్తానని చెప్పారా— లేదా? మళ్ళీ వాయిదాలు వేయడం బావుందా ?" అని కిరాణా కొట్టు ఆసామీ అడిగితే—

"నిజమే - బావుండదు. కాని, నేను మా ఊరికి ఇంకా వెళ్ళనేలేదు కదండీ?" అని ఆర్ధ్రే ఆలోచించకుండా సమాధానమివ్వడంలో అప్పలరాజుకు అతనే సాటి.

ఒకసారి ఏదో కంపెనీ బిల్లు కలెక్టరు మా అప్పలరాజు దగ్గరికి రావడమే విసురుగా వచ్చి, "ఏమిటి సార్,...మీకోసం తిరగలేక నా కాళ్ళు పడిపోతున్నాయి. ఇల్లా ఎన్నిసార్లు సార్? మా మేనేజర్ కు సంజాయిషీ ఇచ్చుకోలేక చచ్చిపోతున్నా. ఇంతకీ ఒక్క విషయం కుండ బద్దలుకొట్టినట్లు చెప్పేయండి - మీరీ జన్మలో మా బాకీ

తీర్చడం అంటూ ఉందా - లేదా ?" అని తీక్షణంగా అడిగాడు.

అందుకు అప్పలరాజు శాంతిగా అంటాడు కదా—"అయ్యా, నీలాంటి కలెక్టర్లకు కాస్త ప్రపంచ జ్ఞాన మనేదిఉండాలి. మీ ఫర్నిచర్ కంపెనీ చాలా చిన్నది; అవునా? ఆ చిన్న కంపెనీలో నీతో సహా నలుగురు బిల్ కలెక్టర్స్ ఉన్నారు; అవునా? అడిగిన క్షణమే అందరూ బాకీలు చెల్లిచ్చేస్తూంటే మీ నలుగురు కలెక్టర్స్ కూ ఏంపనిఉంటుంది? అప్పుడు నీ ఉద్యోగం ఎంతకాలం నిలుస్తుంది ?"

దాంతో ఆ బిల్ కలెక్టరు బుర్ర గోక్కుంటూ "అవును, మీరు చెప్పింది నిజమేసార్.... నాకా విషయం తోచిందే కాదు....సరే లెండి-మెల్లగా ఎప్పుడైనావచ్చి కలుసుకుంటా" అంటూ చక్కా వెళ్ళిపోయాడు.

బయటేకాదు; ఉద్యోగం గిరీ చెలాయిస్తూన్న ఆఫీసులో కూడా మా అప్పలరాజు అడ్వాన్స్ పుచ్చుకునేవారిలో చాలా అడ్వాన్స్డుగా ఉంటూంటాడు. ఒకసారి ఆ ఆఫీసు మేనేజరు లెక్కలన్నీ తనిఖీచేస్తూ, మన అప్పలరాజు అకౌంటుచూసి, అతగాడ్ని పిలిపించాడట.

"ఏమండీ అప్పలరాజుగారూ! మీకు తండ్రులు ఎందరు ?"

మేనేజర్ ప్రశ్నకు అప్పలరాజు చేతులు నలుపుకుంటూ "అదేమిటి సార్, అలా అడుగుతారు ?" అన్నాడు.

"మరి, మీ నాన్నగారికి తద్దినమంటూ ఈ ఒక్క సంవత్సరంలో ఐదు సార్లు అడ్వాన్స్ పుచ్చుకున్నారేమిటండీ ?"



బ్రహ్మచారి : తనలో ఎన్ని లోపాలున్నాయో తెలుసుకోడానికి అవకాశాలు లేనివాడు.

"అందులో విచిత్రమేముంది సార్? మా నాన్నగారికి తోబుట్టువులు నలుగురు. వాళ్ళందరూకూడా పితృదేవతలయ్యారు. వాళ్ళలో ఎవరికీ పిల్లా పీచులేరు. వాళ్ళు నాకేం ఆస్తి వదలివెళ్ళకపోయినా-వాళ్ళందరికీ నేను తద్దినాలు జరపాల్సిన శ్రాద్ధం మాత్రం నాకు వదలివెళ్ళారు. ఏంచేయను? ప్రతి ఏడూ వాళ్ళ తద్దినాలకే అయిదారు సార్లు అడ్వాన్స్, పుచ్చుకోవాల్సిన కర్మ నాకుపట్టింది" అని నెత్తిబాదుకునేసరికి, అప్పుడా మేనేజర్ కు అప్పలరాజుపట్ల ఎంతైనా జాలికలిగి ఉండాలి.

చచ్చినవాళ్ళు ఏ స్వర్గాన హాయిగా ఉన్నారో కాని, వాళ్ళ పేర్లు చెప్పి అప్పులు పుచ్చుకుని హాయిగా కాలం గడపడం అప్పలరాజులాంటి వాళ్ళకు మామూలు.

ఒకసారి అప్పలరాజు తన తండ్రి చనిపోయాడని (ఆ మహానుభావుడు మరణించింది పది సంవత్సరాలక్రితం). అంత్యక్రియలకోసం కావాలని ఒక పెద్దమనిషివద్ద యాభైరూపాయలు అప్పు పుచ్చుకున్నాడట. వారం రోజుల్లోగానే తీర్చేస్తానని. అంతే.

ఆరు మాసాలయినా మన అప్పలరాజు ఆ పెద్దమనిషికి తన ముఖం చూపించలేదు. ఒకసారి వాడి గ్రహచారంకొద్దీ ఆ పెద్దమనిషి బజారు వీధిలో దాపరించాడు. ఏం మాట్లాడకుండా ఆయన వచ్చి అప్పలరాజు ఎదుట ఠీవిగా నిలుచున్నాడు. ఒకసారి మీసాలు మెలివేశాడు. ఆయన కళ్ళు చూస్తూండగానే తీక్షణంగా మారాయి. అంతేకాని, ఆ బాకీ సంగతిమాత్రం అడగలేదు.

దాంతో అప్పలరాజు నిలువునా ఎక్కడ కంపించి పోతాడో అనుకున్నా. అయినా, అతగాడికి ఇదొకలెక్కా? అమాంతంగా తల వాల్చేసి, జేబురుమాలతో కళ్లు అద్దుకోసాగాడు. అప్పటికీ ఆ పెద్దమనిషి పెదవి విప్పనేలేదు. కొన్నిక్షణాలాగి, అప్పలరాజు మెల్లగా తలఎత్తి, "మీకు నాముఖం చూపించలేకుండా ఉన్నాను. ఆరుమాసాల్లోనే నా తల మీద మరో పడుగు పడుతుందని కలలోనైనా అనుకోలేదు. వాన రాకడ—ప్రాణ పోకడ తెలియదని ఊరకేఅన్నారా పెద్దలు? నిన్నరాత్రి మాఅమ్మ చనిపోయిందండి (అప్పలరాజును ఈ లోకానికి ప్రసాదించిన పదిరోజులకే ఆ మహాతల్లి కన్నుమూసిందటలెండి) .... అసలు మానాన్న పోవడంతోనే ఆమెకు రోగం తిరగబెట్టింది. మందులకు ఇల్లంతా గుల్లచేసి ఉన్నదంతా ఊడ్చి పెట్టేశాను. ఇప్పుడామె అంత్యక్రియలకు...."అంటూ ఆ తర్వాత మాట్లాడలేక బలంగా ఒక్క నిశ్వాసం వదిలాడు.

పాపం, చూస్తూండగానే ఆ పెద్దమనిషి ముఖంలో రంగులు మారాయి. మనిషి అమాంతంగా చప్పబడిపోయి, పక్కజేబులోంచి పదిరూపాయల నోటును బయటకు తీశాడు: 'నాయనా, కష్టాలు (అప్పటికి కాని నోరు తెరిచాడు కాదు.) మనుషులకు కాకపోతే మానులకు వస్తాయా? ఇక నువ్వెంత ఏడ్చినా చచ్చినవాళ్ళు తిరిగి రారుకదా? ఇదో-ఇప్పుడు నా జేబులో ఈ పది రూపాయిలే ఉన్నాయి. ఫరవాలేదు-తీసుకో. నీకు వీలయిప్పుడే ఇద్దువుగానీలే.... కర్మకాండలను మాత్రం సాంగోపాంగంగా నెరవేర్చు" అంటూ మనవాడి భుజంమీద అనునయంగా తట్టి. మెల్లగా వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

ఆ పెద్దమనిషి కనుచూపుమేర దాటే వరకు కొయ్యబొమ్మలా చూస్తూ నిల్చుండిపోయిన అప్పలరాజు "హారి వీడి కొంప కూలా. వీడు నాకు ఏ జన్మలో ఇంతమొత్తం ఋణపడిఉన్నాడో!" అంటూ ఆ పది రూపాయల నోటును చల్లగా తన జేబులోకి జారవిడిచాడు.

పుత్రరత్నం ఇంత ఘటికుడని తెలిస్తే. ఆ కీర్తిశేషులైన జననీ జనకులు ఇతనికి అప్పలరాజుకు బదులు - అప్పులరాజు అని పేరుపెట్టి ఉండేవారేమో!

"అప్పులు పుచ్చుకునేటప్పుడు ఎవరెవరి దగ్గర ఏయే కారణాలు చెప్పి పుచ్చుకోవాలో తెలిసిఉండాలి. అందుకు మనస్తత్వశాస్త్రంలో కాస్త ప్రావీణ్యం అవసరం. ఆస్తికులయితే ఏ సత్యనారాయణవ్రతం ఆచరించాలనో. ఆడపిల్లలుగల తల్లిదండ్రులయితే-మనకుమార్తెకు పెళ్ళి చేయాలనో (మన అప్పలరాజుకు ఆడ సంతానం లేదులెండి - ఉన్న ఇద్దరూ మగ పిల్లలే) అడిగితేచాలు-ఇట్టే అరువు దొరుకుతుంది" అని ఒకసారి నాతో అన్నాడు అప్పలరాజు - తను కాశీయాత్రకు వెళ్తున్నానని ఒక ముసలామెవద్ద యాభై రూపాయలు అప్పు పుచ్చుకున్నాడన్న విషయం చెబుతూ.

అప్పలరాజు దృష్టి చాలా సూక్ష్మమైనది. తన ఋణదాతలు ఎక్కడెక్కడ సంచరిస్తూంటారో అని ఓవైపు నిఘా ఉంచుతూ, మరోవైపు వాళ్ళు ఎక్కడైనా హఠాత్తుగా ఊడిపడితే ఎలా తప్పించుకోవాలో అని సదా ఆలోచిస్తూంటాడు కామోసు. అసలు అప్పలరాజు దగ్గర ఎప్పుడూ ఒక చినిగిపోయిన పాత గొడుగు ఉంటూంది. అర్ధరాత్రిలో కూడా ఆ గొడుగు వేసుకొని తిరుగుతూంటాడు తన ముఖాన్ని అందులో దాచుకొని. ఆగొడుగుకున్న రెండు రంధ్రాల గుండా అప్పులవాళ్ళెవరైనా ఎదురుగా వస్తున్నారేమోనని సదా చూస్తూంటాడు.

ఒకసారి అలా గొడుగును అడ్డుగా ఉంచుకున్న మన అప్పలరాజు అమాంతంగా బోల్తా పడ్డాడు. రెండేళ్ళక్రితం అతగాడు ఒక దర్జీవద్ద కోటు కుట్టించుకొని. (ఆ బట్టకూడా ఆ టైలర్ దేనట!) బ్యాంకికి వెళ్ళి చెక్కు మార్చుకువచ్చి డబ్బు చెల్లిస్తానని, ఆకొత్తకోటు తొడుక్కొని చక్కా వెళ్ళిపోయాడట. అంతే. ఆ తర్వాతనించి ఆ టైలర్ కొట్టువున్న వీధివంక మనవాడు చూస్తే ఒట్టు. ఇప్పుడా టైలరు వేరే వీధికి తన కొట్టును మార్చాడు. ఈవిషయం మనవాడికి యింకా తెలీదు. అంచేత ఆ వీధివంక దర్జాగా వెళ్తూంటే. ఆ దర్జీ చెయ్యితట్టి పిలవడంతో మనవాడు మహా ఇరుకునపడ్డాడు.

"నిన్నేనయ్యా....పిలుస్తూంటే అలా దిక్కులు చూస్తావేం?" అని గాండ్రించాడా షైలరు.

అప్పలరాజు తాపీగా గొడుగును మడిచి చంకన బెట్టుకుని, ఆ షైలరుదగ్గిరికి మెల్లగా నడిచాడు. "నన్నా మీరు పిలుస్త?"

"నిన్ను కాకపోతే మరెవరిని? అలా గుడ్లు మిటకరిస్తావేమిటయ్యా? ఏంపెద్ద మనిషివయ్యా! బ్యాంకినించి డబ్బు తెస్తానని బొంకి రెండేళ్ళక్రితం కోటు తీసుకెళ్ళిన మనిషివి ఇంతవరకు అజా పజా లేదు. ఇప్పుడు నిన్ను వదిలిపెట్టానేమిటి? ముందు ఆ డబ్బు ఇక్కడ కక్కితేకాని, నువ్వు నిలుచున్న చోటునించి కదలడానికి వీల్లేదు. ఏమిటనుకుంటున్నావో!" అని హూంకరించాడు.

అప్పలరాజు ఉలిక్కిపడలేదు. గుడ్లు తేలవేయలేదు. "నీకు కళ్ళున్నాయా అంటా?" అంటూ ఉన్నట్టుండి ఒకసారి గర్జించిన వాడల్లా, వెంటనే తన కోపాన్ని దిగమింగుతున్నట్లు నటిస్తూ." ఛీ-ఛీ.... అమాయకుడివి — "నీమీద అనవసరంగా కోపం చేసుకుంటున్నానేమిటి."అంటూ విచారంగా తలవాల్చేశాడు. అటుపైన నెత్తిబాదుకుంటూ "ఇదిఒకసారికాదు. రెండుసార్లుకాదు పదోసారి. మా వంశ గౌరవ మర్యాదలను మంట గలపవొద్దని చిలుకకు చెప్పినట్లు ఎంత మొత్తుకున్నా—వాడు వింటే నాకీగతి ఎందుకు వచ్చేది? ఛీ-ఛీ! ప్రతివీధిలోనూ అప్పేనా? ఈ ఊరిలో తలఎత్తుకు తిరగలేక పోతున్నాను'" అన్నాడు.

"ఏమిటయ్యా. నేనేదో అంటే-నువ్వేదో అంటావు?" అన్నాడా షైలరు అయోమయంగా చూస్తూ.

"ఏమిటి నేనేదో అనడం - నా బొంద. నా తమ్ముడి సంగతి చెబుతూంటే. నేనేదో అంటున్నానంటావేమిటి? వాడూ నేనూ అపూర్వ సహోదరులులా అచ్చుగుద్దినట్లు ఒకేలాగా ఉంటాము. సృష్టికర్త చేసిన ఆ పొరబాటుకు నేను బతికినంతకాలం ఇలా చింతించాలి కాబోలు. ఒక చోటా, రెండు చోట్లా? ప్రతిచోటా ఆ వెధవ అప్పులు చేసి మా కుటుంబ పేరు ప్రతిష్ఠలను బజారుకు ఈడ్చాడు....ఈవేళ ఉదయం ఒక చెప్పులకొట్టువద్ద నాకిలాగే అవమానం జరిగింది. ఇలా నే నెంతకాలం అఘోరించాలి. ఇక వాడు ఈ జన్మలో బాగుపడడా? ఛీ-ఛీ....వాడు నా తమ్ముడని చెప్పుకోడానికే సిగ్గువేస్తోందే!"

"అంటే—" అంటూ ఆ షైలరు నీళ్ళు నమిలాడు.

"మీ డబ్బు ఎక్కడికీ పోదులెండి. మా తమ్ముడు ఈపాటికి ఇంటికి వచ్చిఉంటాడు. ముందు ఆ ధడవ ముఖం వాచేలా చెడామడా నాలుగు చీవాట్లుపెట్టి, ముందు మీ బాకీ తీర్చమంటాను. నా కంఠంలో ప్రాణమున్నంత వరకు మీ డబ్బుగురించి బెంగెట్టుకోకండి."

"అయ్యో! క్షమించండి సార్.... మిమ్మల్నిచూసి మీరే మీ తమ్ముడనుకొని ఎంత అఘాయిత్యం చేయబోయాను" అన్నాడా షైలరు. అతను మరోక్షణంలోనే లెంపలువేసుకొని మనవాడి పాదాలముందు వాలిపోయేలా ఉన్నాడు.

"ఆఁ....ఎంతమాట! పొరబడడం మానవ సహజం. అలాంటి పొరబాట్లను సహృదయంతో పట్టించుకోకపోవడం నాలాంటి వివేకవంతుల ధర్మం. పాపం. వెళ్ళి యిక నీపని చూసుకో,'' అంటూ అప్పలరాజు హూంగాగా వెనుతిరిగి. బ్రతుకు జీవుడా - అని అక్కడ్నుంచి బయట పడ్డాడు.

అప్పు యిచ్చిన మనిషి కాస్త మెత్తని వాడయినా, లేక కాస్త తగ్గినా - అప్పలరాజుదే ఒక్కోసారిపైచేయి అవుతూంటుంది.

ఆమధ్య ఒక బొగ్గులకొట్టు అతను ''పెద్ద లార్డ్ లాగా నువ్వు మా కొట్టుకొచ్చి చింత బొగ్గుల మూట తీసుకెళ్ళి ఎన్ని నెలలయింది?' అంటూ గల్లాపెట్టె దగ్గర లేచి నిలుచుని గంతులేయసాగాడు.

''ఎన్ని నెలలో కావడమేమిటి? ఒక్క నెలేగా అవుతా? ఈలోగా నేను ఆ వెధవ డబ్బు చెల్లిస్తే పెద్దమనిషిని. లేకపోతే దగుల్బాజీనా? లేక అరువు యిచ్చావు గనుక నువ్వు పెద్దమనిషివి, పుచ్చుకున్నాను గనుక నేను బేవార్సునా? అంతేనా నువ్వనడం?" అంటూ అప్పలరాజు చేతులవద్ద షర్టును పైకెగదోసుకుంటూ. ఆ కొట్టతనిమీదికి వెళ్ళబోయాడు.

''అంటే, మీరనేదేమిటి' నేను మీకు అరువు యివ్వడం నా తప్పంటారా?" అన్నాడా కొట్టతను వెనుకంజ వేస్తూ.

"తప్పా - తప్పున్నరా? వ్యాపారికి ప్రపంచజ్ఞానమనేది ఉండాలి. ఊళ్ళో ఉన్న మనుషులగురించి తెలిసిఉండాలి. ఈ ఊళ్లో నా పేరు చెబితే ఎవ్వరూ అప్పు ఇవ్వరు కదా - నువ్వెందుకు ఇచ్చి నన్ను బేవార్సును చేశావ్? అది తప్పుకాదా? ఇప్పుడు రోడ్డుమధ్య నిలవేసి. నా పరువు తీయడానికి చూస్తావా? ఇదిగో - నీ కిదే చెప్పడం. నాకు వీలయినప్పుడే చెల్లిస్తాను. ఈలోగా నన్ను కోర్టుకు ఈడుస్తావో, పోలీసులకు పట్టిస్తావో - నీఫా బార్డర్నించి మిలిటరీని పిలిపిస్తావో—నీ చేతనయింది నువ్వుచెయ్యి; నా చేతనయింది నేను చేస్తా" అని మీసాలు దువ్వుకుంటూ అప్పలరాజు గిరుక్కున వెను తిరిగి నడక సాగించాడు.

ఊళ్ళో ఇంతమంది దగ్గర అప్పులు చేసిన అప్పలరాజు నాదగ్గరఎన్నడైనా అప్పు పుచ్చుకోలేదా-అన్న సందేహం మీకు కల్గవచ్చు. ఎప్పుడో ఒకసారి నా దగ్గర పది రూపాయలు పుచ్చుకున్నాడండి. అతగాడి గురించి అప్పుడు నా కంతగా తెలియదనుకోండి. ఇప్పటిదాకా అత నా పదిరూపాయలను వాపసు చేయలేదు; నేనూ అతన్ని ఇమ్మని అడగలేదు. ముష్టి పదిరూపాయలు-పోతేపోయింది. మళ్ళీ నన్ను అడగలేదు కదా?

ఒకరోజు ఉండబట్టలేక "అప్పలరాజూ, నువ్విలా అప్పులు చేయడానికి 'అంతం' అంటూ ఉందా-లేదా?" అన్నాను.

"అదేమన్నమాట? ఇది మావంశ పారంపర్యంగా వస్తూన్న ఆచారమాయె. మావంశ కీర్తికి అప్రతిష్ఠ తెమ్మంటావా?" అన్నాడు.

"అదేమిటయ్యోవ్?....

"అంతేమరి....మా పూర్వీకులు తరతరాలుగా అప్పులుచేయడంలో ఈప్రాంతాల ప్రసిద్ధిపొందారు. ఆ కీర్తిని నిలపడానికే నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను." అంటూ వెంటనే విచారంగా ముఖంపెట్టి. "మొన్ననే ఒక బుద్ధిలేని పనిచేశాను. ఒక చావబోయే ముసలిదానికి ఐదు రూపాయలిచ్చాను."

"ఎవరా ముసలామె, ఏమాకథ?"

"ఒకనర్సు. నన్ను మాఅమ్మ కన్నప్పుడు కాన్పుచేసిన మంత్రసాని అన్నమాట. అప్పుడా మిడ్ వైఫ్కు మానాన్న ఐదురూపాయలు ఇనాం ఇస్తానని చెప్పారట. ఆయన చచ్చారుకాని, ఆ అప్పుమాత్రం తీర్చలేదు. ఆ నర్సమ్మ ఇప్పుడు పండు ముసలిదయినా ఆ ఐదు రూపాయలను మాత్రం మరచి

పోలేదు. నన్ను దారిలో ఎదురైనా చూసి. నవ్వుడల్లా ఏడుస్తూ, నాకుమెటికలువిరుస్తూం టుంది. దాని గోడు చూడలేక మొన్నొక్క చోట ఐదురూపాయలు అప్పుచేసి దాని ముఖాన పారేశా. అది ఆ డబ్బు వసూలు చేసుకోవడం కోసమే ఇంతకాలం కొన ఊపిరితో ఉండి ఉండాలి. ఈపాటికి చచ్చి ఉంటుందేమో కూడాను. స్త్రీ హత్య దోష మొకటి నా మెడకు ఎక్కడ చుట్టుకుందో నని ఇప్పుడు భయంగా ఉంది."

నవ్వు ఆపుకోడానికి ప్రయత్నిస్తూ "నీకూ పాపపుణ్యభీతి ఉందన్నమాట? ఒరేయ్ మిత్రమా! ఇకనైనా నా మాటవిని, అప్పులు చేయడం మానెయ్యరా. అరువు పుచ్చుకునే టప్పుడు బాగానే ఉంటుంది కాని, అది తీర్చే టప్పుడే తలప్రాణం తోకకు వస్తూంటుం దిరా...." అని హితబోధ చేయబోయాను.

"నా కెందుకయ్యా ఆ దిగులు? నాకు అరువిచ్చినవాళ్ళకే ఆ భయమేదో ఉండాలి కాని - నాకేం? నాకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించేవాళ్ళ ఈ లోకంలో ఎవరైనా ఉన్నారాఅంటే ఆ అప్పులవాళ్ళే. నేను ఆ బాకీలు తీర్చేవరకు వాళ్ళలా నా శ్రేయస్సు కోరక తప్పదుకదా! ఇంతకీ ఆర్థిక శాస్త్రంలో ముఖ్యమైన అంశం ఏమిటయ్యా? మన రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వద్దనించి ఋణాలు పుచ్చుకుం టూంటే, కేంద్రప్రభుత్వం ఏ పరదేశం నించో అప్పు పుచ్చుకుంటోంది. ఆ పర దేశం ప్రపంచబాంకినించి ఋణం పుచ్చు కుంటోంది. ఇదంతా ఒక వలయంలాంటిది నాయనా! ప్రజాప్రభుత్వంలో ఒక ప్రజ నైన నేను అప్పులుచేయడంలో తప్పే ముంది భాయీ!" అని హేళనగా నవ్వుతూ అప్పులరాజు చివాలున గొడుగుతో తన ముఖాన్ని కప్పేసుకున్నాడు.

బరువుగా ఒక్క నిట్టూర్పు విడిచాను.

□□□

"ఒక వూళ్ళో ఇద్దరు జడ్జీలుండేవారట. ఒకానొక రోజు పెద్ద జడ్జీగారు బజారునుండి కారు నడుపుకుంటూ వస్తున్నారు. అదే సమయానికి చిన్న జడ్జీగారూ ఆ రోడ్డు వెంబడి కారుమీద సినిమాకు వెళుతున్నారు. ఇద్దరి కార్లూ ఢీకొన్నాయి.

మరుసటిరోజు ఉ. ప్రొ. ద్దున్నే జడ్జిలిద్దరూ వెళ్ళి జడ్జిగారి స్థానంలో కూర్చోగా చిన్న కోర్టుకువెళ్ళారట. ముందస్తుగా పెద్ద జడ్జి జడ్జి బోనులో నిలబడ్డారు.

ఓండ్రపెట్టిన వార్తేను కథ

వాకాటి పాండురంగరావ్



పెద్దజడ్జి: ఓ బోనులోని ముద్దాయీ! నువ్వు నిన్న సాయంకాలం 5-40 గంటలకు పార్క్‌రోడ్‌మీద నీ కారు యింకో పెద్ద మనిషి కారుకు గుద్దించావా, లేదా?

చిన్నజడ్జి: అవునండి.

పె. జ.: నేరం ఒప్పుకుంటున్నావా?

చి. జ.: ఒప్పుకుంటానండి.

పె. జ.: అయితే నీకు అయిదు రూపాయల జరిమానా వేశాను పో! ఇహనుంచి ఇలాటి పనులు చెయ్యకు.

సరే. ఆతర్వాత చిన్నాయన వెళ్ళి జడ్జి గారి స్థానాన్ని అలంకరించగా పెద్ద జడ్జి గారు బోను నలంకరించారు.

చి. జ.: ఏంవోయ్ .... గోపాల్రావ్! నిన్న సాయంకాలం 5 గంటల 40 నిముషాలకు ఇంకో చిన్న మనిషి కారుకు నీ కారుని గుద్దించావని ఒప్పుకుంటున్నావా?

పె. జ.: మరేనండి....

చి. జ.: ఇదిగో సుందర్రావ్! కోర్టులో అల్లాటివేమీ కుదరవు. స్పష్టంగా—"ఒప్పుకుంటున్నానండి!" అనాలి.

పె. జ.: మరే! ఒప్పుకుంటున్నానండి!

చి. జ.: ఒప్పుకుంటున్నావూ! హుం! దేశం ఏమయిపోతున్నదో బోధపడ్డంలేదు. ఈ కారు ప్రమాదాల గురించి వింటుంటే నాకు ఒళ్ళు రవ రవ మండిపోతూంది. ఇవాళ పొద్దున్నలేచి అప్పుడే ఈ కోర్టులో రెండు కారుల ప్రమాదాల కేసులూ.... హన్నా! ఈ ధోరణిగనక అదుపులోపెట్టకపోతే ఇంకేవన్నా వుందీ! ఇదిగో చూడు వెంకట్రావ్! నీకు 100 రూపాయల జరిమానా వేస్తున్నా. మళ్ళీ గనక వచ్చావో...."

—పైన చెప్పిన జోకు కథ చదివి పకపకా నవ్వసాగారు బలభద్రంగారు. ఆయన చేతిలోని పుస్తకం క్రింద పడిపోయింది. కళ్ళెంబడి నీళ్ళొచ్చాయి. కడుపుపట్టుకుని హమ్మయ్య అనుకున్నారు. కాస్త సర్దుకున్నారు. మళ్ళా ఇంతలో ఆ జోకు జోకంతా గుర్తుకొచ్చి పెళ్ళున నవ్వులో పడిపోయారు.

ఆ ప్రక్కగదిలో గీత చదువుకుంటున్న అన్నపూర్ణమ్మగారీ కోలాహలమంతా విని అదొచ్చింది.

"ఏవండోయ్!....అయ్యా! మిమ్మల్నే! పొద్దున్నే లేచి ఏవిటీ పక పకలు.... బాబిగాడు లేవడూ—" అందావిడ.

కనుబొమలు ముడిచారు బలభద్రం"....బాబిగాడా....ఎవడు వాడూ...."

"ఆ! సోద్యం లెద్దురూ....మనవడ్ని మరిచిపోయినట్టూ—"

"ఓహో బా....బి....గా....డా...." అని మళ్ళీ జోకుని తలుచుకుని నవ్వుతూ నవ్వుతూ — కడుపు నొక్కుకుంటూ.... "అమ్మయ్య....కేకులే!" అన్నారాయన ఆయాసంతో.

"కేకులా!!"

"కాదే బాబూ జోకులు, జోకులు!" అని వత్తి పలికారాయన.

"హయ్యోరామా! పొద్దున్న లేవగానే ఇదేం ధోరణండీ....వుండండి వస్తా....నొసట యింత విభూతి పెట్టనివ్వండీ—!" అని ఆమె లోపలికి వెళ్ళబోతుంటే నవ్వుతో నీరసం వచ్చిన బలభద్రం అరిచారు.... "అవి కేకులూ కావు. జోకులే జోకులు! ఆపుస్తకంలో....''

ముక్కుమీద వేలేసుకుంది అన్నపూర్ణమ్మ.

"ఈ అందానికి నలభైఏళ్ళా?'' అని ఆశ్చర్యపోయారు బలభద్రం.

"చూచింది చాల్లెండి! మీరు లేచి మేడమీదకెళితే ;వెంకటయ్య ఈగది చిమ్ముతాడు—'' అంది అన్నపూర్ణమ్మ.

ఆయన మేడమెట్లు యెక్కుతుండగా ఆమె అడిగింది! "రాత్రి ఏదో జడ్జిమెంటు రాయాలన్నారు....రాశారా....''

"ఆ!'' అని జోకుల పుస్తకంలో యింకోపేజీ తీసి చూస్తూ మెల్లెక్కసాగారు బలభద్రం.

మేడమీద ఈజీచేరులో మేనువాల్చారు....

● ● ●

....ఏతద్ బలభద్రంగారి ముందు కోర్టులో ఒకకేసు దాఖలయింది.

తనముందున్న ఆకేసుని జాగ్రత్తగా చదివారాయన. కళ్ళజోడు తీసి తుడిచి మళ్ళీ పెట్టుకున్నారు. ఇంకోసారి చదువుకున్నారు.

"శ్రీశ్రీశ్రీ సర్కారు వారికిన్నీ ''సామ్రాజ్యం'' అన్న గార్దభానికీ మధ్య గల తగాదా ఏమనగా—

ప్రణాళికాపురం గ్రామస్థుడూ, వృత్తిరీత్యా రజకుడూ అయిన అరువుబట్టల రాజరాజయ్య తన గార్దభం సామ్రాజ్యాన్ని — దుందుభి నామ సంవత్సరం ఆషాఢ బహుళ నవమీ శనివారంనాడు సంతకు తీసుకువెళ్ళినపుడు సదరు సామ్రాజ్యం తన రెండు వెనక కాళ్ళతోనూ, అరివరపు జోగయ్య పదేళ్ళ కుమారుడు బంగారయ్యని తన్నగా, సదరు



ఎప్పుడూ విఫలం కాకుండా వుంటానికి ఒకమార్గం: అసలు ప్రయత్నం చెయ్యకు.

దెబ్బల ఫలితంగా సదరు బంగారయ్య స్వర్గస్థుడయినాడు. ఇట్లు బాధ్యతలేకుండా బహిరంగస్థలంలో తనగార్దభాన్ని విడిచిపెట్టి, ఒక భావి భారతపౌరుడి మరణానికి కారకుడయిన రాజరాజయ్య ఫలానాకోడ్‌లో ఫలానా ఫలానా సెక్షన్లను అతిక్రమించాడు. కోర్టువారు ఇది గమనించవలెను."

— ఇదన్నమాట కథా సంగ్రహం అనుకున్నారు జడ్జిగారు. ఇంతలో ఆ ఇద్దరు జడ్జీల కథ గుర్తుకొచ్చింది. నవ్వురాబోతే - "ష్! ఇది కోర్టు!" అని దాన్ని మందలించారు. టేబిలుమీద చప్పుడుచేశారు.

కోర్టు నిశ్శబ్దమయింది.

జడ్జిగారు తల ఆడించారు. కేసు విచారణ మొదలయింది.

సర్కారువారి తరపున ప్రాసిక్యూటరు శ్రీ కుంభవర్షం పదార్లావుగారు కూలంకషంగా తమ కేసుని విడమరిచారు, కేక వేయాల్సినచోట గావుకేకలెట్టారు. టేబిల్‌పై కొట్టవలసినప్పుడు బద్దలుకొట్టినంతపనేశారు. ఆఖరికి తమ వాదాన్ని ముగిస్తూ ఇలా

అన్నారు— "కనుక యువరానర్....ఇట్లా అడ్డమైన గాడిదలన్నీ రోడ్డు మీద అడ్డదిడ్డంగా తిరుగుతుంటే శాంతి భద్రతలు ఏమయిపోతాయో ఆలోచించండి." అందుచేత అబాధ్యుడయిన శ్రీ అరువుబట్టల రాజరాజయ్యకు రెండు నాలుగుల - ఎనిమిది ఏళ్ళ—"

"అబాధ్యుడు అన్న పదం లేదోయ్ పద్రాలావ్!" అని మందలించారు జడ్జిగారు.

"ఎక్స్‌క్యూజ్ మి యువరానర్! బాధ్యతా రహితుడయిన శ్రీ అరువుబట్టల రాజయ్యకు ఎనిమిది సంవత్సరాల కారాగార శిక్ష విధించి. సామ్రాజ్యాన్ని పిల్లగాడిదల ధృవీకృత పాఠశాలకు పంపమని కోరుతున్నాను—"అని కూచున్నారు. పద్రాలావు.

కోర్టులో చప్పట్లు చెలరేగాయి.

శబ్దాన్ని అణిచి అడిగారు జడ్జి - "ఏం వోయ్, పదాలూ! ఇందాకా 'ధృవీకృత పాఠశాల' అన్నావూ - అంటే ఏమిటీ?"

"అంటే సర్టిఫైడ్ స్కూల్ అని అర్థం యువరానర్!"

"థాంక్యూ!"

ఆ తర్వాత, ముద్దాయి అరువుబట్టల రాజరాజయ్య బోనులోకొచ్చి నిల్చున్నాడు. తలపాగ సర్దుకున్నాడు.

తన కేసేదో తానే చూచుకుంటానన్నాడు అసలు ముందర తనపేరు ఏ. బి. ఆర్. రాజయ్య అనీ, సర్కారువారు ఫిర్యాదు పత్రికలో తన పొడిఅక్షరాల నిలా విచ్చల

వజ్రసంచికల్లో

నవ్వింది జాబిల్లి

కథ: రచయిత్రి

శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మ

విడిగా విప్పిపారేసి, తన గుట్టునంతా రట్టు చేయడం తన వ్యాపారానికే దెబ్బతీస్తుంది గనుక - తనకు శ్రీ జడ్జివారి ఇష్టంమేరకు నష్టపరిహారం ఇప్పించమని వేడుకున్నాడు.

ఇహ - ఆ దురదృష్ట దినాన తన సామ్రాజ్యం ఆవిధంగాఎందుకుచేసిందంటే-


"ఎందుకు సేసిందంటే దొరా, నే సెబుతా వినుకోండి....సొంతంగినుకోండి!.... మరి మరి గాడిదకు కాళ్ళెన్ని?....అహ.... కాళ్ళెన్నీ—అని?" అని రాజయ్య జడ్జిగారి వైపు మరియు కోర్టువైపు చూశాడు. సమాధానం ఏమీ రాలేదు. అంచేత ఈ గాఢమైన సాంకేతిక విషయాన్ని సోదాహరణంగా వివరించబూనినవాడయి—తన ఎడమచేతిని గాలిలో బోర్లించి...."ఇది గాడిదనుకోండి!" అని చూపించాడు. బోర్లించిన ఎడమ చేతి వేళ్ళని కుడిచేత్తో చూపిస్తూ-" ఇది గాడిదైతే దీని కిట్టాగు ముందరకాడ రెండూ యెనకాలరెండూ మొత్తవు నాల్గుంటాయి కాళ్ళు!...." అంటుండగా—

"ష్! అనవసరప్రసంగం! ముద్దాయి నేరాన్ని ఒప్పుకుంటున్నాడా, లేదా?" అన్నాడు జడ్జి.

"ఏలినోరు అట్టంటే ఎట్టగండి! నేరవు ఎట్టొప్పుకుంటా అని, అందుకనే గందండి యివరాల్సెప్పడం-"

"సంగ్రహంగా చెప్పాలి!—అంతే కాని...."

"సర్లెండి! సర్లెండి! గట్టయితే ఇనుకోండి.—ఓటి, మా సావ్‌రాజ్జెవ్‌శానా మంచిది. అట్టాంటిది ఆ బుడతోణ్ణి ఎందుకట్టా తన్నిందా? దాని కోపవొచ్చింది గనకా—దాని కోపమెందుకురావాలీ అంటరు



సారస్వతంలో సుఖాంతం: అరువిచ్చిన పుస్తకం తిరిగివచ్చుట.

మీరు ...ఎందుకొచ్చిందంటే, ఆ చిన్నోడు ఇనుపకమ్మితో సోవ్‌రాజ్జెన్నదే పనిగ పొడిసిందు గనక....ఆ ద్గదీ....తెలిసొచ్చిందా తవరికి? అట్టాంటప్పుడు తన్ను తాను రచ్చించుకోవడానికని తన్నింది సాంగ్‌రాజ్జెవ్ ....మన్ని గనక కమ్మిలెట్టి పొడిత్తే మనం నాలుగుతకవాఅంట—"

"ఇంతకూ ఆ గాడిద ఆత్మరక్షణకోసం తన్నిందటావు. అంతేనా?'' అని అడిగారు జడ్జి.

"అంతేగ్గదండీ! అదేగన్క ముందెన్కలు సూడక తన్నేదయితే నాకిన్ని పళ్ళుండేవిటండీ....!....అదట్టాగ్గుంచండి. దొరగారింకో అంశవు సూడాలె. ఈబూప్పె పంచంలరెంద్ర కాలమణుసులుండరు. సావ్‌రాజ్జెంలాటి నోర్లేని జీవాలంటే యిష్టమున్నోళ్ళు! గట్టా ఇష్టంలేనోళ్ళు....అంజేత యింధాక 'అడ్డగాడిది నిలుగాడిది' అని యాందేందో పలికెనో పెద్దమడిసి. ఆయన గన ఈరెండోరకం వాడా అని శంకగుందది....గన్క అహోటి గమనించుకోవాల ఏలినోరు—

"సరే సరే! ఆత్మరక్షణకోసం గాడిద తన్నిందయ్యా బావుంది. మరి యిందులో ఏ బాధ్యత లేదూ? అందుకు నిన్ను శిక్షించవద్దూ——"

అంతే! ప్రశాంతమయిన తటాకంలోకి రాయి విసిరినట్లయింది. అసలు రాజయ్య ధోరణే మారిపోయింది. 'అయ్య బాబోయ్ నాకు శిచ్చా!' అని కళ్ళ నీరెట్టుకున్నాడు. 'ఆ జెయిళ్ళలో వుండడం నాకు బొత్తిగా అలవాటు లేద్దొరా!.... మాయ్యావిడ్నిడిసి వుండలేన్దొరా...." అని భోరుమన్నాడు.

చివరకు, చాల ఆలోచించి జడ్జిగారు సామ్రాజ్యానికి రెండునెలల కారాగారశిక్ష విధించారు.

గాడిద ఎటూ పోతూంది గనక మరిందాక అడిగిన నష్టపరిహారవూ - అన్నాడు కన్నీళ్ళు తుడుచుకున్న రాజయ్య.

జడ్జిగారు ఉరిమిచూస్తే నోరు మూసుకున్నాడు.

కేసు ముగిసింది.

——పదకొండు రోజుల తర్వాత ద.మ. జిల్లా జైలువంటాయన శ్రీ మా రా వూ, ఆ జైలు పాకీవాడు నల్లయ్యా కలిసి తమ జీతాల్ని తక్షణం నెలకు ముప్పయి రూపాయల మేరకు హెచ్చించకపోతే పనిచెయ్యమని నోటీసిచ్చారు... ఆ గాడిద .... అబ్బబ్బ! అ దొచ్చినప్పటినుండి ఒకటే పని. ఒకటేపని - అని రాశాడు నల్లయ్య. దాని తిండ్లుమండా .. మనుషులయితే ఏదో ఇంత కాచిపోస్తే తాగుతారు....ఇదా.... బాబోయ్ నాచేతకాదు....అని గోలపెట్టాడు శీమారావు.

ఆ జాయింటు ప్రత్త్రాన్ని చూసిన ద. మ. జి. జైలువార్డెను తలనొప్పి ఎక్కువయింది.

ఆసరికే - జైలు జైలంతా ఛీ ఛీ కంపు! ఒకటే కంపు!! రాత్రంతా ప్రక్కగదిలో గాడిద ఓండ్రపెడుతుంటే నిద్ర ఎలాగ పోవడం - అని అజైలువాసులు అరవై ముగ్గురూ రాత్రింబగళ్లు అరవసాగారు. అక్కడితో మొదలయిన జైలువార్డెను తలనొప్పి నల్లయ్య శీమారావుల నోటీసుతో విజృంభించింది. అతనికి బుర్రలో వెయ్యి గాడిదలు గెంతినట్లయింది.

ఒకచేత్తో తలపట్టుకుని యింకోదాంతో 'మెమోరాండం' అనబడే మనవిపత్రం రాశాడు వార్డెను. పైకి పంపాడు."ఆ గాడిదో, నేనో....ఎవ్వరో ఒక్కరే వుండాలిక్కడ...." అంటూ ఘాటుగా రాశాడు.

వారం తర్వాత టెలిగ్రామువచ్చింది 'నీ నెంబరు....తారీకు....గల మెమో అయిదో కార్యదర్శిగారికెళ్ళింది. ఆర్డర్లు రావచ్చు. అందాకా మరి, నువ్వూ, గాడిదా (అదిలోపల, నువ్వు బయటా) అక్కడే వుండండి." అని వచ్చింది.

బావురుమన్నాడు వార్డెను. అరవైముగ్గురు జైలువాసులలో ముప్పైనలుగురు నిరాహారదీక్ష పూనారు. ఈలోగా ఓ విలేఖరి వచ్చి సామ్రాజ్యాన్ని ఫోటోతీసి పెద్దకథ రాశాడు. పరిస్థితి ముదిరిపోతున్నట్లనిపిస్తే, ఏమయితే అదే అయిందని ఎడాపెడా ఐక్యరాజ్య సమితికీ వాళ్ళకూ టెలిగ్రాములిచ్చాడు వార్డెను. టెలిఫోను పిలుపులు చేశాడు.

ఈ గాథంతా పేపర్లలో పేర్చేగిపోయింది.

ఉన్నట్లుండి—ఒక శనివారం మధ్యాహ్నం—పైనుంచి, బాలపైనుండి ఓకాగితం వచ్చింది.

"రెండునెలల శిక్షలో ఎటూ ఆరువారాలయిపోయింది గనుక, సత్ప్రవర్తన మేరకు సామ్రాజ్యాన్ని - తక్షణం విడుదల చేయవలసింది."

సంతోషంతో ఓండ్రపెట్టాడు వార్డెను!

....మేడమీద ఈజీచేరులో పడుకుని వున్న బలభద్రంగారు కళ్ళుమూసుకుని వున్నారు. జోకుల పుస్తకం క్రిందపడి వుంది.

పైకివచ్చిన అన్నపూర్ణమ్మ ఆయన్ను చూచి 'రాత్రి ఆ జడ్జిమెంటు రాయటానికని చాలసేపువరకు మేలుకున్నట్లున్నారు....' అనుకుంటూ పుస్తకాన్ని తీసి టేబిల్‌మీద పెట్టింది.

నిద్రలోనే పకాపకానవ్వారు బలభద్రం.

'ఇంకొక కేకేమో!' అనుకుంటూ మెట్లు దిగబోయింది అన్నపూర్ణమ్మ.... 'లేకపోతే జోరుకాబోలు' అని నవ్వుకుంది ఆవిడ. □□□

క్షౌరశాలలకు ప్రత్యేకం

JANUARY 1965

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
31					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30

స్నేహితులు

కొడవటిగంటి కుటుంబరావు

ఆత్మవంచనకు కూడా ఒక హద్దున్నది. ప్రకాశం ఒకంతట నిస్పృహ చెందేరకం కాకపోయినప్పటికి, తన జీవితం విరిగిన పాల వలుగా అయిపోయిందన్నది గుర్తించటం మొదలు పెట్టాడు. ఇక తను అపజయం అంగీకరించవచ్చు. కలలు కనటం మాని నిద్రలేవవచ్చు. తనకు నలభై నిండి నలభై ఒకటి జరుగుతున్నది. అయిదుగురు పిల్లలు. దాదాపు అందరూ రోగిష్టివాళ్లే. తన సంపాదన నెలకు నూటయాభై — పెద్దపిల్లకు ఈయేడు కాకపోతే పైయేడు, లేకపూతే ఆ పైయేడు, పెళ్ళిచేసి తీరాలి. లేకపోతే ఇల్లాలు నాగమ్మ ఉరి పోసేసుకుంటుంది. ప్రకాశం మెడకు దేవుడువేసిన ఉచ్చులను మధ్యా మధ్యా బిగించేపని నాగమ్మ తనపై వేసుకుని ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తున్నది.

"పదహారేళ్ళనుంచీ బడిపంతులు పని అఘోరిస్తున్నాను. బాకీలే తప్ప పావలా కాసు వెనకెయ్యలేదు. వచ్చే ఏడాది-రెండేళ్ళలోలక్ష్మి పెళ్ళిఖర్చులూ, కట్నాలూ, యిచ్చుకునే డబ్బుకూడ బెట్టగలనా? అసంభవం!" అని ప్రకాశం ఒకనాడు అన్నాడు. ఆమాట అనటంలో ద్రోహబుద్ధిగాని, అహంకారం గాని మరే యితరమైన అభ్యంతరకర విషయంగాని వుందని ప్రకాశం గర్భశత్రువు కూడా అనడు. అయినా నాగమ్మ ఆ మాటలు వింటూనే కొయ్యబారిపోయి, "అయితే యింతకూ మీ ఉద్దేశం ఏమనీ?" అని అడిగింది.

"ఉన్నమాట చెబుతుంటే ఉద్దేశాలడుగుతావేమిటి?" అన్నాడు ప్రకాశం.

"ఉన్నమాటో లేనిమాటో, ఊరికే చెబుతారేమిటి?" అన్నది నాగమ్మ, నేనంత వెర్రిదాన్నా అన్నట్టుగా.

"తొమ్మిది గంటలయిందంటావనుకో, నీ ఉద్దేశమేమిటని నేనడిగితే అందులో అర్థం ఏముంటుందీ?"

"ఎందుకుండదూ? మాచక్కగా వుంటుంది! వంట కాకపోతేనో, వేళమించిపోతేనో హైముగురించి అనుకుంటాం. అంతేగాని నిష్కారణంగా—"

"అది ఉద్దేశం కాదు."

"ప్రతిమాటకూ మీరు వేరే అర్థాలు తీస్తారు. నాకు తెలీదా ఏం? ఇంతకీ లక్ష్మి పెళ్ళికి యెగనాం పెట్టటానికేగా మీరు డబ్బు మాట యెత్తిందీ?" అని నాగమ్మ దీర్ఘాలు తీసింది.

"ఎగనాం పెట్టదలిస్తే డబ్బు లేదనకోవటం దేనికీ? ఉన్నా ఎగనాం పెట్టొచ్చునే! ఎగనాం పెట్టాలని లేకనేగదా—"

"డబ్బొక సాకు అంతే. అయ్యో పిల్ల పెళ్ళి వచ్చిపడుతుందే అన్న దిగులు మొదటినుంచీ ఉంటే ఈపాటికి కొంత వెనకెయ్యలేకపోయామా? పెళ్ళిఖర్చుల మాట యిప్పుడా ఆలోచించేది?"

నాగమ్మ పరాయిదానల్లే, తన ఆర్థిక పరిస్థితిపట్ల అణుమాత్రం సానుభూతి లేకుండా మాట్లాడటం యిది మొదటిసారికాదు. అనేక శతాబ్దాలుగా మగవాడు ఆడదాన్ని హీన ప్రాణిని చేసి, అడ్డమైన కట్టుబాట్లలోనూ వుంచి, దాదాపు ఏ హక్కులూ లేకుండా చేసినందుకు ఆడది తీసుకోగల ప్రతీకారచర్య ఒకటే ఉంది: మగవాడికి ప్రతిక్షణమూ వాడి బాధ్యతలు జ్ఞాపకం చెయ్యటమూ, వాడిమీద వీలయినంత బరువు వెయ్యటమూనూ. ఈ పని చేసే నేర్పు మధ్యతరగతి స్త్రీలలో బహుకొద్దిమందికే ఉంటుంది. వారికి ప్రతినిధి నాగమ్మ. ధనికవర్గానికిచెందిన మగాళ్ల పెళ్లాలు వేసే భారాన్ని సులువుగా మొయ్యగలరు. తమ స్త్రీలకు ఏ హక్కులూ లేవన్న సంగతి జ్ఞాపకం రాకుండా కూడా చెయ్యగలరు. పేద వాళ్ళలో స్త్రీలకు కొంత స్వేచ్ఛ ఉంది. వాళ్ళు తమ బరువు చాలావరకు తామే మోస్తారు: అవసరమైతే అప్పుడప్పుడూ మొగుడి బరువుకూడా మోస్తారు. ప్రకాశం లాంటి మధ్యతరగతి కుచేలుడికే భార్యల రంపపుకోత భరించే దుస్థితి ఏర్పడుతుంది.

ప్రకాశం యిన్నాళ్లూ ఆశాజీవిగానే బతకటానికి యత్నించాడు. ప్రత్యక్షంగా వున్న కష్టాలమీద గొంతెమ్మ కోరికల ముసుగులు కప్పాడు. లక్ష్మి పుట్టినాక ఉద్యోగం దొరికింది. లక్ష్మితో తన అదృష్టం తిరిగిందనుకున్నాడు — పదిమందితో అన్నాడు కూడాను. ఆరోజుల్లో నూరురూపాయల ఉద్యోగం విశేషంగా కనిపించింది. తానూ, భార్యా, ఒక చంటిపిల్లానూ, హాయిగాకాలం గడిచింది. జీతం పెరుగుతూ వచ్చింది. దానితోబాటు సంసారం పెరిగింది. వరసగా పిల్లలు పుట్టుకువచ్చారు. అది తన తప్పేనని ప్రకాశానికి తరవాతగాని తెలిసిరాలేదు. సంసారం పెరగటంతోబాటు వస్తువు ధరలన్నీ పెరిగాయి. అది ప్రకాశం తప్పు కాదు. ఖర్చులు పాపం లాగా రెండింతలూ, మూడింతలూ పెరగకుండా ఉంటే యింత పెద్ద సంసారాన్ని ప్రకాశం ఏదో విధంగా ఈదుకొచ్చి వుండును. పదిహేను రూపాయల బాడుగ యిచ్చి సుఖంగా గడిపిన ప్రకాశం ఈనాడు అరవై రూపాయల ఇంట్లో యిరకలేక సతమతమవుతున్నాడు.

అసహాయ స్థితిలో మనిషి తత్వంలోపడతాడు. ప్రకాశం తత్వంలో పడ్డాడు. దారిద్ర్యానికి చాలా ముఖ్యాన్నాయి. అందులో ఏముఖ్యు యెక్కువ బాధిస్తుంది? "పిల్లలు తిండిలేకుస్తున్నారు, ఇంట్లో పాత్రలన్నీ పగిలిపోయాయి. ఆ బాధకన్నా, నాభార్య తనచింకిపాత కుట్టుకోవటానికి సిగ్గుపడుతూ పొరుగావిణ్ణి సూది అడిగితే ఆవిడ ఈసడింపుగా లేదు పొమ్మనటం నన్ను హెచ్చుగా బాధిస్తున్నది." అని పూర్వకవికుచేలుడొకడు శ్లోకం చెప్పాడు. అదేవిధంగా ప్రకాశం దారిద్ర్యబాధను అనేక వైపుల నుంచి సహిస్తూ ఏవైపునుంచి తనకుహెచ్చు బాధ కలుగుతున్నదీ తేల్చుకోలేకపోయాడు.

"ఇప్పటికే ముగ్గురు పిల్లలు. మీ ఆవిడ మళ్ళీ కడుపుతో వుంది. ఈభాగం మీకు చాలదు. వేరే ఇల్లు చూసుకోండి." అని ఒకప్పుడు ప్రకాశం ఇంటి యజమాని అన్నాడు.

"ఏదో విధంగా సర్దుకుపోతాం. ఏం చేస్తాం మరి?" అన్నాడు ప్రకాశం, ఇంటాయనికి తనమీద జాలి అనుకుని.

"మీరు సర్దుకుపోతే మేం సర్దుకుపోలేం. ఇల్లు త్వరలో ఖాళీ చెయ్యండి." అన్నాడు ఇంటాయన కుండ పగలేసి.

ఇది ప్రకాశాన్ని బాధించింది.

పొరుగింటివాళ్ళు ఆడపిల్లలకు సంగీతం మేష్టార్ని పెట్టి సంగీతం చెప్పిస్తుంటే తాను ఆ పని చేయలేనందుకు బాధపడినదాకా నాగమ్మతల్లి వదల్లేదు.

పిల్లలకు తియ్యకుండా వుండే రోగాలకు రోజూ డాక్టరును పిలవలేని స్థితిలో ఉండటమూ బాధించింది ప్రకాశాన్ని. డాక్టరుకు ఫీజిచ్చి పిలిపించటంకన్న హెచ్చుఖర్చు వాళ్ళు రాసిచ్చే మందులు. మందులతో తీరదు. వాటి వెనక టానిక్కులువస్తాయి. దారిద్ర్యాన్ని ఒకవ్యాధిగా గుర్తించి దాని కెవరైనా చికిత్స చేస్తే ఎంతబాగుండును!

మగపిల్లలు డబ్బూ, ఆడపిల్లలుఖర్చూ- ఈ సంగతి ప్రకాశం నిజంగా అర్థంచేసుకోవటానికి చాలాకాలం పట్టింది. మొదటి సంతానం ఆడపిల్ల పుడితే అందరూ ఎందుకు దిగులు పడతారో అతనికి అర్థమయేదికాదు: మగపిల్లవాడి తండ్రి అనిపించుకోవటంకంటె ఆడపిల్లతండ్రి అనిపించుకోవటంలో ఏదో విశేషం ఉందనుకునేవాడు. కాని స్వానుభవంమీద లోకమనుకునేదే నిజమనీ, తనది భ్రమ అనీ అతనికి తెలిసివచ్చింది. లక్ష్మి మగపిల్లవాడైతే యింకో రెండేళ్ళలో ఓపాతిక రూపాయలు ఏదో విధంగా తేగలిగేవాడు. ఇంకో రెండేళ్ళకు లక్ష్మి తనకు చెయ్యగలిగిందేమిటంటే తనచేత మూడు నాలుగు వేలు - ఎక్కణ్ణుంచైనా రానీ! — ఖర్చు చేయించటం!

లక్ష్మి తరవాతనైనా మగపిల్లవాడైతే బాగుండేది. కాని రెండోదీ ఆడపిల్లేఅయింది. లక్ష్మి పెళ్ళినుంచి కోలుకునేలోపుగా దాని పెళ్ళివచ్చి పడుతుంది. ఇవే నిజమైన వ్యాధులు!

మూడోవాడు ముత్తేశ్వర్రావు. వాడింకా ఆరోస్టాండర్డు అఘోరిస్తున్నాడు. అర్భకుడూ, మందమతీనూ, జ్ఞాపకశక్తిలేదు. ఎంతకష్టపడినా హానిహానిగా ప్యాసుమార్కులొస్తాయి. బహుశా స్కూలుఫైనలు దగ్గిర మొండి పడతాడు. "వాడికి ట్యూషనుపెడితే మంచి మార్కులే వస్తాయి. వాడు తెలివి తక్కువవాడేమీకాడు." అని నాగమ్మ ప్రవచించింది.

"వాడి చదువుకు సహాయం చెయ్యటానికి నే నుంటినిగా?" అన్నాడు ప్రకాశం.

"మీరా? మీవల్ల ఏమవుతుంది?" అని నాగమ్మ తేల్చేసింది.

"ఎందుచేతా?" అన్నాడు ప్రకాశం.

"మీవల్ల అయేట్టుంటే యితర పిల్లలెవరూ చెప్పించుకోరేం?" అన్నది నాగమ్మ.

"ముత్తిగాడు" తండ్రిని సహాయంచెయ్యనివ్వడు! అసలు సంగతి అదీ. "ఏమిట్రా నువు చదివేది?" అంటూ ప్రకాశందగ్గిరికి వస్తే చాలు, వాడు పుస్తకాన్ని రొమ్ముల కదుముకుని, "ఏదోలే!" అంటాడు. లేకపోతే చదువు కట్టిపెట్టేస్తాడు.

ప్రకాశం ఆశావాదిగా భవిష్యత్తు బాగుంటుంది. ఏదో జరుగుతుంది. ఏమిటో అవుతుందని తనలో ఆశపడుతూ వచ్చాడు. ఆ ఆశకూడా అతని ఆర్థికపరిస్థితి లాగా కృశిస్తూ వస్తున్నది. అతనికి తన దారిద్ర్యం కన్న సినిమాలలో చూపే దారిద్ర్యం భయంకరంగా కనిపించేది. సినిమాలలో దారిద్ర్యం అనుభవించేవారి మధ్య ఆత్మీయత ఉంటుంది: ఒకరి దుస్థితిని

చూసి ఒకరు రెట్టింపు బాధపడతారు. అదీగాక ప్రపంచమంతా వారిపై కత్తికట్టినట్టు కనిపిస్తుంది. అందుచేత ప్రేక్షకుడి ప్రాణాలు అల్లాడిపోతాయి.

తన దారిద్ర్యానికి యీ లక్షణాలేవీలేవు. "అయ్యో, నాపెళ్ళాన్నీ, పిల్లల్నీ యీ దారిద్ర్య బాధనుంచి తప్పించలేకపోతినే!" అని ప్రకాశం ఎన్నడూ తన గుండెను చెరువుచేసుకోలేదు, తమకు సరిగా తిండికే చాలదన్న విషయం గుర్తించక నాగమ్మ ఎవరో కట్టుకున్న ఉప్పాడ జరీచీరెల్నీ, ఎవరో కొనుక్కున్న కొత్తరకం బంగారు గాజుల్నీ గురించి లొట్టలువేస్తూ చెబుతుంటే ప్రకాశానికిమండుకొచ్చేది. బరువుమోస్తున్న తనపట్ల నాగమ్మకుగాని, పిల్లలకుగాని, గాని ఏమీ సానుభూతిలేదు. వాళ్ళు చూసినదల్లా తన అప్రయోజకత్వమే!

ఇదొక విషయం. రెండోవిషయమేమిటంటే లోకం తనని క్రూరంగా చూసినట్టు కనిపించలేదు. ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడన్నా ఎరిగినవాళ్ళు ప్రకాశానికి సహాయపడుతూనే వున్నారు. అతనైనా మరీ గండకత్తెర వచ్చి పడితే తప్ప యెవరిదగ్గిరా చెయ్యి చాచడు.

మూడో విషయమేమంటే తాను నిరుద్యోగికాడు. ఉద్యోగం ఉన్నది. నూటయాభైరూపాయలు నెల కాగానే చేతికందుతాయి. ఉద్యోగం చేసుకుంటూ నెలకు అరవైరూపాయలు ఇంటిఅద్దెకింద కట్టేవాడు బిచ్చగాడెలా అవుతాడు? తొంభైరూపాయల మీద ఏడు జీవాలుబతకటం ఎలా? ఈ రెండు ప్రశ్నలకూ సమాధానం లేదు.

సినిమా దారిద్ర్యానికీ తన దారిద్ర్యానికీ ఏవిధమైన పోలికా లేకపోయినా దానిలాగే యిదికూడా యెప్పుడో ఒకప్పుడు అకస్మాత్తుగా సుఖాంతమవుతుందని ప్రకాశం ఆశిస్తూ వచ్చాడు.

ఈలోపల అప్పులు పెరిగి పోతున్నాయి. దుకాణంవాడు అరువివ్వననేశాడు—రెండు నెల్ల వెచ్చాల బాకీ దిగబడిపోయింది. బట్టల కొట్టువాడు సగమన్నా ఇయ్యమని ప్రాధేయపడుతున్నాడు. సాటి ఉపాధ్యాయుడు పార్వతీశం దగ్గిరచేసిన చేబదులు తీరనే లేదు. జీతం పుచ్చుకునేరోజు పార్వతీశం మొహం చూడటం కష్టంగా వుంది.

"మనకన్న దారిద్ర్యం అనుభవిస్తున్నవాళ్ళు - ఇంకా పెద్ద సంసారాలు కలవాళ్లూ, అసలు ఏ సంపాదన లేనివాళ్లూ -

---

● నలుగురు స్నేహితులు కూర్చుని పేకాట ఆడుతుండగా, ఒకడు ''ఇహ నే నింటికి పోవాలి'' అంటూ లేచాడు.

''కూచోవోయ్, వెడుదువుగానిలే'' అన్నాడు ఒక స్నేహితుడు.

''అదికాదు. మొన్నరాత్రి నిన్నపొద్దున ఇంటికెళ్ళాను. నిన్నరాత్రి ఇవ్వాళ పొద్దున వెళ్ళాను. ఇహ ఇవ్వాళరాత్రి కూడా రేపొద్దున వెడితే మా ఆవిడ పుట్టింటికి పోతానని వార్నింగిచ్చింది.''

ఎందరులేరు ?" అన్న ఆలోచననుంచి ఏ విధమైన తృప్తీ కలగటం మానేసింది ప్రకాశానికి. ఒకడి పంటిసలుపు మరొకడికి తెలీదు. ఎవడి దారిద్ర్యం వాడిదే. ఎవడి చావు వాడు చావాలిసిందే.

కమ్యూనిస్టు సత్యనారాయణ యీమాట కూడా అనుకోనివ్వడు. పంటిసలుపూ, చావూ వ్యక్తిగతమైనవేటగాని, దారిద్ర్యం సాంఘికమైనదట.

"అయితే నా దారిద్ర్యం అందరూ అనుభవించరేం ?" అన్నాడు ప్రకాశం.

సత్యనారాయణ ఏదో చెప్పుకుపోయాడు. చిట్టచివరకతను పంటిసలుపూ, చావూకూడా సాంఘికమైన వేనని తేల్చాడు సంఘం సరిగా ఉంటే యెవరూచావరా అని ప్రకాశం అడిగాడు. అకాల మరణాలుండవన్నాడు సత్యనారాయణ.

భగవాన్లు గ్రహచారమంటాడు. అతను ప్రకాశం చక్రం వేసి చూసి, "ఇంకో రెండేళ్ళు మీ పరిస్థితి యిట్లాగే వుంటుంది. ఆతరవాత చాలా సుఖంగా నడుస్తుంది," అన్నాడు; ఆమాట నమ్మబుద్ధయింది ప్రకాశానికి. ఆతనిలో ఉండే ఆశావాదానికి జోస్యం నచ్చినట్టుగా విప్లవవాదం నచ్చలేదు. సంఘం యావత్తూ మారితే తప్ప సిస్థితి మారదంటే యెట్లా మరీనూ! సంఘం మారకుండా ఎంతమంది పరిస్థితి మారటం లేదు ?

భగవాన్లు చెప్పిన గడువింకా నాలుగైదు నెలలుందనగా ప్రకాశానికి నిరాశపట్టుకుంది. దానికి కారణం ప్రకాశానికి జాతకాలలో నమ్మకం పోవటం కాదు — వారఫలాలు ఏవారమూ తనకు నిజం కాకపోయినా వాటిని అతను చూడటం మానలేదు: నలుగురు నాలుగు రకాల ఫలితాలు చెబితే వాటిలో తనకు అనుకూలంగా వుండే ఫలితాలమీదనే ఆశలన్నీ పెట్టుకుంటూ వచ్చాడుకూడా. అయితే యిప్పుడు ప్రకాశాన్ని నిరాశ ఆవరించటానికి కారణం - నిరాశాభయం! ఇంకో నాలుగైదు నెలల్లో తన పరిస్థితి బాగుపడకపోతే తాను ఆశించటానికి ఏ ఆధారమూ ఉండదు. ఈభయం ప్రకాశాన్ని పీడించ నారంభించింది.

2

వెంకటనారాయణకు శలవు మంజూరయింది. నెలరోజులు నిశ్చింతగా తిరగవచ్చు. కాని యెక్కడ తిరగాలన్న విషయం భార్యాభర్తలమధ్య వివాదం రేపెట్టింది.

"మా బంధువుల ఊళ్ళకు కాకుండా యింకెక్కడికైనా సరే," అన్నది సత్యవతమ్మ.

"మరీ దూరం కాకుండా వుంటే యెక్కడికైనా ఫరవాలేదు," అన్నాడు వెం.

"కాశో రామేశ్వరమో వెళ్ళితే నాలుక్కాలాలుపాటు చెప్పుకునేందుకుంటుంది" అన్నది స.

"అవా దగ్గిరచోట్లు ?" అన్నాడు వెం.

"దగ్గిరని నేనెప్పుడన్నానూ ?" అన్నది స.

"దూరం వెళితే డబ్బు చాలదు. రెండు మూడొందలకన్నా ఖర్చు పెట్టటం వొట్టి అవివేకం."

"అయితే మీవేపు బంధువుల ఊరేదన్నా చూడండి. వెళ్ళి నెల్లాళ్ళు తిష్ఠ వేద్దాం. తేలికలోపోతుంది."

"ఏబంధువులు మన్ని కూచోబెట్టిమేపుతారు ? హోటళ్ళలో ఉండేట్టయితే యెంత డబ్బూ చాలదు. అంచేత—"

సత్యవతమ్మ అధ్యక్షుడి అంత్యోపన్యాసం చెప్పేసింది :

"చూడదగిన చోట్లేమో దూరం. రైలు చార్జీలు జాస్తి. అయినవాళ్ళిళ్ళకు పోతే ఒకటి రెండురోజులు మించి ఉండటానికి లేదు. వాళ్ళుంచుకోరు. హోటళ్ళలో ఉండటం అన్నివిధాలా దండగ. చూడటానికేమీలేని ఊరెళ్ళి హోటలు తిండి తింటూ డబ్బు తగలేసుకోవటం కన్నా యింట్లో కూచోవటం మేలు. మీరెందుకు శలవు తీసుకున్నారో తెలీటం లేదు. మనం బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టటానికి నోచుకోలేదు. అసలు విషయం అదీ !"

"పోనీ నువ్వు చెప్పు." అన్నాడు వెం.

"అయ్యోబాబూ ! మిమ్మల్నేమీ అనలేదండీ. ఉన్న విషయమే చెబుతున్నా. హాయిగా ఏ కాశో, ఏ రామేశ్వరమో—"

"కాశీకి పోవటానికి మూడురోజులూ, రావటానికి మూడురోజులూ, అక్కడ మూడురోజులూ - మిగిలిన మూడువారాలు ఏం చేసేట్టు ? ఈ తొమ్మిది రోజులకుగానూ యెంతవుతుంది. నాలుగున్నర టిక్కెట్లు-జనతాయే అనుకో.—"

సత్యవతమ్మ కాస్త ఆలోచించి "ఇది పెళ్ళిళ్ళ కాలమే. నాలుగుచోట్ల నాలుగు పెళ్ళిళ్ళయినా బాగుణ్ణు !" అన్నది.

"నాలుగు పెళ్ళిళ్ళేం నాలుగువేల పెళ్ళిళ్ళవుతాయి. మనని పిలిచేవాళ్ళుండొద్దూ ? అయినాపెళ్ళిళ్లకూడా సినిమాలల్లే అయాయి. సినిమా అంతగా బాగుండదని అనుమానం వేస్తే పత్రికలవాళ్ళకి ఒకవారం నడిచాక చూపిస్తారుట. అట్లాగే పెళ్ళిళ్ళ ఖర్చు భరించలేనివాళ్ళు. లాంఛనంగా ఆహ్వానించేవాళ్ళకి పెళ్ళయిన మర్నాడందేట్టు శుభలేఖలు పోస్టు చేస్తారుట !" అంటూ వెం మాటల తడిక అల్లసాగాడు. అది అతని హాబీ.

"ఇప్పుడు మనంవున్న స్థితిలో శుభలేఖంటూ అందాలేగాని పెళ్ళయిన మూడో నాడన్నా వెళతాం గాని ఊరుకుంటామా ?" అన్నది స.

● ఒకడు పోలీసు స్టేషనుకివెళ్ళి "నిన్నరాత్రి మాయింట్లోపడ్డ దొంగని ఒకసారి చూడనిస్తారా ?" అని ఇన్‌స్పెక్టర్ని అడిగాడు,

"ఎందుకు" అని ఇన్‌స్పెక్టరు ప్రశ్నించాడు.

"ఏంలేదు, మా ఆవిడకి మెలకువ రాకుండా ఇంట్లో కెలా ప్రవేశించాడో అడుగుదామని."

"ఏం లాభం ? సినిమా ప్రెస్‌షో అయినాక తిరిగి వెళ్ళిపోయేకార్ల బారును చూడటానికి వెళ్ళినట్టుగా ఉంటుంది....ప్రెస్‌షో అంటే జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు పట్నంలో పెళ్ళి ఇన్విటేషన్లు నాటకాల కాంప్లిమెంటరీ టిక్కెట్లల్లే ఉంటున్నాయి తెలుసా ?"

"చాల్లే ఊరుకోండి. మీదంతా—"

"—ఇన్విటేషన్ వెంట రిసెప్షన్‌కు ఒక బుల్లికార్డూ, డిన్నరుకు యింకో బుల్లికార్డూ ఉంటుంది. డిన్నరు కార్డుమీద ఎడ్మిట్‌వన్ అనికూడా ఉంటుంది. కొందరికి ఉత్త ఇన్విటేషన్లే వెళతాయి. కొందరికి రిసెప్షన్ కార్డు కూడా ఉంటుంది. మరీ అదృష్టవంతులకు డిన్నరు కార్డుకూడా వుంటుంది. ఎడ్మిట్ వన్. ఆకార్డు చూపించందే భోజనాల చోటుకు రానివ్వరనుకుంటా !"

సత్యవతమ్మ నవ్వుతూనే. "ఇహ చాలించండి !" అని భర్తను ప్రోత్సహించింది.

"ఈ సిమిలారిటీ - అంటే పెళ్ళిళ్ళకీ సినిమాలకీ పోలిక - యెంతదాగా స్థిరపడిపోయిందంటే కొన్ని నాటకాల కాంప్లిమెంటరీ టిక్కెట్లు పెళ్ళి శుభలేఖల్లాగా ఉంటాయి ! శ్రీమతీ అండ్ శ్రీ వై. వెంకటనారాయణా ఇన్‌వైట్ యూ టు ఏ పబ్లిక్‌షో ఆఫ్ దేర్ మెయిడెన్ ప్రొడక్షన్—"

సత్యవతమ్మ ఆగమని భర్తకి సంజ్ఞచేసి, "వాసూ, వాసూ ! పోస్టు వచ్చినట్టుంది తీసుకోరా !" అని పెద్దకొడుక్కి కేక పెట్టింది.

"ఏమిటంటున్నానూ ?" అన్నాడు వెం.

"ఎక్కడికి పోవాలో తేల్చకుండా ఉండటానికి ఏమైనా అంటున్నారు."

"అన్‌డిస్క్రిమినేట్ ! మనం ఈశలవులు నెత్రోజులూ ఏవిధంగా దుర్వినియోగ పరచాలా అన్న సంగతి గురించి తప్ప నేను మరోవిషయమే ఆలోచించట్లేదు. వెధవ పోస్ట్‌మన్ వచ్చినా త్రెడ్‌బ్రేక్ చేసేశాడు!"

వాసు పోస్టు చంకను పెట్టుకుని ఒక శుభలేఖలాటిది చదువుతూ వచ్చాడు.

"ఏమిట్రా అదీ !" అన్నది సత్యవతమ్మ ఆత్రంగా.

"శుభలేఖ." అన్నాడు వా.

"అది తెలుస్తూనేవుంది. పెళ్ళా.వొడుగా. గృహప్రవేశమా ? ఎవరికి. యెప్పుడూ. ఏ వూర్నుంచీ ?" అన్నది స.

"మీకక్కర్లేదులేమ్మా ! నాకు-పర్సనల్-నా క్లాస్‌మేట్‌లే." అంటూ యింకా ఆ శుభలేఖనే చదువుతున్నాడు వా.

"ఏమిటదీ ?" అంటూ సత్యవతమ్మ కొడుకు చేతిలోవున్న శుభలేఖ వొడిసి లాక్కుని పైనా కిందా చూసింది. తెలిసిన పేరేమన్నా కనిపిస్తుందేమోనని.

"ఈ రిటైర్డు హెడ్మాస్టరెవరండీ ? పి. యల్. నరసింహంట !"

"నాకు తెలీదు. ఆయన పెళ్ళా ఏమిటీ?" అన్నాడు వెం.

"చాల్లెండి. వేళాకోళామంటే యింక ఆదేపనా ?"

"మా స్నేహితుడి తండ్రిలేమ్మా !" అంటూ వాసు తల్లి చేతిలోంచి శుభలేఖ లాక్కోబోయాడు. కాని అక్షణంలోనే వెంకటనారాయణ ఆపని చేసేశాడు, ఆయన శుభలేఖ పరిశీలించి. "ఓరి సీదుంపతెగా !" అన్నాడు.

"ఎవరిని దీవిస్తున్నారు ? పెళ్ళికొడుకునా ? తండ్రినా ?" అన్నది స.

"పెళ్ళికూతురు తండ్రిని ! వాడెవడో తెలుసా ? నా చిన్ననాటి స్నేహితుడు. పురుషోత్తంగాడు. పట్నంలో చేరి అక్కడ చేతులుమార్చి డబ్బు లక్షలు వొడుసుకున్నాడు. వాడి చేతులకి డబ్బు బంక ఉందని ఏడిపిస్తాం ! పెళ్ళి వాడింటో నే ఎగ్మోరులో....చూశావా. దొంగవెధవ ! వాడి శుభలేఖరానేలేదు. పెళ్ళికొడుకు తరపు శుభలేఖ వచ్చింది !"

"ఇది బాగానేవుంది. దూరం వెళ్ళినట్టుంటుంది. పెళ్ళి కలిసొస్తుంది. మనం మగపెళ్ళివారి తరపున వెళదాం !" అన్నది స.

"నాకొచ్చిందిశుభలేఖ. మిమ్మల్నందర్నీ యెవరు పిలిచారు. మీరురావటానికి వీల్లేదు" అన్నాడు వాసు.వాడికి ఇరవైఏళ్ళ. బీయస్సీ పరీక్షకు కూచున్నాడు. అన్నిట్లోనూ 60 కి పైన వస్తే ఫస్టు క్లాసులో ప్యాసవుతాడు, 35 కు తక్కువొస్తేతప్పుతాడు. అదీ పరిస్థితి.

కాని వాసు తన వయసునుబట్టి యిప్పుడిప్పుడు తన వ్యక్తిత్వాన్ని గట్టిగా నిలబెట్టుకుంటున్నాడు. ఎంతబెద్దా-బెదటం ప్రసక్తి లేదనే అనుకోండి ! — తల్లిగనక సత్యవతమ్మ తనకొడుకు వ్యక్తిత్వం ప్రదర్శించినప్పుడల్లా. "బౌరా పిడుగా !" అని లోపల అనుకుని, పైకి వాణ్ణి ఉడికించే మాటలని. వాడు ఉడుక్కుంటే చూసి ఆనందిస్తుంది.

"అదేమిట్రా ? నీకు ఆహ్వానం వస్తే అది మాకుకాదూ ? అందులో విత్ ఫామిలీ అండ్ ఫ్రెండ్స్ అని లేదూ ?" అని అడిగిందావిడ.

"ఇంకానయం ! విత్ మదర్, ఫాదర్, బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అని లేదా అని అడగలేదు ! చూడు కావల్సొస్తే. ఇది నా ఒక్కడికే !" అన్నాడు వాసు.

"ఇప్పుడు ఫామిలీ అండ్ ఫ్రెండ్స్ అని రాయటం మానేశారు. అట్లా రాశారో పెళ్ళివాళ్ళు దివాలా యెత్తి ఐపి పెట్టాలిసిందే !" అన్నాడు వెం.

"అదేమిటండీ చోద్యం ! ఇన్విటేషన్ అందుకున్నవాళ్ళు మాత్రమే వెళతారూ ?"

"సకుటుంబంగా మనం రావాలనుకుంటే వెంకట్నారాయణా అండ్ కో అనో, అండ్ ఫామిలీ అనో రాస్తారు. ఫ్రెండ్స్ ప్రసక్తి లేదు." అంటూ కల్పన చేశాడు వెం.

"లేకపోతే మానె. మనం వాసుతోబాటు ఈపెళ్ళికి తప్పక వెళదాం. పట్నంచూసినట్టూ అవుతుంది." అన్నది స.

"నావెంట మీరొద్దు. కావలిస్తే మీరు వేరేరండి. అంతే చూడమ్మా. మీరుంతా ఇట్లా నావెంటపడి వచ్చారంటే నన్నెవరూ పిలవరు, తరవాత మీయిష్టం. చెబుతున్నా." అన్నాడు వా.

వెంకటనారాయణ ఆలోచించటం మాని తన సుపుత్రుడు యీదేరే స్టయిలుగమనించసాగాడు.

● పెళ్ళయింతరవాత మొదటి ఏడాదిలో భర్తమాటలు భార్యవింటుంది. రెండో ఏడాదిలో భార్యమాటలు భర్తవింటాడు. మూడో ఏడాదిలో యిద్దరిమాటలూ పొరిగింటివాళ్లు వింటారు.

"అంత పెడసరం కూడదురోయ్. ఇప్పుడే మానుంచి వేర్లుపడిపోతున్నావే. రేపు పెళ్ళయితే నువు మాతో మాట్లాడతావా! అదివరకల్లా మాకు పిలుపొచ్చిన చోటికల్లా నిన్ను తీసుకుపోలేదూ? నెల్రోజుల సెలవు యెట్లా ఖర్చుచెయ్యాలా అని మథన పడుతుంటిమిగదా. ఒక్కసారి నీవెంట తీసుకుపోరా అంటే ససేమిరా అంటావా?" అంటూ సత్యవతమ్మ కొడుకుతో అడుకుంది.

వాసు సీరియస్‌గా మొహంపెట్టి, "నేనొకవేళ తీసుకుపోలేమాత్రం నాన్నకెంత నామర్దా! పెళ్ళికూతురు తండ్రి స్నేహితుడై వుండికూడా పిలవలేదు గామాలని అందరూ అనుకోరా?" అంటూ చంకలో వున్న పోస్టు తండ్రి చేతికిచ్చాడు.

వెంకటనారాయణ ఉత్తరాలన్నీ పైపైన చూస్తూ, "అఘోరించినట్టే వుంది. ఇదిగో పురుషోత్తంగాడి ఉత్తరం!" అంటూ మిగిలినవి పక్కన పెట్టి ఆ కవరు చించి ఉత్తరం తీసి పైకి చదివాడు.

"మై డియర్ వెంకట్, మా అమ్మాయి పెళ్ళి యింకా పదిరోజులుంది. ఇన్విటేషన్లు ఒకడజను పంపిస్తాను. మనపాతస్నేహితులకందరికీ ఇయ్యి. ఎవరెవరు యెక్కడుంటున్నదీ బొత్తిగా తెలియటంలేదు. ఏడాదికోసారన్నా ఎవరూ ఉత్తరం ముక్క రాసిన పాపానపోరు. (ఒకవేళ వాళ్లు రాసినా నేను జవాబురాయను. టైములేదు.) అందుచేతనేం చేస్తావంటే, ఇది మీయింట్లో పెళ్ళే అనుకుని సాధ్యమైనంతమంది పాతస్నేహితుల్ని మళ్ళేసుకురా. తా. కా. మన అవకాయగాడు (ఉరఫ్ ప్రకాశం) ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? వాణ్ణీ, వాడిమంత్రి సామంతాది బలగాన్నీ కొట్టుకురా. ఇప్పుడు కలుసుకోకపోతే పాతస్నేహితుల్ని మరి పదేళ్ళదాకా కలుసుకోవటం పడదు - ఉత్తమ పురుషః పురుషోత్తమః."

"అయిందిగద అబ్బాయిగారి పెళ్ళి! మేమూ పోతున్నాం ఇంతోటిపెళ్ళికి! మేమెక్కినరైల్లో యెక్కకు, తెలిసిందా?" అన్నది సత్యవతమ్మ కొడుకుతో మళ్ళీ అట ప్రారంభిస్తూ.

"నాయిష్టం! నాయిష్టమొచ్చిన రైల్లో యెక్కుతాను. రైలు మీదా?" అన్నాడు వాసు, అందర్నీ తన పూచీమీద తీసుకువెళ్ళే ప్రమాదం తప్పినందుకు సంతోషిస్తూ.

వెంకటనారాయణ అప్పుడే కూచుని ప్రకాశానికి ఉత్తరం రాశాడు.

తరవాత భార్యాభర్త లిద్దరూ కూచుని, పెళ్ళి దృష్ట్యా, ప్రయాణం దృష్ట్యా కొనవలసిన వస్తువుల జాబితా వేశారు. ఇద్దరూ వేశారనటం అతిశయోక్తి అవుతుంది; సత్యవతమ్మ వేసింది. అందులోంచి ఏ అయిటమన్నా తగ్గించటానికి వీలుందేమో చూడటానికి వెంకటనారాయణ వృథా శ్రమపడ్డాడు.

ఆనందమంతా ఖర్చు చెయ్యటంలోనే వుంది. డబ్బు నీళ్ళలాగా ఖర్చవుతుంది గనకనే పెళ్ళిళ్ళు సరదాగా ఉంటాయి. పెళ్ళిళ్ళు చేసేవారిమాట అటుంచి, పెళ్ళిళ్ళకు వెళ్ళే వాళ్ళుకూడా తమ తాహతునుబట్టి ఒక చిన్న పెళ్ళిచేసినంత పనీ చెయ్యాలి. సత్యవతమ్మ తనకు రెండు కొత్త చీరెలన్నా లేకుండా ఈపెళ్ళికి వెళ్ళటం అసాధ్యమని ఖచ్చితంగా చెప్పేసింది. తన మాటవిని భర్త కూడా మరో సూటూ, ఒక జతపంచెలూ, ఒకటి రెండు షర్టులూ చేర్చటం మంచిదని సలహా యిచ్చింది. తీరా చూస్తే ముగ్గురు పిల్లలకూ పెళ్ళికి పనికొచ్చే బట్టలు లేనట్టు తేలిపోయింది. పోతే, పెళ్ళికూతురికి ఘనమైన చీరె ఒకటి కొనాలిగదా: ఇతర ప్రెజెంట్లూ....లిస్టు పెరిగిపోయింది.

మూడోనాడు యిటునుంచి ఇన్విటేషన్లూ, అటునుంచి ప్రకాశం జవాబూ వచ్చాయి. పెళ్ళికి రావటమంటేనూ, మళ్ళీ పురుషోత్తాన్ని చూడటమంటేనూ తనకు ఉత్సాహంగానే ఉందిగాని చేతిలో దమ్మిడీకూడా లేదని ప్రకాశం రాశాడు.

వెంకటనారాయణ ముందూ వెనకా ఆలోచించకుండా, "నువ్వూ, మీవాళ్లూ యేదో తారీకల్లా యిక్కడికి వచ్చెయ్యండి. పదకొండుకు అందరికీ కలిసి టిక్కెట్లు బుక్ చేస్తాను. మీ టిక్కెట్లెన్నో రాయి," అని ఉత్తరం రాసి పడేశాడు.

3

లక్ష్మికి కొండెక్కినంత సంతోషంగా వుంది. ఆ పిల్ల దూరప్రయాణాలెన్నడూ చెయ్యలేదు. చిన్నప్రయాణాలైనా జన్మకు శివరాత్రి అన్నట్టుగా ఏ రెండు మూడేళ్ళకో గాని పడవు. ఇది దూరప్రయాణం. పైగా పట్నానికి. అందులోనూ పెళ్ళికి-మామూలు పెళ్ళికాదు. లక్షాధికారుల ఇంటపెళ్ళి.

మధ్యలో మజిలీ లక్ష్మి ఆనందాన్ని పెంచిందేగాని తగ్గించలేదు. ఈ పానకంలో పుడకల్లా ఏమిటంటే లక్ష్మితరవాత వాళ్ళు నలుగురూ బయలుదేరలేదు. వాళ్ళు ఏడిచారు. లక్ష్మి వాళ్ళమీద సానుభూతితో చాలా బాధపడింది. వాళ్ళ ఏడుపుకు లక్ష్మి కడుపు తరుక్కుపోయింది. వాళ్ళను బంధువులింటో ఉంచుతూ తన తల్లితండ్రీ ఆడిన అబద్ధాలూ అవీ యివీ తెస్తామని చేసిన తప్పుడు వాగ్దానాలూ చూసి లక్ష్మి చాలా అవమానం చెందింది. వాళ్ళను చూసి అవమానం చెందటం లక్ష్మికి కొత్తకాదు. డబ్బులేకపోవటం మనుషులచేత అల్పవిషయాలలో కూడా అక్రమంగా ప్రవర్తింపజేస్తుందని ఆ పిల్లకు తెలీదు. డబ్బులేకపోవటం చేత మంచి నగలూ, చీరెలూ కొనటానికుండదనీ ఆడపిల్లలకు మంచి మొగుళ్ళను తీసుకురావటం కష్టమనీ, అంతకంటె దుస్సహమైన కష్టాలేవీ ఉండవని ఆమె నమ్మకం.

● సెన్సార్ అధికారి చిత్రనిర్మాతతో :

"ఇదిగో చూడండి, ఒకచోట భార్యాభర్త కలిసి ఒకమంచంమీద పడుకున్నట్టు చూపించారే! ఆసీను తీసెయ్యండి."

నిర్మాత ; "అదేమిటిసార్! భార్యాభర్తలు రాత్రిళ్ళు యింకెక్కడ పడుకుంటారని మీ వుద్దేశం?"

ఎవరెవరు బయల్దేరాలన్న విషయం ప్రకాశానికీ, నాగమ్మకూ పెద్ద యుద్ధమయింది. వెళితే అందరూ వెళ్ళాలన్నది నాగమ్మ. అందరూ బయలుదేరేకన్న యెవరూ బయలుదేరకుండా ఉండటం తనకు పరువుగా ఉంటుందన్నాడు ప్రకాశం. అయితే అందరమూ మానేద్దామని నాగమ్మ బెట్టుచేసింది. మేము రావటంలేదని ప్రకాశం ఉత్తరం రాస్తుండగా నాగమ్మ రాజీబేరానికి వచ్చి ఆ ఉత్తరం చింపేయించింది.

ఉత్తరం చించిన మరుక్షణం అసలు యుద్ధం ఆరంభమయింది.

"అసలు మీకేమి అభ్యంతరం? డబ్బెవరో పెట్టుకున్నప్పుడు?" అని నాగమ్మ ఇరవైతొమ్మిదిసార్లడిగింది కొద్దికొద్దిమార్పు చేర్పులతో.

"ఇతరుల డబ్బు గనకనే కొంచెం ఒళ్ళు దగ్గిరపెట్టుకుని ఉండాలి. రేపు ఇంతకన్న పెద్ద అవసరం వస్తే ఆదుకునేవాళ్ళను పొదుగుకోసి పాలు తాగకూడదు. బంగారు గుడ్డుపెట్టే బాతుకథ వినలా?" అంటూ రకరకాలుగా ప్రకాశం మాట్లాడాడు.

ప్రకాశం రెండోసారి ఉత్తరం ప్రారంభించి తాము రావడంలేదని వెంకటనారాయణకు రాయటం మొదలుపెట్టినాక నాగమ్మ తన భర్త చేస్తున్నది అఘాయిత్యమని ఆరోపించింది. తాను అందరూ వెళ్ళితే బాగుంటుందనే అభిప్రాయం చెప్పినట్టూ, వెళ్ళితీరాలని శాసించనట్టూ. శాసించటానికి తానెవరన్నట్టూ చెప్పింది.

బయలుదేరి వెంకటనారాయణగారి ఊరొచ్చారు. రైల్లో యెక్కినది మొదలు లక్ష్మి పుడకలన్నిటినీ మనసులోనుంచి ఏరిపారేసి పానకాన్ని మాత్రమే మిగుల్చుకుంది.

వెంకటనారాయణ గారింటి వాతావరణం లక్ష్మికి ఆదర్శప్రాయంగా ఉందనిపించింది. తన తలిదండ్రులల్లే వెంకటనారాయణా సత్యవతమ్మా కీచులాడుకోరు. సత్యవతమ్మకూడా హాస్యంగా మాట్లాడుతుంది. తనతల్లికన్న ఆవిడ నిజం నిర్భయంగా మాట్లాడే మనిషిలాగా కనపడింది. లక్ష్మిబుద్ధికి అది చాలా మంచిలక్షణంగా కనబడింది. ఆవిడ బాగా చదువుతుందిట.

వాసుకూడా లక్ష్మికి కొత్తరకం అనుభవమే. తమ ఊళ్లో వాసు ఈడువాళ్ళు తనతో మాట్లాడరు. బంధువులూ, బాగాఎరిగినవాళ్లూ అయితే తప్ప. ఎవరూ చూడనప్పుడు దొంగచూపులు చూస్తారు. వాసులో ఈ లక్షణాలేవీ లేవు. చాలారోజులుగా యెరిగినట్టుగా పలకరించాడు. తనదగ్గిరికి కుర్చీ ఈడ్చుకుని దానిమీద కూర్చుని. "ఏం చదువుతున్నావు? నీకేం సినిమాలిష్టం? వారపత్రికల్లో ఏది ఇష్టం?" ఇట్లా కబుర్లలో పెట్టాడు. అతనితో మాట్లాడట ^కి లక్ష్మికి కొంచెమైనా పట్టివ్వలేదు. అ [illegible] తన స్నేహితులను గురించీ, వాళ్ళు వెళ్ళిన ఎక్స్‌కర్షన్లు గురించీ చెబుతుంటే లక్ష్మికి అంతా తెలిసినట్టే ఉంది.

"ఈ పెళ్ళికొడుకు నాక్లాస్‌మేట్ తెలుసా?" అన్నాడు వాసు గర్వంగా.

"నిజం?" అన్నది లక్ష్మి.

"మా నాన్నకు పెళ్ళికూతురువాళ్ళ శుభలేఖ రాకముందే నాకు పెళ్ళికొడుకువాళ్ళ శుభలేఖ వచ్చింది. చూపిస్తానుండు."



ఒక శుభలేఖేమిటి, వాసు లక్ష్మికి ఎన్నో ఫొటోలూ, పుస్తకాలూ, తాను క్యారమ్సలో గెల్చుకున్న కప్పూ — ఎన్నో చూపించాడు. వాసూ, అతని తమ్ముడూ కారమ్స్ సింగిల్స్ ఆడారు. లక్ష్మినాడమంటే తనకు చేతకాదన్నది. నేర్పుతానన్నాడు వాసు. లక్ష్మి ప్రయత్నించింది గాని అది అంత సులువుగావచ్చే ఆటగా కనిపించలేదు. వాసు తమ్ముడంత ఆట రావటానికైనా ఎన్నోఏళ్ళు పట్టేటట్టు కనిపించింది లక్ష్మికి.

నాగమ్మ వెంకటనారాయణగారింటఅడుగు పెట్టిన రెండుమూడు గంటలలోపల దాదాపు అన్నిరకాల మనోవికారాలకూ గురిఅయింది. రైలెక్కకముందే ఆవిడ తాము వెళ్ళబోయే చోట తనకు అవమానం తప్పక జరుగుతుందనుకున్నది. ఆవిడకు స్నేహితాలలో నమ్మకంలేదు. ఈ వెంకటనారాయణ తన మొగుడితో చిన్నప్పుడు కలిసి చదివి ఉండవచ్చు. కాని ఇప్పుడు వాళ్ళిద్దరిమధ్యా చాలా తేడా ఉంది. ఈ తేడా తాను కళ్లారా చూడకపోతానా అనుకుంది.

కాని తీరా చూస్తే ప్రకాశంకన్న వెంకటనారాయణే ఎక్కువ స్నేహభావం కనపరిచాడు. అది చూసి నాగమ్మ తనభర్త అటువంటి స్నేహానికి అర్హుడుకాదనీ, వెంకటనారాయణలో, మొగుడిలోనూ, తండ్రిలోనూ ఉండదగిన మంచిలక్షణాలన్నీ ఉన్నాయనీ, తన మొగుడివంటివాళ్ళు ఎక్కడోగాని ఉండరనీ అనుకున్నది.

సత్యవతమ్మను చూసి ఆవిడ వెకిలి మనిషని కాస్సేపూ, అతిశయంగల మనిషని కాస్సేపూ, ఆవిడ మాట్లాడేపద్ధతంతా తెచ్చిపెట్టుకున్నదని కాస్సేపూ అనుకున్నది. చివరకు ఆవిడ తనంత సంస్కారమూ, దూరదృష్టీ, విమర్శ గల మనిషికాదనీ, పైపై మెరుగులతో జీవిస్తున్నదనీ తేల్చుకున్నది.

వాసు లక్ష్మిని కూచోబెట్టి కబుర్లు చెబుతుంటే నాగమ్మ మనస్సులో మెరుపులు మెరిశాయి. వాసు లక్ష్మినిచూసి సమ్మోహితుడైనాడని నాగమ్మ రూఢి చేసుకుని, వాళ్ళిద్దరికీ పెళ్ళికావటానికి వాళ్ళనాన్నల స్నేహం ఏమన్నా ఉపకరిస్తుందా అని ఆలోచించసాగింది. మాట వరసగా అడిగినట్టుగా వాసును గురించి సత్యవతమ్మను అయిదారు ప్రశ్నలు వేసింది. సత్యవతమ్మ నవ్వుతూ సమాధానం చెప్పటం చూసికూడా, తన ఆలోచన ఆవిడ పసికట్టిందని నాగమ్మ గ్రహించలేదు.

వెంకటనారాయణ ఒంటరిగా తటస్థపడ్డప్పుడుసత్యవతమ్మ, "ఏవండోయ్-డేంజర్!" అన్నది.

"ఎట్నుంచి? ఎవరికి?" అన్నాడు వెం.

"కాబోయే వియ్యపరాలు! .... వాసును గురించి వాకబు చేస్తోంది!"

"ఆడపిల్లతల్లికామాత్రం వుండదా? వాసు తన పెళ్ళాన్ని తానే చూసుకుంటాడని అర్థమయ్యేట్టు చెయ్యలేకపోయావా?"

"ఇంకా ఆ స్టేషను రాలేదు .... వాసు ప్రస్తుతం ఆ పనిలోనే ఉన్నాడని అనుకుంటున్నట్టున్నది". అన్నది స.

నాగమ్మ అదే సమయంలో ప్రకాశాన్ని ఒంటరిగా చిక్కించుకుని, "ఈ వాసుకి మనలక్ష్మంటే చాలా ఇష్టమల్లేఉంది. ఈడూ జోడూగా ఉంటారు. మీ స్నేహితుణ్ణి కదిపి

చూడండి. కుదిరితే మంచి సంబంధం! ఎరగనివాళ్ళయితే అనుకోవటానిక్కూడా తాహతులేదు మనకు .... స్నేహాలు ఇటువంటప్పుడే పనికొచ్చేది...." అన్నది.

"చూద్దాంలే".

"చూసేదేమిటి? మీరుచూస్తూ కూచుంటే పుణ్యకాలం కాస్తా వెళ్ళిపోతుంది. రేపు ఆ పెళ్ళిలో ఎందరో ఈ కుర్రాడిమీద కన్నేస్తారు. మనం చూస్తూనే ఉంటాం. ఎవరో ఒకరు గద్ద తన్నుకుపోయినట్టు తన్నుకుపోతారు".

"మరీ బెస్తవాళ్ళ భాష మాట్లాడకు. వాసు చేపఅనీ, లక్ష్మి ఎరఅనీ, నేను గాలం వేసేవాణ్ణనీ అనుకుంటున్నావులాగుందే?" అన్నాడు ప్రకాశం చిరాగ్గా.

"అదేమో నాకు తెలీదు. ఇక్కడ లక్ష్మి ఒకత్తేగనక వాసు కళ్ళన్నీ దానిమీదే ఉన్నాయి. రేపక్కడ పెళ్ళిలో ఎర్రగా బుర్రగా, నైలాన్ వోణీ వేసుకుని, పౌడరు కొట్టుకుని నలుగురాడపిల్లలు కనిపించారంటే ఈ అబ్బాయి లక్ష్మికేసి చూస్తాడా?"

"అందుకని ఇప్పుడే వాడిమెడకు ఉచ్చు వేసి వెంకటనారాయణచేత పెళ్ళి దస్తావేజు రాయించి సాక్షి సంతకాలుకూడా చేయించమంటావా ఏమిటి? నావల్లకాదు. నేనిటువంటి వెధవపన్లు చెయ్యలేను గనకనే నాకింకా ఒకరో అరో స్నేహితులంటూ అఘోరించారు!"

నాగమ్మ నోరు నొక్కుకుని, "అరతకండీ! పిల్లకు సంబంధం చూడటం వెధవపనా? అవ్వ! ఎవరన్నా వింటే నవ్విపోతారు. స్నేహితుణ్ణే అడగలేకపోతే ఇంకా పైవాళ్ళనేమడుగుతారు? మీవల్ల ఏదీకాదని నాకు మొదణ్ణుంచీ తెలుసు." అన్నది.

"తెలిసిందానివి తెలిసినట్టుండక పనులు పురమాయిస్తావెందుకూ?"

"మీరు మొండికేసి కూచుంటే నా యేడుపేదో నే నేడుద్దామని!"

"నీ యేడుపేమిటో నాకైతే తెలీదుగాని, నీవు చాతావాతా కాకుండా ఏడ్చి అయేపని కూడా చెడగొట్టుకుంటావు. ముందే చెప్పా. తరువాత నీ యిష్టం."

వాసు పైకికనపడినంత అమాయకుడేమీ కాడు. అతను చిన్నతనంనుంచీ ఆడపిల్లలతో తిరగమరిగినవాడు. వాళ్ళను కంగారు పెట్టకుండా, తాను ఆత్రపడకుండా, తాపీగా వాళ్ళను ఆకర్షించుకోవటం అతనికి తెలుసు. అభ్యంతరకరమైన పనులేవీ చెయ్యకుండా, ఏదైనా చేసినా బాగుండునని ఆడపిల్లలకు అనిపించేదాకా తెచ్చేవాడు.

లక్ష్మిని చూడగానే వాసు మంచి ఆటవస్తువు – ఆట్టే గడుసుతనమూ, గొ్ర

● ఒకడు : "సాధారణంగా మాకంపెనీలో పెళ్ళయినవాళ్ళనే గుమాస్తాలుగా వేసుకుంటారు."

మరొకడు : "ఏం, ఎందుకని?"

మొదటివాడు : "పెళ్ళయిన వాళ్ళయితే ఎంత తిట్టినా అలవాటుకొద్దీ దులిపేసుకు పోతారు."

తనమూ లేనిది – దొరికిందని కనిపెట్టాడు. అతను లక్ష్మిని ఒంటరిగా చిక్కించుకొనటానికి ఏ ప్రయత్నమూ చెయ్యలేదు. వాళ్ళిద్దరూ ఉన్నచోటనల్లా వాసు తమ్ముడు పదమూడేళ్ళవాడు ఉంటూనే వచ్చాడు. లక్ష్మి ఈడు ఆడపిల్లలంతా ఆ కుర్రాడికి రంభలల్లే ఉండేవాళ్ళు. వాళ్ళ పక్కగదిలో ఉన్నా కూడా వాడికి ఆ మాట తలుచుకుని ఆనంద పారవశ్యం కలుగుతూండేది.

ప్రకాశమూ, నాగమ్మా ఘర్షణపడుతున్న సమయంలో వాళ్ళు ముగ్గురూ మేడమీదికి యెక్కుతున్నారు. వాసు తమ్ముడు గబగబా పైకివెళ్ళాడు. వాసు మధ్యలో ఆగి. "నీకూ నాకూ ఒక మెట్టెత్తువార," అన్నాడు లక్ష్మితో. అది రుజువు చెయ్యటానికి లక్ష్మిని ఒక మెట్టుపైన నిలబెట్టి. "అంతవారలేదా," అంటూ తన నెత్తినా, లక్ష్మి నెత్తినా చెయ్యి పెట్టి చూసుకున్నాడు.

ఈ ఎత్తులు చూసుకోవటం లక్ష్మి ప్రాణానికి చాలా రొమాంటిక్‌గా ఉంది.

"నువు పూసుకున్న సెంటేమిటి?" అన్నాడు వాసు.

"నేనేమీ పూసుకోలేదే?" అన్నది లక్ష్మి ఆశ్చర్యంగా.

"అబద్ధం....ఏదో ఎరిగిన సెంటే...." అంటూ వాసుముందు గాలివాసన చూసి తరవాత లక్ష్మిని భుజందగ్గిరా, మెడదగ్గిరా చెంపమీదా వాసన చూశాడు. "సెంటను కున్నాను సుమా, నీవొళ్ళే మంచివాసన!" అన్నాడు.

లక్ష్మి నరాలన్నీ జివ్వున లాగాయి.

పైనుంచి తమ్ముడిమాటలు వినిపించాయి. వాసు లక్ష్మివీపుమీద తట్టి, "పోదాం పద, గోపాలుగాడు అరుస్తున్నాడు." అన్నాడు.

లక్ష్మికి వాసు తమ్ముడి మీద మండిపోయింది. "వీడోడూ!" అనుకున్నది. తన శరీరభాగాలేవైతే వాసునుస్పృశించాయో అన్నీ బంగారమై పోయినట్టు లక్ష్మి భావించింది. తానుకూడా చొరవ చేసుకుని వాసును ఏదోవంకమీద తాకింది. అతన్ని తట్టి మాట్లాడింది. మేడమీద గోడలకు తగిలించిన ఫొటోలు చూసేటప్పుడు అతన్ని ఆనుకుని నిలబడింది. తన వెనకగా నిలబడిన లక్ష్మిని వాసు చాలాసార్లు మోచేత్తో నొక్కి మాట్లాడాడు.

నాగమ్మ తన కూతురు చాలాసేపు కనిపించక పోయేసరికి కొంప మునిగిపోయినట్టు, "లక్ష్మి ఏదీ? ఎక్కడాకనిపించదేం?" అన్నది ఏ ఒకర్నీ ఉద్దేశించకుండా.

"పిల్లలుపైన చేరినట్టున్నారు," అన్నది సత్యవతమ్మ. ఆవిడ వాసునూ, గోపాలునూ కేకలు పెడితే యిద్దరూ పలికారు.

"అమ్మ పిలుస్తున్నదెందుకురా?" అన్నాడు వాసు.

కనుక్కొస్తానంటూ వాసు తమ్ముడు శరవేగంతో కిందికి వెళ్ళాడు.

వాసు లక్ష్మికేసి తిరిగి, "మనం స్నేహితుల మౌనా కాదా!" అన్నాడు. లక్ష్మి ఔనన్నది. "అయితే మనమధ్య ఒక్క రహస్యం ఉండాలి. చెబితే దాస్తావా?" అన్నాడు. లక్ష్మి దాస్తానన్నదిగాని ఆమెకేదో భయం పుట్టుకొచ్చింది.

"ఎవరికీ చెప్పకూడదు! చెబితే చెడ్డ ఒట్టు! సరేనా?" అన్నాడు వాసు. సరేనన్నది లక్ష్మి.

"ఇదీ రహస్యం." అంటూ వాసు లక్ష్మిని తనకేసి లాక్కుని ముద్దుపెట్టుకోబోయాడు. లక్ష్మి మూతి గట్టిగా బిగించింది. వాసు లక్ష్మి అంకిళ్ళు నొక్కి మూతితెరిచి చాలాసేపు ముద్దు పెట్టుకున్నాడు. లక్ష్మి గుండెలు పగిలినంత పని అయింది.

4

పురుషోత్తంగారింటో పెళ్ళి హడావుడి చాలా జాస్తిగా ఉంది. లంకంత యిల్లున్నా కూడా వచ్చిన బంధువులకే చాలలేదు. కొందరు అతిథులను దూరాన ఉన్న ఒక స్కూలు భవనంలో విడిది చేయించాడు. ఇల్లుకన్న స్కూలే బాగున్నది. పెళ్ళివారింటికి రావటానికీ పోవటానికీ ఒక వాన్ ఏర్పాటు చేశారు.

పెళ్ళిళ్ళకు బయలుదేరేవాళ్ళు తాము మాత్రమే అతిథులైనట్టూ, ఆతిథ్యం ఇచ్చే వాళ్ళు తమను గురించే ఆలోచించేటట్టూ ఊహించుకుంటారు. నదులు అలాగే ఎంతో కీర్తినీ, ఖ్యాతినీ మోసుకుని సముద్రంకేసి పోతాయి. సముద్రంలో చేరగానే వాటి వ్యక్తిత్వం కాస్తా రూపుమాసిపోతుంది. గొప్పవాళ్ల ఇళ్ళలో పెళ్ళిళ్ళకు వెళ్ళినవారి సంగతీ అంతే.

పురుషోత్తం వచ్చినవాళ్ళను చూశాడు. పలకరించాడు-కాని మాట్లాడలేదు; మాట్లాడే అవకాశంలేదు ఆయనకుఏదో చెప్పటానికో, అడగటానికో అయిదారుగురు అనుక్షణమూ ఉంటూనే ఉన్నారు. వాళ్ళు కార్యకర్తలు. వాళ్ళతో మాట్లాడ్డంమాని అతిథులతో కబుర్లు చెబుతూ కూచుంటే పనులు ఆగిపోతాయి.

"ఏమోయ్ ఉత్తమ పురుషా?" అని వెంకటనారాయణ పలకరించగానే పురుషోత్తం నవ్వి, "ఓహో! వచ్చారా? ఇంకేవరు – ఇదుగో, బాలన్, వాన్‌లో వీళ్ళందరినీ స్కూలు బిల్డింగులో చేర్చి, వాళ్ళ స్నానాలూ, ఫలహారాలూ చూడు!" అన్నాడు.

విడిదిలో ఆడవాళ్ళంతా ఒకచోటా మగవాళ్ళంతా ఒకచోటా చేరారు.

"రామ రామ! ఈ ఆడవాళ్ళ గదికేసి పోవటానికి లేకుండా ఉంది. పెట్టెలన్నీ అక్కడ పెట్టుకున్నారు. ఏ క్షణాన్నైనా వెళ్ళి తొంగిచూడు, సెన్సారువాళ్ళు కత్తిరించి పారేసిన హాలీవుడ్ ఫిల్ము దృశ్యం

● ఒక పరధ్యానపు పరంధామయ్యగారు కారులో షికారు బయలుదేరారు. కొంతదూరం వెళ్ళేసరికి డ్రైవరు "అయ్యా పెట్రోలు అయిపోయిందండి, కారు ఇంకొక్క అడుగుకూడా ముందుకు పో''దన్నాడు.

''సరే ఏంచేస్తాం. వెనక్కుపోనియ్'' అన్నాడు పరంధామయ్యగారు.

— యు. ఎమ్. భాస్కరరావు.

కనిపిస్తుంది. ఎవరోఒకరు చీర విప్పుతూనో, చీర కట్టుతూనో ఉంటారు!" అన్నా డొక విట్.

"అసలిటువంటి పెళ్ళిళ్ళకు రానే కూడదు. చూడరాదూ, మనకు హోస్టు పురుషోత్తంగారుకాదు. ఎవరో దాలన్‌ట— వాడూ! మనం చెప్పుకునేదంతా వాడికి చెప్పుకోవాలి. వాడు కసిరినా పడాలి! ఇది పెళ్ళి విడిదైతే దీనికీ ధర్మసత్రానికీ తేడా ఏమిటి?" అన్నా డొక సినిక్.

"బాగాచెప్పావు. ఇంతదూరంపడిరావటం రైలుచార్జీలు దండగ. ఆ డబ్బు మనియార్డరుచేసి వధూవరులకు కట్నంకింద పంపినా ఫలంపాటు! రైళ్ళను పోషించటమేమిటి?" అన్నాడు మరొక సినిక్.

"రావలసిందేననుకో. నలుగురూ కలుసుకునేటందుకు వస్తాం. కాని అది లేకపోయినాక రావటం అనవసరం. మనం కుటుంబాలతోపడి వచ్చామా, రేపు మన ఆడవాళ్ళెవరన్నా వీధిలో కనబడితే పురుషోత్తంగారి భార్య గుర్తించలేదు. మన పిల్లలు కనిపిస్తే పురుషోత్తంగారు గుర్తించలేదు. దొడ్డి సంభావనకు వెళ్ళే వాళ్ళు చూడూ బ్రాహ్మలు, మనమూ అంతే. బసలో ఉండటం, వానలో వెళ్ళటం, మందలోపడి తినటం, పెళ్ళయాక వస్తామనికూడా చెప్పకుండా నెత్తిన గుడ్డవేసుకుపోవటమూనూ."

"అతిధులందరూ మనలాగే ఉంటారనుకునేరు. ఇందులో ఏక్లాసూ, బీ క్లాసూ, సీ క్లాసూ, డీ క్లాసూ ఉన్నాయి. ఏక్లాసూ వాళ్ళను పురుషోత్తంగారు స్వయంగా పరామర్శిస్తాడు. వాళ్ళ పిల్లా పీచూ, వీళ్ళపిల్లా పీచుతో కలిసిపోతుంది. ఏక్లాసు అతిధులకు ఇది చిన్నతరహా పెళ్ళల్లేనే ఉంటుంది. మన వంటి రిఫ్‌రాఫ్‌కీ ఇది పెద్దయింటి పెళ్ళి."

వీళ్ల సంభాషణలు వింటుంటే వెంకట నారాయణకు మండిపోయింది. వాళ్ళు పురుషోత్తానికి ఎంత దగ్గర స్నేహితులో ఎంత దూరపు బంధువులో ఆయన ఎరగడు. వాళ్ళ ధోరణి చూస్తే వాళ్ళెందుకు వచ్చినదీకూడా అయనకు అర్థంకాలేదు. బహుశా వీళ్ళు పురుషోత్తం గొప్పతనం చూసి, ఆ కీర్తి పంచుకుందామని వచ్చి వుంటారు.

అంతేగాని పురుషోత్తంమీది అభిమానంతో కాదు. తాను ఆతిధిననే భావం వెంకటనారాయణకు ఏకోశానాలేదు. ఈపెళ్ళి సమయంలో తన స్నేహితుడి ఆనందం పంచుకోవటానికి తాను వచ్చాడు గాని అతనికి అగ్నిపరీక్ష పెట్టటానికి కాదు.

ఈ మూకను వదిలి దూరంగా పోదామనే ఉద్దేశంతో వెంకటనారాయణ లేచి ప్రకాశంకేసి చూసి తల ఊపాడు. ప్రకాశం కూడాలేచాడు. ఇద్దరూ స్కూలుకాంపౌండు వాకిలిదాకా పెళ్ళి నడకలు నడుస్తూ వచ్చేసరికి, పట్టాభి ఎదురయ్యాడు.

"అరె, దుష్టచతుష్టయంలో నాలుగోవాడు! నువ్వెక్కణ్ణుంచి ఊడిపడ్డావురా, పట్టాభి? నీ ఎడ్రస్ తెలీక చాలా హైరాన పడితినే!" అన్నాడు వెంకటనారాయణ.

"నే నిప్పుడు ఇక్కడే ఉంటున్నా.... పెళ్ళివారింటికి పోతే మీరు వచ్చి ఈ విడిదిలో ఉన్నట్టు తెలిసింది. చాలా రోజులైంది గదా చూద్దామని వచ్చా." అన్నాడు పట్టాభి.

"కిందటిసారి నిన్నుగురించి విన్నప్పుడు చాలా చిక్కుల్లో ఉన్నావన్నారు. చిక్కులు

వదిలాయా?'' అని అడిగాడు వెంకట నారాయణ.

"ఆ. మీ అందరిచలవ! మా వాడు ఇంజనీరయాడు. ఉద్యోగంకూడా దొరికింది. వాణ్ణి ఇంజనీరింగు చదివించటం పెద్ద పీటయిందనుకో. వాడు కష్టపడి మంచి మార్కులు తెచ్చుకుని నేనుపడ్డ శ్రమ ఫలించేట్టు చేశాడు."

"ఇంకేం? మంచి కట్నం తీసుకుని వాడికి పెళ్ళి చేసెయ్యి - లేక ఆపని యిదివరకే చేశావా?''

"ఒరే, నాదగ్గిర డబ్బుమాట ఎత్తకు. దానికోసం నేను పడిన అగచాట్లు తలుచుకుంటే జన్మ జన్మలకూ ఆ పాపిష్టి డబ్బుమాట తలవగూడదనిపిస్తున్నది. కుక్క జన్మో, పిల్లి జన్మో యెత్తించమని దేవుణ్ణి వేడుకుంటున్నాను. మావాడికి పెళ్ళి యింకా కాలేదు. ఏ దిక్కులేని పిల్లనో చేసుకోరా అని సలహా యిస్తున్నాను....చాలా మంది అడిగారు, పురుషోత్తం నీకు చిన్ననాటి స్నేహితుడ్డగదా, కూతుర్ని మీవాడికిచ్చి చెయ్యలేకపోయాడా అని. అర్థంలేనిప్రశ్న. తెలియకనో, కొక్కిరింపుగానో జనం అటువంటి ప్రశ్నలు వేస్తారు" అన్నాడు పట్టాభి.

"చాలా రోజులైంది. మన అడంగులను కూడా చూద్దువుగాని రా!" అంటూ వెంకట నారాయణ పట్టాభిని లోపలికి తీసుకొచ్చాడు.

పట్టాభి ప్రకాశంప్రక్కకు వచ్చి, "ఒరే ప్రకాశం, ఒక్క విషయం నీకు సంతోషంగా చెప్పనా?" అన్నాడు ఏదో తలుచుకుని నవ్వుతూ.

"ఏమిటది?'' అన్నాడు ప్రకాశం.

"మావాడు ఇంజనీరు కావటానికి నువ్వే కారణం!'' అన్నాడు పట్టాభి.

ప్రకాశం బిత్తరపోయి, "అదేమిట్రా?" అన్నాడు.

"వాడయిదేళ్ళవాడో ఏమో అయిఉండగా బెజవాళ్ళో మాయింటికొచ్చావు. జ్ఞాపకముందీ?"

"ఆ".

"వాడు కర్రలూ, మేకులూ తెచ్చి ఏవేవో చెయ్యటానికి ప్రయత్నించటం చూసి, 'వీడో చిన్న ఇంజనీర్లా ఉన్నాడేంరా!' అన్నావు గుర్తుందా?"

ప్రకాశం ఆలోచించి, "నాకేమీ జ్ఞాపకం రావటంలేదే." అన్నాడు.

"అన్నావులే! ఆ మాట వాడిమనసులో సన్నని మర్రి విత్తనంమల్లే నాటుకుని మహా

● ఓసారి ఓపత్రిక కథలపోటీ నిర్వహించింది. "జ్యోతి''వాళ్ళన్నట్టుగానే చాలమంది పాఠకులు రెండో బహుమతి పొందిన కథ మొదటి బహుమతికి అర్హమయిందీ'' అని రాశార్ట, అందుకు ఆ పత్రిక ఎడిటర్ యిచ్చిన సమాధానం —

"మొట్టమొదట ఈరెండో బహుమతి కథకే మొదటి బహుమతి యివ్వాలనుకున్నాము. కాని పాఠకుల ఉద్దేశంలో రెండోబహుమతి కథ మొదటి బహుమతికి అర్హమయిందిగా వుంటుందని మొదటి రెండో బహుమతి యివ్వాలని నిర్ణయించిన కథకి మొదటి బహుమతి యిచ్చి, మొదటి బహుమతి యివ్వాలనుకున్న కథకి రెండోబహుమతి యిచ్చాము. కాని, . ."

— బీ యస్ ల్పీ

వృథమయిందనుకో! ఈ సంగతైనా వాడు ఎప్పుడన్నాడో తెలుసా? ఇంజనీరింగుసీటు వచ్చినాక అన్నాడు."

"ఆఁ, అదంతా వాడి భ్రమ!" అన్నాడు ప్రకాశం. కాని లోలోపల అతనికి పట్టాభి కొడుకు సెంటిమెంటు చూచి ఆశ్చర్యం వేసింది. ఆనందంకూడా కలిగింది.

"ఇది నా కూతురు లక్ష్మి. మిగిలిన పిల్లల్ని తీసుకురాలేదు. ఇంకా నలుగురున్నారు — కుచేలసంతానం." అన్నాడు ప్రకాశం

"నీ పిల్లలేర్రా?" అన్నాడు పట్టాభి వెంకటనారాయణతో.

"అదుగో ఈ అరటికెట్టు నా కూతురే. మగపిల్లలిద్దరూ పెళ్ళివారిల్లు పట్టుకువేళ్లాడుతున్నారు. రాత్రి ముహూర్తమయిందాకా రారుట."

"ఏమండీ, జ్ఞాపకం ఉన్నానా? నమస్కారం." అన్నది సత్యవతమ్మ పట్టాభితో.

"అయ్యో, జ్ఞాపకం లేకపోవటమేమిటీ? కాపరానికొచ్చిన కొత్తలో మా ఆవిడ సగం మాటలు మీదగ్గరేగా నేర్చుకుందీ?" అన్నాడు పట్టాభి.

సత్యవతమ్మ ఆడంగి కబుర్లేవో కాసిని చెప్పి ఏదో వంకన జారుకుంది.

ప్రకాశం మొహంలో ఆత్మవిశ్వాసం లేకపోవటమూ, నాగమ్మ మొహం అప్పుడే ఎవరిచేతనో తిట్లు తిన్నట్టుండటమూ, ఎంతో ఉత్సాహంగా ఉండవలసిన లక్ష్మికూడా నీరసంగా కనిపించటమూ, చిన్నపిల్లల్నికూడా ప్రకాశం ఇంటిదగ్గిర వదిలేసి రావటమూ చూసి పట్టాభి ప్రకాశం ఆర్థికపరిస్థితిని అర్థం చేసుకున్నాడు. వెంకటనారాయణ అతని అంచనాను బలపరిచాడు.

"ఏడుగురు కాత్తీలు. ఏనూటయాభయ్యో వస్తుందిట. నన్నడిగితే ఒంటిపూట తినటానికి చాలదు. పై సంపాదన ఉన్నట్టు లేదు. మనిషి చిత్తుగా ఓడిపోయినవాడల్లే కనిపిస్తాడు. అట్లాగే మాట్లాడుతాడు కూడా! నిన్ను చూస్తే నువు పోరాడి గెలిచినవాడల్లే కనిపిస్తావు. మీ ఇద్దరిలోనూ చాలా తేడా ఉంది." అన్నాడు వెంకటనారాయణ.

"నేను గెలుపులైనుకు వెంట్రుకవాసి ఇవతలపడ్డాను, వాడు అవతల పడుంటాడు. ఒరే, దారిద్ర్యంతో పోరాటం చూశావూ, మహాభయంకరమైనది. నన్నడుగు చెబుతాను. వెనుక మన సైన్సు టీచరు చెప్పేవాడు జ్ఞాపకముందా - మంచు నీటిలో తేలుతుంటే నీటికీ మంచుకూ యెంతో తేడా కనిపిస్తుందిగాని రెంటి టెంపరేచరూ ఇంచుమించు ఒకటేనని? అంతే నాకూ ప్రకాశానికీ తేడా అయి ఉంటుంది. చాలా విషయాల్లో ప్రకాశం నాకన్న తెలివిగలవాడు." అన్నాడు పట్టాభి.

కొంత తేడా పెళ్ళాలను బట్టి కూడా ఉంటుందని అందామనుకున్నాడు వెంకటనారాయణ - కాని మానేశాడు. నాగమ్మ అతనికి నచ్చలేదు. ఆమె కరటకదమనకుల తరగతికి చెందినదని వెంకటనారాయణ అనుమానం. కరటకదమనకులు నయం; ఒకళ్ళ కుళ్ళు ఆలోచనలు రెండోవాళ్ళకు చెప్పుకుంటారు - నాగమ్మకుళ్ళు నాగమ్మకే తెలియాలి.

నాగమ్మ గురించి తనకు ఏర్పడ్డ ఈఅభిప్రాయాన్ని సత్యవతి కూడా బలపరిచింది.

వాసుకు ప్రకాశం కూతుర్ని చేసుకోవటం గురించి తనకు ఏవిధమైన అభ్యంతరమూ ఉండనవసరంలేదు సరేకదా, ఉత్సాహం కూడా ఉండదగిన సంగతి అయినప్పటికీ నాగమ్మ తన కొడుకుపైన ఒక కన్నువేసిందనగానే వెంకటనారాయణకు ఆ ఆలోచనే అసహ్యమనిపించింది. ఆ అసహ్యాన్ని చూసుకుని అతను భార్యతో, "ప్రకాశం తన పిల్లనిస్తానని ఒకవేళ అంటే?" అన్నాడు.

సత్యవతమ్మ కాస్సేపు ఆలోచించి, "కట్నాలూ కానుకలూ రావనుకోండీ! వాటిని తగలేసిరి, పిల్ల ఇంకొంచెం అందంగా ఉంటే ఒప్పుకున్నా ఒప్పుకోవచ్చు....తీరా చేసుకుంటే, ఏం చూసి చేసుకున్నారమ్మా అని ఎవరన్నా అన్నప్పుడు తలొంచుకోవాలి! అంతేగా?" అన్నది.

ఆవిడ అట్లా అన్నమీదట ప్రకాశం ఈ ప్రస్తావన తీసుకురాకుండా ఉంటేనే మేలనుకున్నాడు వెంకటనారాయణ. ఏదో ఒక వొంకు వొంకలేకకాదు. "ఏమో. నాయనా! వాడిష్టం. వాడొప్పుకుంటే మా ఎవరి అభ్యంతరమూ ఉండబోదు. మనతరంవాళ్ళకే పెద్దలు మన యిష్టంమీద పెళ్ళిళ్ళు చేసినప్పుడు వాసు పూర్తిగా ఇష్టపడిన సంబంధమే చెయ్యటం విధాయకంగదా?" అనవచ్చు .... కాని స్నేహితుడితో—చిన్ననాటి స్నేహితుడితో-కోపంగా మాట్లాడడమంటే వెంకటనారాయణకు కాస్త బాధఅనిపించింది.

కాకపోయినా ప్రకాశం దారిద్ర్యం వెంకటనారాయణకు అడుగడుగునా పరీక్షే అనిపించింది. "నీవు నిజంగా స్నేహితుడివే అయితే నన్ను ద్వేషించకుండా ఉండు చూస్తాం!" అని ప్రకాశం దారిద్ర్యం సవాలు చేస్తున్నది! ప్రకాశాన్ని చూసినప్పుడల్లా మంచానపడినవాళ్ళూ, అవిటివాళ్ళూ వ్యాజ్యాల్లో ఓడిపోయినవాళ్ళూ జ్ఞాపకం వస్తున్నారు. నూటయాభైరూపాయలమీద ఏడుగురు బతకటం—ఘోరం! ఘోరం! అంతకన్న ఎక్కువమందికూడా బతుకుతూఉండి ఉండవచ్చు. కాని వాళ్ళను వెంకటనారాయణ ఎరగడు! వాళ్ళు అతనితో కోతికొమ్మంచి ఆడినవాళ్ళు కారు. ప్రకాశం అటువంటివాడుకాదే .... పోనీ, పాడుపీడ!

లక్ష్మిపరిస్థితి భయంకరంగాఉంది. ఆమెను ఎవరూగమనించకపోవటం చాలామేలయింది. ఆమెకు ఈ విడిదీ, నలుగురూఅదేమాటలూ, ఈపెళ్ళీ, అడావుడీ అంతా కలలాగావుంది - వాసు ఒక్కడే మాయని సత్యం అనిపించాడు. కాని వాసు ఏడీ? అతను సినిమా తారల్లాటి ఆడపిల్లలమధ్య హాయిగా కాలం గడుపుతున్నట్టు ఊహించుకున్నది. ఆమెకు తనమీదా, ప్రపంచంమీదా తీవ్రమైన రోత పుట్టింది. మధ్యాన్నం అన్నం సరిగా తిన

రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పిపంపగోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతో పాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని, అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.

లేదు. సాయంకాలం ఆడవాళ్లంతా సబ్బు వేసి మొహాలురుద్దుకుని, గరగరలాడే చీరలు కట్టుకుని అద్దాలలో చూసుకుంటూ నగలూ అవీ సర్దుకుంటుంటే. "వీళ్లందరికీ యేమిటీ తాపత్రయం'' అని ఒకచెంప అనుకున్నది. ఇంకోవంక ఆమెమనసు వీళ్ళందరికన్నా మంచి బట్టలు కట్టి, మంచి నగలుపెట్టుకుని, దేవకన్యలాగా ముస్తాబు కావాలనికూడా కోరింది. అయితే ఈ కోరిక గొంతెమ్మ కోరిక. అందులో నిజం ఏమీలేదు.

"ముహూర్తానికి వేళ అవుతున్నది. బండీ వచ్చింది. ముందు ఆడవాళ్ళంతా యెక్కి వెళ్లండి,'' అని యెవరో కేక పెట్టారు.

అందరితోబాటు లక్ష్మికూడా కదిలింది. బయలుదేరుతున్నవారిలో తనకన్న దిష్టి పిడతల్లే వున్నవాళ్ళెవరన్నావున్నారా .అని చూసి, ఎవరూ లేరని నిశ్చయించుకున్నది.

5

పెళ్లిముహూర్తం. ముహూర్తానికిదాదాపు నాలుగువందలమంది వచ్చారు.

"జనం బాగా వచ్చారు,'' అన్నా దొకాయన అందరినీ కలయజూసి.

"రాకేం. ఇరవైవేల రూపాయల బట్టలు వేసుకో, ఓ రెండులక్షల రూపాయలకార్లు, ఓ వందరూపాయల సెంటూ, ఓ యాభై రూపాయల పూలూ —'' అన్నాడు పక్కనున్న విట్.

''పెళ్ళికొడుకు ఘోరం! పురుషోత్తం గారు అల్లుణ్ణి ఎన్నుకుంది అందం చూసి మటుకు కాదు."

"పెళ్ళికూతురూ అంతంత మాత్రమే''.

"పెళ్ళికొడుకు పక్కన రంభల్లేఉంది!"

"ఏమైనా సినిమాపెళ్లిళ్లచూసి మామూలు పెళ్ళిళ్ళు చూస్తే రక్తిగా ఉండటంలా."

"ఆమాటన్నావు, బాగుంది. ఓపనిచేస్తే సరిపోతుంది. పెళ్ళి జరిగినప్పుడల్లా సినిమా స్టార్లను మేకప్‌చేసి తెచ్చి కూచోబెట్టటమూ, అసలు వధూవరులపేర్లు ఆకాస్పేపు వాళ్ళకి పెట్టటమూ, వాళ్ళకో కాల్‌షీట్ డబ్బిచ్చి పంపించటమూనూ!"

"అప్పుడు పెళ్ళికి ఆహ్వానాలు కూడా అవసరంలేదు. టిక్కెట్లు పెట్టితే జనం యెగబడతారు. పెళ్ళిఖర్చులుపోగా ఋణమో పణమో మిగలనుకూడా మిగలవచ్చు."

పెళ్ళి పందిరి వాతావరణంలో, సన్నాయి మేళాలమధ్య పెళ్ళివాసనల ప్రభావంలో అతి తెలివి ఆకాశానికేసి పెరిగిపోయింది.

"వీడేరా మావాడు," అంటూ పట్టాభి తన కొడుకును తెచ్చి ప్రకాశం కూచున్న చోటికి వచ్చి చోటు చేసుకుని తనుకూడా కూచున్నాడు.

"భేష్! నీపేరేమిటోయ్!" అన్నాడు వెంకటనారాయణ.

"వెంకటరావండీ," అన్నాడు పట్టాభి కొడుకు.

కుర్రాడు చూడటానికే చురుగ్గావున్నాడు. చాలామంది యువకులలో చైతన్యం వున్నా చురుకుండదు. వాళ్ళ చైతన్యం చాలావరకు ఆనందాన్వేషణనుంచి కలిగేది. ఏవో కొన్ని లక్ష్యాలుగల వాడిలో చైతన్యం కేంద్రీకృతమై చురుకుగా పరిణమిస్తుంది.

వెంకట్రావు అందంగా కూడా వున్నాడు.

"మావాడికి ఎంతమందో సహాయం చేశారుగాని, పురుషోత్తం సహాయం చేసే అవకాశం కలగలేదు. దేనికన్నా ప్రాప్తం ఉండాలి. కనీసం ఉద్యోగమైనా పురుషోత్తం కింద దొరికితే నాకు తృప్తిగాఉండేది. వాడి రిజల్ట్సు తెలియకముందే పురుషోత్తం ఇంకెవరికో ఉద్యోగమిచ్చాడు. , అప్రెంటిస్‌షిప్ అవకాశంకూడా పైవాళ్ళే ఇచ్చారు.... పోన్లే—జరగనిదానికి అనుకోవడం వృధా" అన్నాడు పట్టాభి.

పెళ్ళికొడుకు పెళ్ళికూతురి మెడలో ముళ్ళు వేస్తున్నాడు. అందరిదృష్టీ వధూవరుల మీదికి మళ్ళింది. బ్రాహ్మడు చేతులూపాడు, అందరూ చేతుల్లోఉన్న అక్షింతలు వధూవరులకేసి విసిరారు. అవి చాలా వరకు సభికుల నెత్తినే పడ్డాయి.

ఆతరవాత సభికులలో టెన్షన్ తగ్గింది. కొందరు లేచారుకూడా. వీధిలో కార్లరొదా, కారు తలుపులు మూసే చప్పుళ్లూ సాగాయి. వెళ్ళిపోయేవాళ్ళు ఇంకా బయలుదేరని వాళ్ళతో వస్తామని చెబుతున్నారు, కొద్దిమంది బోనుల్లోంచి తప్పించుకున్న సర్కస్ జంతువులల్లే గబ గబ వెళ్ళిపోతున్నారు. ఇదంతా చూసి ఆనందించినవాడు వెంకటనారాయణ ఒకడే.

ఇంజనీరు వెంకట్రావు జేబులోంచి సిగరెట్టు తీసి అంటించాడు.

"ఒరే, నీ కొడుకు నీ.ఎదటే సిగరెట్లు కాల్చేస్తున్నాడే!" అన్నాడు వెంకటనారాయణ.

"చాటుగా కాలిస్తే బాగుంటుందంటావా? నాకూడా ఒకటివ్వరా, వెంకటనారాయణ కూడా కాలుస్తాడు." అన్నాడు పట్టాభి.

వెంకట్రావు సిగరెట్టు పెట్టెమీద నిప్పు పెట్టె పెట్టి రెంటినీ సర్క్యులేషన్‌లో పెట్టాడు.

దాదాపువచ్చినవాళ్ళంతా వెళ్ళిపోయారు. పురుషోత్తం ఖాళీకుర్చీలమధ్య రిలాక్సయి కూచునిఉన్న చిన్ననాటి స్నేహితులకేసి వచ్చాడు.

"పెళ్ళిచేసి చూస్తున్నావు! ఎట్లావుంది బరువు?"అన్నాడు పట్టాభి పురుషోత్తంతో.

"ఆఁ, నాకేముంది? ఉన్నపని అందరికీ పంచేసి పైపెత్తనం మటుకుచేస్తున్నా.... బసలో సౌకర్యంగా ఉందా? అటుకేసి రావటానికైనా పడలా," అన్నాడు పురుషోత్తం.

"బాగానేవుంది. చిన్నచిన్న యిబ్బందులుంటే సరిపెట్టుకుపోతారు!" అన్నాడు ప్రకాశం.

"నువు స్నేహితుడివి గనక ఆమాటన్నావు. ఎవరూ సరిపెట్టుకుపోరు, ప్రకాశం! ఇంటోకన్న పదింతలు బాగా జరక్కపోతే తిట్టేస్తారు. పెళ్ళినాడుమటుకు పెళ్ళి పెద్దకు అందరూ అల్లుళ్ళే అనుకో! మనం ఎంత జాగ్రత్తగా వున్నా ఏదోలోపం జరక్కపోదు."

"మన దుష్ట చతుష్టయం చాలాకాలానికి కలుసుకున్నాంరా!" అన్నాడు వెంకటనారాయణ.

"నిజమే సుమా! మనం తీరిగ్గాకూచుని పాతకబుర్లు చెప్పుకోవాలి. మీరెవరూ యీపూట బసకు వెళ్ళకండి. ఇంకో గంటలో భోజనాలు రెడీ అవుతాయి, కలిసి భోం చేద్దాం," అన్నాడు పురుషోత్తం.

అతను ఒక ఖాళీకుర్చీలో కూచుని తన వియ్యాల వారిని గురించి వివరాలు చెబుతుండగా యెవరో పిలిచారు.

మిగిలిన ముగ్గురూ కబుర్లలో పడ్డారు.

"స్నేహితులను గురించి నే నెప్పుడూ తెగ ఆలోచించుకుంటా. కవిగాళ్ళ ప్రేమను గురించి కోసే కోతలకన్న స్నేహంలో ఇంకా ఎక్కువ విశేషం ఉందనిపిస్తుంది. నీతో ఇరవైఏళ్లు కాపరంచేసి, నీ కష్టసుఖాలన్నీ వంచుకుని, పిల్లలతో నిన్ను కట్టేసుకున్న పెళ్ళాంకన్నా ముప్పైఏళ్ళ క్రితం చూసిన స్నేహితు డెక్కువ అనిపిస్తాడు. ఎందుకు? ఎంత ఆలోచించినా స్నేహబంధం నా కర్థం కాలేదు!" అన్నాడు పట్టాభి.

"స్నేహంలో స్వార్థం లేకపోవటంచేతనేమో?" అన్నాడు ప్రకాశం.

"స్నేహంలో స్వార్థం లేదంటే నేను ఒప్పుకోను. నా కేదన్నా అవసరంపడితే మొట్టమొదట స్నేహితులను అడిగి వాళ్ళ వల్ల కాకపోతే ఇంకొకరిదగ్గరికి పోతాను" అన్నాడు వెంకటనారాయణ.

"స్నేహితుడు సహాయ పడలేకపోతే నువ్వు అపార్థం చేసుకుంటావా?" అన్నాడు పట్టాభి.

"స్నేహితుడైనవాడు సహాయం చెయ్యగలిగుండీ చెయ్యలేదన్న ఆలోచన ఎట్లా తట్టుతుంది? తట్టితే స్నేహమేకాదు." అన్నాడు వెంకటనారాయణ.

"అందుచేత స్నేహానికిముఖ్యం స్వార్థం లేకపోవటంకాదు—స్వార్థాల మధ్య పరస్పర ఘర్షణ లేకపోవటం అయుండొచ్చు. ఏమంటావ్?"అన్నాడు పట్టాభి ప్రకాశంతో.

"అట్లా అయితే నేను స్నేహాన్ని ఎన్నడూ ఉపయోగించుకోలేదు. హామ్లెట్‌లో పొలోనియస్‌గాడు స్నేహాన్నీ డబ్బునూ గురించి చెప్పిన సలహా నాబుర్రకెక్కిపోయింది. డబ్బు స్నేహాన్ని పాడు చేస్తుందని నమ్మి ఏనాడూ స్నేహితులను యాచించలేదు. ఆపని చేస్తే నేనింతకష్టాలు పడకపోదునేమో!" అన్నాడు ప్రకాశం.


అతనన్నమాటలు ఆ సందర్భంలో ఐరువైనాయేమో మరి, కాస్సేపు ఎవరూమాట్లాడలేదు. కాస్సేపుండి ప్రకాశమే, "నేను చేసినది తప్పుకాదేమోలే. ఈనాటి ప్రపంచంలో అన్నిటికన్నా డబ్బు శక్తిగలది. దానికీ స్నేహానికీ పోటీ పెట్టటం మంచిదికాదు." అన్నాడు.

"ఒరే, స్నేహానికి అన్యాయం చేస్తున్నావు!" అన్నాడు పట్టాభి.

"నువ్వు కష్టాలు పడ్డవాడివే! నాకు ఏ స్నేహితుడు ఏ ఆపత్సమయంలో ఆదుకున్నాడో చెప్పు. నేనుకూడా నీ దారికే వస్తాను" అన్నాడు ప్రకాశం.

"ఏ స్నేహితులూ సహాయం చెయ్యకుండానే నాకు జరిగిందనుకున్నావుట్రా, ప్రకాశం! చాలాసార్లు చాలామంది సహాయపడ్డారు. ఇంకా యెక్కువగా సహాయపడలేదంటే అందుకు కారణం అశక్తతేనను కోవాలిగాని, వెంకటనారాయణన్నట్టు, స్నేహితులు సహాయం చెయ్యగలిగివుండీ కూడాచెయ్యలేదనుకోరాదు. అలా అనుకోవటం స్నేహపాత్రత కాదు."

"పట్టాభీ, నే నొక్కటి అడుగుతాను చెప్పు. నువ్వు సంసారంలో స్థిరపడ్డాక



మంచి స్నేహితులను ఎంతమందిని సంపాదించావు?" అని అడిగాడు ప్రకాశం.

పట్టాభి కొంచెం ఆలోచించి, "ఎక్కువ మంది లేరు. ఎందుకిలా అడిగావు?" అన్నాడు.

"కొద్దిమంది ఉన్నారనుకుందాం. నీకు స్నేహితుల ఆలోచన రాగానే వాళ్ళేనా జ్ఞాపకం వచ్చేది?"

"కాదు. చిన్నప్పటి స్నేహితులే జ్ఞాపకం వస్తారు."

"మనం స్నేహం చేసేశక్తి చిన్నతనంతో ఉన్నట్టుగా పెద్దయితే ఉండదు. బాగా ఆలోచించి చూడు. నాకీ ఇరవైఏళ్ళలో గాఢమైన స్నేహం ఒక్కటీ కూడాలేదు. ఇష్టమైనవాళ్లు దొరికారనుకో. నిజంగా మాయకుండా ఉన్నవి చిన్నప్పటి స్నేహాలే.... పెద్దయి సంసారాలు మీద పడ్డాక మనస్సులు పెళుసెక్కుతాయి. వాటికి స్వేచ్ఛ ఉండదు. జీవితం హరించేస్తుంది. పెళ్ళాలు హరించేస్తారు, ఈ ఒత్తిడిమధ్యచిన్ననాటిస్నేహాలు శాసిలైబయి చెక్కు చెదరకుండా నిలిచిపోయి, ఏళ్ళు గడిచినకొద్దీ అద్భుతంగా కనిపిస్తాయి. ముసలితనంలో పుట్టుకొచ్చే కామంలాగా, స్నేహపాత్రత మనలో తగ్గినకొద్దీ చిన్ననాటి స్నేహాలను గురించి యావ—నోస్టాల్జియా—జాస్తి అవుతుంది. అది మనలోగాఢంగావుండబట్టే మనంనలుగురమూ ఇవాళ ఇక్కడకలిశాం, స్నేహంమీద ఒకవిధమైన కమ్యూనిజం నిర్మించవచ్చునంటే నేను నమ్మను - కమ్యూనిజంమీద స్నేహాలు నిర్మించ వచ్చునేమోగాని!" అన్నాడు ప్రకాశం.

వెంకటనారాయణలాగా ప్రకాశానికి తేలికగా మాట్లాడే అలవాటులేదు. మాట్లాడటం అతనికి శ్రమతో కూడినపని, అతని ప్రమాణాలనుబట్టి యిది పెద్ద సంభాషణ.



దీంతో తలనొచ్చినట్టయి నుదురు నొక్కుకున్నాడు.

"నువు బొత్తిగా సినిక్ వై పోయావురా, ప్రకాశం: అయినా నిన్ను తప్పుపట్టను. నా స్థితేమిటంటే - ఇవాళ నాకు స్నేహంలో నమ్మకం పోయిందో యిక నమ్మేటందుకేమీ లేదు. నేను దాన్ని జీవితానికి గీటురాయిగా పెట్టుకున్నాననుకో. నేను నాపెళ్లాంతోనూ, కొడుకుతోనూ స్నేహం చేసుకున్నాకే మామధ్య యెటువంటి రిజర్వేషన్సూ లేవు. అది అలావుంచి, నాకుతగిలే ఏ మనిషయినా సరే, ముందు స్నేహపాత్రుడవునా కాదా అని ఆరాతీస్తా. నాకే స్నేహితుడు కానక్కర్లా, ఎవరికి స్నేహితుడైనా సరే చాలు. స్నేహపాత్రుడైనవాడి రాజకీయాలేవి, వాడి సోషల్ ఐడియాసెలాంటివి అని ఆరాతీస్తా. స్నేహితులు లేనివాళ్ళను గురించి కూడా యిలాగే ఆరాతీస్తా. చాలా ఇంటరెస్టింగ్ రిజల్ట్స్ కనిపిస్తున్నాయి. ఎప్పుడో బయట పెడతా. జీవితంలో డబ్బుకు శక్తి హెచ్చన్నావే. ఆ శక్తి ఆఛే మంచిధోరణులు కలిగించటంలా. అంతో ఇంతో స్నేహమే మనుషుల్లో మంచితనం దక్కించి వుంచుతున్నది; డబ్బు ఖచ్చితంగా మనుషుల్ని తినేస్తున్నది." అన్నాడు పట్టాభి.

ప్రకాశం విషాదంగా నవ్వి, "నేను జీవితంలో చెడ్డభాగమే చూస్తున్నానంటావు:... కావచ్చు. చెప్పానుగదా, నేను ఓడినవాణ్ణి!" అన్నాడు....

భోజనాలదగ్గిర వెంకటనారాయణ పురుషోత్తంతో, "మనం ప్రకాశం సంగతి కాస్త విచారించాలిరా. పెద్దసంసారం. చప్పుజీతం. పిల్ల పెళ్ళికి ఎదిగొచ్చింది. కొడుకు చేతికంది రావటానికి కనీసం ఇంకా పది పది హేనేళ్ళ పట్టేట్టుంది." అన్నాడు.

"ఐడిపంతులుకాదూ? ఎంత జీతం?" అన్నాడు పురుషోత్తం.

"నూటయాభై."

"కనీసం మూడొందలన్నాలేందీ ఈ రోజుల్లో— ఎవరయ్యా వడ్డనా? స్వీట్లు మళ్ళీ తీసుకురారా?" అన్నాడు పురుషోత్తం.

"అందరూ చందాలు వేస్తారా ఏమిటి? అలాటిపని చెయ్యకండి. ఆదశకూడా వచ్చినప్పుడు చూద్దాం." అన్నాడు ప్రకాశం.

"ఒరే, నువ్వు మాట్లాడకు, చందాలే వేస్తామో, ఏంచేస్తామో. చేసేది మేమూ! తెలిసిందా?" అన్నాడు వెంకటనారాయణ.

"చందాలేమిటి కానీ....ప్రకాశం సమస్య ప్రధానంగా డబ్బు సమస్యే" అన్నాడు పురుషోత్తం.

ప్రకాశం పట్టాభికేసి, "స్నేహం సమస్య కాదు. చూశావా?" అన్నట్టు నవ్వాడు. కాని ఆ నవ్వు పట్టాభి కర్థంకాలేదు.

"ఈగొడవ అయిపోనీ. ప్రకాశంసంగతి తప్పక ఆలోచిద్దాం," అన్నాడు పురుషోత్తం ఆత్మవిశ్వాసంతో.

6

తనుగొడవల్లో మునిగిపోయి వుండేవాళ్ళ యితరుల రహస్యాలను సులువుగా తెలుసుకోలేరు. అది అనుమానం మనుషులకే సాధ్యం. తన కూతురు లక్ష్మి ఏదో మానసిక వ్యధ పొందుతున్నట్టు నాగమ్మ విడిదిలోనే పసికట్టింది. పసికట్టిందేగాని, విషయమేమిటని కూతుర్ని అడగలేదు. "తండ్రి పోలిక! ఉత్త ఏడుపుగొట్టు! ఏ స్వల్ప విషయానికైనా లోలోపల కుమిలిపోతారు తండ్రి కూతుళ్ళు!" అనుకుంది.

ముహూర్తమప్పుడుకూడా నాగమ్మ లక్ష్మిని ఓ కంట కనిపెడుతూనేఉంది. లక్ష్మి మొహాన ఏవిధమైన ఆనంద చ్ఛాయలూ లేవు. లక్ష్మి ఎవరికేసి చూస్తుందో దాన్నిబట్టి ఏమన్నా విషయం బయట పడుతుందేమోనని నాగమ్మ ఆలోచించింది. లక్ష్మి ఎవరికేసీ చూడలేదు—వధూవరులకేసి తప్ప. వరుడికి వీలయినంత దగ్గరలో తారట్లాడే వాసును లక్ష్మి చూస్తున్నదని నాగమ్మవంటి అనుమానం మనిషికికూడా తట్టలేదు. ఆడంగిరేకులవాడికింద ఎప్పుడో జమ కట్టేసింది. తనకు ఎవరిని గురించిగాని ఒక దృఢమైన భావం కలిగితే లోకమంతా అదే భావంలో ఉన్నదని ఆమెకొక భ్రమ ఉన్నది; ఆ భ్రమ ఎన్నిసార్లు అనర్థాలు తెచ్చిపెట్టినా దాన్ని ఆవిడ పట్టుకు వేళ్ళాడుతూనే ఉంది.

ఆఖరు చాన్సు నాగమ్మకు రిసెప్షనులో దొరికింది. ఈసారి లక్ష్మి ఒకమూల పాతుకుపోక అటూ ఇటూ స్వేచ్ఛగా తిరిగింది. చాలాసార్లు వాసు దృష్టిని ఆకర్షించ యత్నించింది. వాసు తనను తప్పించుకు తిరుగుతున్నాడని నమ్మకంగా తెలుసుకున్నాక తల్లిపక్కన కూచుని మరికదల్లేదు. నాగమ్మకు కూతురి మనస్థితి అర్థం కాలేదు. రహస్యం బయట పడలేదు.

రిసెప్షనులో ఒక తమిళ గాయకుడు పాడాడు. దాదాపు ఎవరూ వినలేదు.

స్నేహితులైన పట్టాభి, వెంకటనారాయణ, ప్రకాశం, పట్టాభి కొడుకు వెంకట్రావూ, అతని మిత్రులూ ఒకచోటే కూచున్నారు. వాళ్ళు సంగీతంవిన్నారోలేదోగాని సంగీతంగురించి మాట్లాడుతున్నారు.

"తెలుగు కృతులు ఈ అరవ్వాళ్ళు పాడుతుంటే వినలేం," అన్నాడు వెంకటనారాయణ.

"కృతులుమాటకేం గానీండి: కర్నాటక సంప్రదాయం అరవ్వాళ్లకి పట్టుబడలేదు." అన్నాడు వెంకట్రావు.

"నీకి అరవపాట నచ్చుతుందిటోయ్" అన్నాడు ప్రకాశం.

"బాగా నచ్చుతుంది. ఈ పాడే ఆయన చూడండి. పెద్ద పేరున్నవాడు కాడు కాని రాగం యెంత ముచ్చటగా అంటున్నాడో



● వినాయక చవితిరోజున ఒకడు మట్టితో విన్నాయకుడి బొమ్మ తయారు చేశాడు, వాడి స్నేహితుడొకడు వచ్చి "ఏడ్చినట్టుంది. నేను దీని బాబులాంటి బొమ్మ తయారు చెయ్యగలను" అన్నాడు.

"చెయ్యి చూద్దాం" అన్నాడు మొదటివాడు.

రెండోవాడు శివలింగం తయారుచేసి పెట్టాడు.

— పి. వి. యస్.

చూడండి. ఈపాట పాడగలవాళ్ళు యీ పట్నంలో కనీసం రెండువేలమంది వుంటా రని నానమ్మకం. అందరూ పాటకచ్చేరీలు చెయ్యరు కొందరుగుమాస్తాలుగావున్నారు." అన్నాడు వెంకట్రావు.

"వీళ్ళకి రాగమూ, తాళమూ వున్నాయి, గాని భావం తక్కువ. ఈ కర్నాటక సంగీతాన్ని చివరకు అరవ్వాళ్ళే ఖూనీచేసేస్తారు చూస్తూండు," అన్నాడు వెంకట్రావు పక్కన కూచున్న మిత్రుడొకడు.

"భావం ఏమోగాని పాటలో సుఖంకోసం ప్రయత్నిస్తే బాగుణ్ణు. వీళ్ళకి సుఖమైన పాటలో నమ్మకంలేదు." అన్నాడింకో మిత్రుడు.

"మీనాన్నపక్కన కూచున్న అబ్బాయెవరే?" అన్నది నాగమ్మ లక్ష్మితో.

"ఏమో నాకు తెలీదు." అని కసిరించి లక్ష్మి. ఆకోపం తల్లిమీద కాదు. వాసు మీద.

నాగమ్మ ఓడిపోయింది. బసకు తిరిగి వచ్చినాక ఆమె కూతుర్ని. "ఎందుకే అట్లా ఉన్నావు?" అని లాలూచీగా అడిగింది.

లక్ష్మి చాలాసేపు ఏమీ లేదని దబాయించి. చివరకు. "వాసుకెందుకో నామీద కోపం వచ్చింది....రైల్లోకూడా సరిగానే ఉన్నాడు. రైలు దిగినప్పణ్ణుంచీ నాకేసి చూడు. పలకరించినాపలకడు," అన్నది ఏడవటం తరవాయిగా.

"ఇంతేకదా?" అన్నది నాగమ్మ. లక్ష్మి చెప్పనిది ఆమె కర్థమైపోయింది.

వీలు చిక్కగానే నాగమ్మ తన మొగుడితో, "మీ కూతురికి ఉన్నట్టుండి ప్రేమ పుట్టుకొచ్చిందండోయ్—వెంకటనారాయణ గారబ్బాయి వాసుమీద!....సంబంధం దొరికిపోయింది. తాంబూలాలు పుచ్చుకోవటమే తరవాయి" అన్నది. ఆవిడ వాసును చూసినప్పుడు ఒక చిన్న "టిక్" పెట్టి ఉంచింది. లక్ష్మితో అతను స్నేహంగా ఉండటంచూసి ఇంకో "టిక్" కలిపింది. కాని తరవాత వాసు లక్ష్మి విషయం ఏమీ పట్టించుకోకపోవటంచూసి. "అడారివెధవ!" అనుకుని టిక్కులు తుడిపేసుకుంది. వాళ్ళిద్దరి మధ్యా చిన్న ప్రణయ కలహం ఏదో వచ్చింది. ఎండుగడ్డి మంట. క్షణంలో అదే చల్లారుతుంది. వెంకటనారాయణ చూస్తు చూస్తూ తమను కట్నం అడుగుతాడా? ఇద్దరికీ ముడిపెట్టేస్తే ఒక పెద్ద బెడద తీరిపోతుంది. ఈ పెళ్ళి వేదిలోనే ఆ పెళ్ళి కూడా ఖరారు కావడం మంచిది.

ప్రకాశం నాగమ్మ చెప్పినమాట విని కొద్దిగా ఆశ్చర్యపడ్డాడు. తన స్నేహితుల కొడుకులలో వాసుకన్న వెంకట్రావు ఎన్నోరెట్లు యోగ్యుడుగా కనిపించాడాయనకు. వాసు గురించి ఆయనకు ఏ అభిప్రాయమూ కలగలేదు. అటువంటి నిరాకారులైన యువకులు ప్రపంచంలో కొల్లలు. అయినా లక్ష్మి వాణ్ణే చేసుకుంటానంటే చేసుకోనీ.

ప్రకాశం లక్ష్మిని ఇవతలికి పిలిచి. "వాసును చేసుకోవాలని ఉందిటే?....ఉంటే చెప్పు. వెంకటనారాయణ నడిగి ఔననో, కాదనో అనిపిస్తా. ఏదో ఒకటి తేలిపోతే మంచిది....మాట్లాడవేం? అక్కర్లేకపోతే చెప్పెయ్యి." అన్నాడు.

లక్ష్మి తలవంచుకుని బలవంతాన, "అడుగు." అన్నది.

ప్రకాశం కొంచెం సంకోచించి. "పట్టాభి కొడుకును వెంకట్రావును చూశావా?" అన్నాడు.

చూశానన్నట్టు లక్ష్మి తల ఆడించింది.

"వాడు నీకు నచ్చలా? వాసుగాడికన్న వెంకట్రావు అన్నివిధాలా మెరుగేమో? పట్టాభి నిన్ను వాడికి చేసుకుంటాడని నమ్మకంలేదనుకో. వెంకట్రావుకు పదివేల కట్నంతో పిల్లనిస్తారు. అయినా అడగటానికేం? వాణ్ణికూడా అడగమన్నావా?"

వద్దని లక్ష్మి తల తిప్పింది.

ప్రకాశం ఆశ్చర్యపోయాడు. ఆడవాళ్ళ బుద్ధి తలకిందులుగా నడుస్తుందని ఆయనకు ఏనాడో తెలుసు. లక్ష్మికి వాసుతో వున్న స్నేహం వెంకట్రావుతో లేదన్న సంగతి తెలీదు. మనుషులు అర్థంకాకపోవటానికి కారణాలుంటాయి మరి.

"ఏంరా, వెంకటనారాయణా? మా లక్ష్మి మీవాసును స్వయంవరం చేసుకున్నట్టుందేమిటి? వాడి పెళ్ళివిషయం ఏమిటనుకుంటున్నారు?" అని ప్రకాశం అడిగాడు.

"వాడప్పుడే పెళ్ళిచేసుకోనంటున్నాడే? నాసంగతి తెలుసుగా నీకూ! వాడి ఇష్టం. నేను వాడి పెళ్ళివిషయంలో ఏమీ జోక్యం కలిగించుకోను. సలహా అడిగితేమాత్రం చెబుతాను. వాడిపెళ్ళి అనుకొని నానాదేశపు రాజకుమార్తెల పటాలు తెప్పించేటప్పుడు మీఅమ్మాయి పటంకూడా పంపుదువుగాని" అంటూ వెంకటనారాయణ వేళాకోళం కిందికి దింపాడు.

"పెళ్ళిమాట దేవుడెరుగు. లక్ష్మిని చేసుకోవాలన్న ఉద్దేశం మీవాడికి అసలున్నదీ లేనిదీ కనుక్కో. మా అమ్మాయికి ప్రపంచ జ్ఞానంలేదు. అది కలలుకంటూన్న పక్షంలో ఆ కలలు పోగొట్టేభారం నామీదా, మా ఆవిడమీదా ఉంటుంది గదా." అన్నాడు ప్రకాశం.

"దానికేం భాగ్యం? కనుక్కుందాంతే!" అన్నాడు వెంకటనారాయణ.

ఆయన ప్రకాశం మనోనైర్మల్యాన్ని శంకించలేదుగాని, వాసును చూడగానే లక్ష్మికే దురాశ కలిగిందో, లేకవాళ్ళమ్మే ఆపిల్లకు దురాశ కలిగించిందో అనుకున్నాడు. వాసు లక్ష్మివంటి పిల్లను చేసుకోడని ఆయనకు దాదాపు రూఢిగానే తెలుసు. వాడికి బాగా చదువుకున్నవాళ్ళూ, ఫాషన్లు తెలిసినవాళ్ళూ, కాస్త మాటకారితనం గలవాళ్ళూ ఇష్టం. లక్ష్మి పాతకాలపుది.

● ఇరవయ్యేళ్ళుగా కాపరం చేస్తూ మా ఆయన్ని యింతవరకు అర్థం చేసుకోలేకపోయాను'' అన్నదొకావిడ.

''మీవారికేం పనేమిటి?'' అని అడిగింది ఇంకొకావిడ.

''యూనివర్శిటీలో న్యూక్లియర్ ఫిజిక్స్ ప్రొఫెసరు''

"ప్రకాశం కూతురు లక్ష్మి అంటే నీ కిష్టమేనుట్రా? నిన్ను చేసుకోవాలని ఆ పిల్ల కున్నట్టు ప్రకాశం చెబుతాదేమిటి? ఇష్టమైతే చెప్పు పెళ్ళిచేసేస్తాం." అన్నాడు వెంకటనారాయణ వాసుతో.

వాసు ఆముదం తాగిన మొహం పెట్టి "దాని మొహం! నేను లక్ష్మిని చేసుకుంటానని నువ్వెట్లా అనుకున్నావు నాన్నా. కాస్త ఎంటర్‌టెయిన్ చేసేసరికి ఆ పిచ్చిది లవ్‌లో పడ్డట్టుంది", అన్నాడు.

ఈ శుభవార్త అంచెలమీద తనకు అందగానే లక్ష్మి కుళ్ళి కుళ్ళి ఏడిచింది.

"ఇంటి కెళ్ళిందాకా కాస్త ఊరుకోవే!" అని తల్లి చివాట్లు పెట్టింది....

పెళ్ళి హడావిడి తగ్గగానే విడిది ఖాళీ అయింది.

"మీరు నాలుగురోజులుండిమరీ వెళ్ళండి. ఇప్పుడు మా ఇల్లు ఖాళీయేగదా. హాయిగా ఉండవచ్చు." అని పురుషోత్తం తన చిన్ననాటి స్నేహితులనూ, వాళ్ళ కుటుంబాలను ఆహ్వానించాడు.

"దుష్ట చతుష్టయం" భార్యలు ఒకరినొకరు తెలుసుకోవటానికి మంచి అవకాశం దొరికింది. వాళ్ళు ఒకరికొకరు కొంచెంకూడా నచ్చలేదు. ఈసంగతి తమ భర్తలకు విడివిడిగా తామే చెప్పుతున్నారు. మగవాళ్ళు తమ పెళ్ళాలు రహస్యంగా చెప్పినమాటలు కలబోసుకున్నారు.

"ఆడవాళ్ళ మధ్య సహజ శత్రుత్వం ఏదో ఉందర్రా! అందరూ కలసి మందల్లో ఉంటున్న కాలంలో కుటుంబాలను విభజించి తెచ్చగొట్టినది ఆడవాళ్ళే అయిఉంటారు. పెళ్ళిళ్లూ, కుటుంబాలూ, అవిభక్త కుటుంబాలనుంచి విభక్త కుటుంబాలూ—ఇటువంటి ఏర్పాట్లన్నిటికీ ఆడవాళ్ళే మూలకారణం కావచ్చు." అన్నాడు వెంకటనారాయణ.

"పూర్వకాలపు సమాజాలు చీలిపోయినప్పుడు ఒక్కొక్క జట్టుకు ఆడది నాయకురాలట. ఆవిడపేరే ఆజట్టంతా పెట్టుకునేదిట. అందుచేత నువ్వన్నదినిజమేకావచ్చు" అన్నాడు పట్టాభి.

"ఎప్పుడో జరిగిన దానిమాట చెబుతారేమిటి? ఈనాడు చూడరాదూ? మొగుళ్ళనుబట్టి మారుతున్న ఆడవాళ్ళు చాలా తక్కువ. మనమంతా పెళ్ళాలనుబట్టి మారినవాళ్ళమే." అన్నాడు పురుషోత్తం.

ఆయన తన భార్యతో మాటవరసగా, "పాపం ప్రకాశం నూటయాభై రూపాయల మీద అయిదుగురు పిల్లలతో ఈదుకొస్తున్నాట్ట." అన్నాడు.

"నూటయాభై రూపాయలొస్తుంటే తీపురమా? ఆయన పెళ్లాం గవర్నరు చెల్లెలు చేసే ఆలోచనలకి తక్కువ చెయ్యదే!" అన్నది పురుషోత్తం భార్య.

వధూవరుల నిమిత్తం ఒక ఎక్స్‌కర్షన్ యేర్పాటు చేశారు. వాళ్ళు చిన్నకారులో మహాబలిపురానికీ, తరవాత కంచికి వెళ్ళి ఇంటికి తిరిగి వచ్చేటట్టు యేర్పాటయింది. వాళ్ళ వెనగ్గా మూడుకార్లలో పురుషోత్తం కుటుంబమూ, అతని స్నేహితుల కుటుంబాలూ బయలుదేరాయి. వాన్‌లో సామాన్లూ, వంటపాత్రలూ వచ్చాయి.

పక్షితీర్థంనుంచి దిగి వచ్చేటప్పుడు "అసలు పెళ్ళికన్న ఈ ప్రోగ్రాంబాగున్నట్టుందేమిట్రా?" అన్నాడు వెంకటనారాయణ ప్రకాశంతో.

"నే నన్న మాట ఏమయింది?" అన్నాడు ప్రకాశం.

వెంకటనారాయణకు ప్రకాశం ప్రశ్న చప్పున అర్థంకాలేదు.

"ఓ అదా? :వాసును కదిలించా. నేను నీతో ముందే అన్నానే. వాడికి పెళ్ళిఆలోచన ఏకోశానాలేదు. మీఅమ్మాయిని అంత సెంటిమెంటల్‌గాఉండవద్దని చెప్పు."అన్నాడాయన.

"చెబుతాలే!" అన్నాడు ప్రకాశం.

7

"ఇంకమేం పోతామర్రా? రెండురోజుల్లో తిరిగొస్తామని చెప్పాం. నాలుగురోజుల కన్నా పోకపోతే ఎట్లా? పిల్లల్ని ఎవరి మీదో వదిలొచ్చాం." అన్నాడు ప్రకాశం.

"నీకూతురి పెళ్ళి భోజన మెప్పుడోయ్ మామా" అని పట్టాభి అడిగాడు.

అవకాశం చూసుకుని ప్రకాశం పట్టాభితో తన కూతురు వాసును చేసుకుంటానన్న అభిప్రాయం ప్రకటించటమూ, వాసుకు అటువంటి అభిప్రాయం లేకపోవటమూ చెప్పాడు.

"అది వాసును చాలాఏళ్ళుగా ఎరుగునా ఏం?" అన్నాడు పట్టాభి.

"లేదురా. ఒక్కరోజువాళ్ళింటోవున్నాం. వాసూ దాన్ని కబుర్లుచెప్పి ఎంటర్టెయిన్ చేసినట్టుంది."

"దాని మొహంలే. నీకు దగ్గరలో అయిన సంబంధం లేకపోతే మావాడికి చేసుకుంటాను. పెళ్ళి తేలికలో చేసేస్తాం. నువ్వూ లక్షాధికారివికావు. నేనూ కాను." అన్నాడు పట్టాభి.



"మీవాణ్ణి అడగొద్దూ?" అన్నాడు ప్రకాశం.

"మావాడి సంగతి నాకు తెలీదుట్రా? వాడు ఒప్పుకుంటాడు. మాటవరసగాఅడుగు తాననుకో, వాడొప్పుకుంటాడు. నీకు సందేహం అక్కర్లేదు."

"సరే, నేనువెళ్ళి ఉత్తరం రాస్తాలే." అన్నాడు ప్రకాశం.

ఇంటికి చేరుకున్నాక ప్రకాశం లక్ష్మితో వెంకట్రావు విషయం చెప్పాడు.

"వాసు లోఫరు. వెంకట్రావు ప్రయోజకుడు. ఏ ఒక్క విషయంలోనూ వాళ్ళని పోల్చటానికి లేదు. పట్టాభి చిన్ననాటి అభిమానం కొద్దీ ఈపెళ్ళికి ఒప్పుకున్నాడుగాని మరెవ్వడూ ఒప్పుకోడు. ఈ ఇరవై ఏళ్ళలో నాకు అదృష్టమంటూ ఎదురయింది యిప్పుడే!" అని కూతురికి చెప్పాడు.


"నీకూ అమ్మకూ ఇష్టమైతేచెయ్యండి." అన్నది లక్ష్మి. తనకిష్టమేనని అపిల్ల తన నోటిమీదుగా అననేలేదు.

లక్ష్మికీ వెంకట్రావుకూ పెళ్ళి జరిగింది. లక్ష్మి మనసులో ఆనందం ఏమీలేదు. ఏదో దూరవుగొంతు "ఈ రహస్యం ఎవరితోనూ చెప్పవుగదూ?" అని తలలో మెదులుతూనే ఉంది.

వెంకట్రావు యోగ్యుడూ, ప్రయోజకుడూ, అందగాడుకావచ్చు. కాని అతనిలో లక్ష్మికి రొమాన్సు ఏమీలేదు. అతను లక్ష్మికి కోరి తెచ్చుకున్న మొగుడుకాడు. సులువుగా దొరికినవాడు. అతనెంతో వీధుల్లోతిర్లే వందలాది యువకులూ అంతే ఆమె ప్రాణానికి. వాళ్ళలో వెంకట్రావుకున్న అందమైన వాళ్ళూ, ఇంకా పెద్దఉద్యోగాలు చేస్తున్న వారూ ఉండరా? వాళ్ళకు ఇతను తీసికట్టే!

వెంకట్రావుతో సంసారం చెయ్యటం ఆరంభించిన తరవాత అతనికి ఆమె జీవితంలో ఒక ప్రత్యేకస్థానం లభిస్తుంది. పరిస్థితుల ప్రోద్బలంచేత ఆమె అతని కష్టసుఖాలు పంచుకోవటం జరుగుతుంది. రైల్లో కొద్ది గంటలసేపు కలిసిన వాళ్ళమధ్యకూడా ఏదో అనుబంధం ఏర్పడుతుంది. అందులో ఏమీలేదు. బతికున్నన్నాళ్లూ లక్ష్మి వెంకట్రావును ఇతరులతో పోల్చి అతనిలో లేని సుగుణాలను ఇతరులలో చూస్తూనే ఉంటుంది.

లక్ష్మి అంతగా మంచి సాహిత్యం చదివినది కాకపోవటంవల్లా తల్లి ప్రభావానికి మాత్రమే గురికావటంవల్లా, ప్రణయమూ ప్రేమా అనేవి పునాదిగా లేనిపెళ్ళి చేసుకోవటంవల్లా తన తల్లి రెండు దశాబ్దాల క్రితం తొక్కిన మార్గాన్నే తానూ అడుగు పెట్టింది. దేశంలో లక్షోపలక్షలుగా ఆడపిల్లలు ఇదే పద్ధతిలో సంసారంలో అడుగు పెడుతున్నారు గనక లక్ష్మితో ప్రత్యేకత ఏమీలేదు. □□■





వేణు—గానలోలుడు

అందరికీ గొంతు చిన్నతనంలో సన్నగా వుంటుంది. పెద్దవుతున్న కొద్దీ మొద్దుబారి, "బాస్" అధికమౌతూవుంటుంది. కాని, కొందరికి వయసు హెచ్చుతున్నా "బాస్" హెచ్చదు. పైపెచ్చు మరీ సన్నబడడం కూడా కద్దు. ఈ కొందరి జాబితాలోకే చేరతారు మన వేణు.

వీరు సంగీతకారులే కాక, గాయకులు కూడా. వేణుగారి శారీరం వేణు నాదంలా, వెన్నలా మృదువుగా, వెన్నెలలా హాయిగా వుంటుంది. కలకంఠులతో వీరు ద్వంద్వగీతి పాడితే, ఏ గొంతు ఎవరిదో తేలికగా పోల్చుకోగలగడం తేలికైన పనిగాదు. "దీక్ష" చిత్రంలో కుర్రాడైన "గోపీ"కి గొంతిచ్చి పాడినది వీరే. ఎంతచక్కగా "మాచ్" అయిందో మనమందరం యెరుగుదుం. 'ఏమౌతుందో' "మనుషులంటే వీళ్ళేనా" పాటలలోని వీరి సుతి మెత్తని గాత్ర మాధుర్యాన్ని మరువగలమా? గొంతువలెనే, వీరి హృదయంకూడా మృదువైనది.

వీరి హాబీలలో ముఖ్యమైనది ఇంగ్లీషు, హిందీ చిత్రాలుచూడ్డం, నౌషద్ సంగీతం యిస్తే చాలు, ప్రథమశ్రేణికి చెందిన చెత్త చిత్రమైనా సరే చూసి ఆనందించి మరీ చక్కా వస్తారు. మరో ముఖ్యమైన హాబీ 'పియానో' వాయించుకోవడం. పియానో అంటే పిచ్చి. వేణు వివిధ వాద్యప్రవీణులు. హార్మోనియం, పియానో, సితార్, గితార్, దిల్‌రుబా, మేండొలిన్, ఎకార్డియన్, ఫ్లూట్, సెల్లో, వుడోఫోన్, జలతరంగిణి, హేమండ్ ఆర్గన్ ఆదిగాగల పదిపదిహేనువాయిద్యాల్లో ప్రావీణ్యం సంపాయించారు. హార్మోనియాన్ని మాస్టర్ చేశారు. వీరి హార్మోనియం వాయిద్యంలో జిలుగుల రవ్వలు తులుకుతూ పలుకుతాయి. కనకనే పాటలకి వరసలు కూర్చేటప్పుడు, పాటలలోని మాటలలోని అక్షరానికి అక్షరానికి మధ్య

పి. బి. శ్రీనివాస్

లకే సంగతులిరికించడానికే ప్రయత్నిస్తారు వీలైనంతవరకూ, అర్థం చెడనంతవరకూ. ఈ సంగతు లనేకంగా మరాఠీ బాణీలో వుంటాయి.

ఇన్ని ఇన్‌స్ట్రుమెంట్సు చేతనైనందువల్లనే, వీరికి "రికార్డింగు" సమయంలో సౌకర్యం. పని సుకరం. ఎవరైనా ముఖ్యవాయిద్య గాళ్ళు కారణాంతరాలవల్ల గైరు హాజరయినా వారికోసమని వేచి వేచి, గోళ్లు గిల్లుకుంటూ కూర్చోనవసరం లేకుండా అవసరమైతే, వాళ్ళస్థానాన్ని తనే ఆక్రమించి, భర్తీచేసి, కావలసిన వాయిద్యాన్ని వాయించి, కాలయాపన ,ఆపనయించుకుంటారు. ఈ వాయిద్యాలన్నీ వాయించుకుంటూ.

వీరు తరుచూ యింట్లోనే 'కూర్చుంటూ వుంటారు, వట్టియింటిపిట్ట (Home Bird) "గృహమేకదా స్వర్గసీమా" అన్న శ్రీ నాగయ్యగారి నీతిని నిక్కచ్చిగాపాటిస్తారు. "జీవన్‌మహల్" అని నామకరణం చేయబడ్డ, వీరి అంతస్థుకి తగ్గ ఘనమైనభవనం మూడో అంతస్తులో నిర్మించుకున్న ప్రత్యేకమైన గదిని అందంగా అలంకరించారు. పియానో, సితార్ ఆదిగాగల రకరకాల వాద్యాలతోనూ, రేడియోగ్రాం, టేప్‌రికార్డర్ వగైరా సంగీత సాధనా సాధనాలతోనూ, వీరి సమస్తమూ ఈ సంగీత ప్రపంచమే.

శ్రీ వేణు స్వస్థలం బందరనబడే మచిలీపట్టణం, జననం 1920 ప్రాంతంలో. జనకులు శ్రీసుబ్బయ్యనాయుడు. బందరులోనే థర్డుఫారం దాకా శ్రీరామా హైస్కూల్లో ఆడుకున్నారు. బడికెళ్తానని బుద్ధిమంతుడిలా బయలుదేరి, యింటిచుట్టూ ముమ్మారు ప్రదక్షిణంచేసి, బయటినుండే కిటికీగుండా పుస్తకాలు లోపలపడేసి, పరుగు తీసి, "టంగుటంగా" అని చెంగు చెంగున జింకపిల్లల్లే గంతులేస్తూ గల్లంతుచేస్తూ, శ్రీరామా హైస్కూల్లోనే, రామదండనదగిన కుర్రకుంకల మూకతో కోతికొమ్మంచులాడుకునేవారు. చెట్లూ, చేమలూ యెక్కడం, వంగలకఱ్ఱతో పిట్టల్నికొట్టడం, కనిపించినవాళ్ళని తిట్టడం, ఎదురుతిరిగినవాళ్ళ పనిపట్టడం - ఇవీ వీరునేర్చిన పాఠాలు.

హార్మోనియం షాపులో హార్మోనియం వాయించుకోవడం ఒకటే అనాడు వీరుచేసే బుద్ధితోకూడిన పని. చిన్నప్రాయంలోనే నాన్నార్ని పోగొట్టుకున్నారు. "అబ్బలేని బిడ్డా, మబ్బులేనిఎండా" మహాచురుకంటారు. ఇహ చూస్కోండి మజా! అల్లరి పిల్లల్ని పెట్టింది. హద్దూ పద్దూలేకుండా పోయింది. ఈ అల్లరిబాధ పడలేక వీరితల్లి తన సోదరులైన శ్రీ రామయ్యనాయుడుగారితో మొరపెట్టుకునేవారు. ఒకనాటి మధ్యాన్నం మండు టెండలో బయల్దేరారు వీరి మేనమామ తన మేనల్లుణ్ణి వెతకడం కోసం.

వెతికి వెతికి, చివరికి తాటిచెట్టెక్కుతున్న వేణుని చూశారు. మేనమామని చూడగానే భయంవల్ల చేతిపట్టుతప్పి కింద బడ్డారువేణు. అపద్దంపద్దం, మరో కుర్రాడి చేతిమీద పడ్డారేమో, పాపం వాడి చెయ్యి విరిగింది. వాడి బాధచూసిన ఈ అల్లరి పిల్లడి గుండె కరిగింది. కొంటెతనం.. తరిగింది. బుద్ధికుదిరి మంచిదారి మరిగింది.

చిన్నప్పుడే తండ్రినీ, తరువాత మూడేళ్ళకే తల్లినీ కోల్పోయిన మేనల్లుడిని, మేనమామగారే గారాబంగా చూసుకునేవారు. సదుపాయాలన్నీ సమకూర్చి, అదుపాజ్ఞల్లో వుంచి, గుమ్మం దాటనీయకుండా, ఇరవై నాలుగు గంటలూ సంగీతాభ్యాసం చేయించేవారు. ఇలా అయిదారేళ్ళపాటు మేనమామ వద్దే, హార్మోనియమూ, వాగ్గేయకారక శ్రీ చెబ్రోలు వెంకటరత్నంగారిదగ్గర వీణా నేర్చుకున్నారు. కొన్నాళ్ళు "గ్రీన్‌లాండ్ ఎగ్జిబిషన్ షోస్"లో నలభైఅయిదు రూపాయల జీతంపైన హార్మోనిస్టుగా కుదిరారు. అక్కడ వాయిస్తున్న సమయంలోనే సుప్రసిద్ధ సంగీతదర్శకులు శ్రీ బి. యన్. ఆర్. (భీమవరపు నరసింహారావుగారు) వీరి హార్మోనీ విని అదిరిపోయారు. పిదప చెన్నపురిలో డాక్టరు గిరిగారిని కలుసుకుని మాటాడుతూ, వేణు వాయిద్యాన్ని వేనోళ్ళ కొనియాడారు. గిరిగారుకూడా బందరుకి చెందినవారే. వేణుని వారే అత్యంతాభిమానంతో, మద్రాసుకి తీసుకొచ్చారు. అప్పుడు దర్శకబ్రహ్మం కీ॥ శే॥ శ్రీ గూడవల్లి రామబ్రహ్మం 'మాలపిల్ల' నిర్మాణం సాగిస్తున్నారు. ఈ సారథీ వారి చిత్రానికి సంగీత సారథులైన శ్రీ బియన్నార్ కి సహాయకులుగా నియుక్తులయ్యారు వేణు. బియన్నార్ వద్దే, వీరు సితార్, దిల్‌రుబా, మేండొలిన్ వగైరావాయించడం నేర్చుకుని క్రమంగా, చెయ్యి తిరిగిన చెయ్యిఅయ్యారు. "మాలపిల్ల" అనంతరం "రైతు బిడ్డ" "మీరాబాయి, "భాగ్యలక్ష్మి" చిత్రాలకి బి. ఎన్. ఆర్.వద్ద పనిచేశారు. "కలికాలం" అనే చిత్రం బి.ఎన్.ఆర్. ప్రారంభించారేకాని, "కలికాలం" లాగే ఆ ఫిలిం ఈనాటికీ ముగియలేదు. వేణు మధ్యలో ;కొంతకాలం బి. ఎన్. ఆర్. వద్ద పనిచేయలేదు. వారిని



"పాపం ఆయన ఎల్లప్పుడూ దరిద్రంతో బాధపడేవాడు. చివరిగడియల్లో సిరెత్తుకుంది. శవం పాతెయ్యడానికి తవ్వగా లంకెబిందెలు దొరికాయి.

వదలి వీరు ఒక ఏడాది సెల్లోప్లేయరుగా బొంబాయిలో శ్రీ వసంత దేశాయి వద్ద కుదిరి కుదురుగా పనిచేశారు. ఇక్కడవుండగానే, వీరికి శ్రీ నౌషాదాలీతో పరిచయం కలిగింది. ఆహ. తనే పరిచయం కలగజేసుకున్నారు. 'నమస్తే' చిత్రంలోనే నౌషాదు పాట "పంఛీజా, పీఛేరహై బచ్‌పన్‌మేరా" విని నౌషాదు భక్తులైన మన వేణు వారినెలాగైనా కలుసుకోదలచి, తను పనిచేసే శాంతారాం స్టూడియో కెదురుగా వుండే కార్దార్ స్టూడియోలోకి, సరాసరి దారితీశారు. కర్దార్‌లో నౌషాద్ శాశ్వత సంగీతకారులుగా వుండేవారు.

తిన్నగా నౌషాదు దగ్గరకే వెళ్ళి కలుసుకుని, వారికి తన హార్మోనియం వినిపించి మెప్పుబడసి మరీ తిరిగొచ్చారు. నౌషాదుకి కూడా వేణు అంటే చాలా ప్రేమాభిమానాలున్నాయని, నేనీ మధ్య బొంబాయిలో నౌషాదింటికి వెళ్ళినప్పుడు, కలుసుకున్నప్పుడు తెలుసుకున్నాను. వేణు మనసుపైనే

కాక వీరి సంగీతంపైన కూడా నౌషాదు ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తూవుంటుంది. ముఖ్యంగా.: మన్నికైన రాగాల ఎన్నికలోనూ. వాద్య ప్రయోగాలలోనూ. నౌషాదు పంథానే త్రొక్కుతారు వేణు ఫ్లూట్. క్లారినెట్టు కాంబినేషన్. వయొలిన్ల కో ఆర్డినేషన్ అంతా నౌషాద్ బాణీయే. ''సాయిబు గారి సంగీతంముందు మరెవ్వరి సంగీతమూ నిలిచి రక్తి గట్టించలేదు'' అని వేణుగారి నిశ్చితాభిప్రాయం. బొంబాయిలో ఇలా హిందూస్తానీ సంగీత వాతావరణంలో రెండేళ్ళు గడిపారు. శ్రీ వసంత్ దేశాయి తెల్లారుఝామున సంగీత సాధనచేసే సమయాన, వీరు హార్మోనీపై అనుసరించేవారట.

తిరిగి మద్రాసువచ్చి భామా ఫిలింస్‌వారి ''వాల్మీకి''కి స్వతంత్రంగా. మొట్టమొదటి సారిగా మ్యూజిక్ డైరెక్షన్ చేశారు. ''వాల్మీకి''ని ముగించినవెనక, వీరు హెచ్. ఎమ్. వి. లో బేసిక్ రికార్డులు యిస్తూ వుండేవారు. అంచాలదాల శ్రీమతి వైజయంతీమాల చేత అనురాగాల రాగాలలో ''దరి చేరగరావా ప్రియుడా. దాచినాను లేవోయ్ నీకై కాచినాను రావోయ్'' అనే పాటలు పాడించారు. హెచ్. ఎమ్. వి. లో రెండేళ్ళ పర్యంతం పనిచేశారు.

అ తరువాత కొంతకాలానికే వీరికి ''విజయా'' సంస్థనుండి ఆహ్వానంవచ్చింది. ఆర్కెస్ట్రా ఇన్‌చార్జిగా 'బుక్' అయ్యారు. నాలుగైదేళ్ళు పనిచేశారు. ''పాతాళభైరవి" చిత్రంలో చిత్రం పొడుగునా విచిత్రమైన ఎఫెక్ట్సు వినిపించిన ''హేమండ్ ఆర్గన్" అత్యంతాకర్షణీయంగా వాయించి వన్నెకెక్కిన విశిష్టవ్యక్తి శ్రీ వేణే. షావుకారు, పెళ్ళిచేసిచూడు. పాతాళభైరవి. చంద్రహారం చిత్రాల రీ రికార్డింగులో ముఖ్య పాత్రవహించారు. ''విజయా"లో పని చేస్తూనే. ''సారథీ''వారి పిలుపు నందుకుని, "అంతామనవాళ్ళే"కి సంగీత సౌరభం చేకూర్చారు. సారథీవారి తరవాత చిత్రం "రోజులుమారాయి''కి, విజయా వారి అనుమతి లభించలేదు. అయిష్టంతో నే ''విజయా''ను వదిలి 'సారథీ' యూనిట్‌లో చేరి తన జానపద సంగీత పణితులతో పామర జనాన్ని సైతం పరవశింపజేశారు ఈ చిత్రంతో వీరి ''రోజులు మారాయి'' ఈ చిత్రంలో పనిచేసిన ప్రతీవ్యక్తికీ మారినట్టే. హీరో వెనకాల కర్రుచ్చుకు నించున్న ఆసామీవి నువ్వేగదంటయ్యా అని ''రోజులు మారాయి" ఫిల్ములో ఒకే ఒక ఫ్రేములో కనురెప్ప పాటుకాలంపాటు కనబడ్డ ఓవ్యక్తిని నిలదీసి చుట్టుముట్టి ప్రశ్నించారట బెజవాడ ప్లాట్‌ఫారంమీద పోగయినజనం. దీన్నిబట్టి అచిత్రం సాధించిన ఘనవిజయం అంచనా వేయగలం' దప్పుల డాన్సుచేసి గొప్ప మెప్పుబడసిన ఒప్పులకుప్ప శ్రీమతి వహీదారహమాన్ నేడు అంతర్జాతీయ తారగా మెరుస్తూవున్న విషయం అందరికీ విదితమే. ''ఏరువాకా'' పాటతో శ్రీమతి జిక్కి. శ్రీయుతులు కొసరాజు. చాణక్య. వేణు ప్రభృతుల కందరికీ పనిఎక్కువైంది. ఈపాట వరసని అనుకరించని అన్యభాషాచిత్రంలేదు. ఒక్క అరవంలోనే అయిదు చిత్రాల్లో అయిదు విధాలుగా రూపొందిందీగేయం. విజయఢుందుభి మ్రోయించిన ఈచిత్రం అనంతరం కాంట్రాక్టులుపైన కాంట్రాక్టులు చేకూరాయి వేణుకి.

"అంతా మనవాళ్ళే" చిత్రంలో 'బుర్రకథల' నాజర్ రాసిన 'వెళ్ళిపోదామా. మామా' అన్న పాప్యులర్ పాటకి, మిశ్ర ఝుంఝూటి' రాగంలో స్వరకల్పన చేశారు.

వీరు రాజమండ్రీ సెంట్రల్‌జైలు చూడ్డానికి వెళ్ళారట ఒకసర్యాయం. తెల్లారి ఉరిశిక్షకి గురికానున్న ఒక రాతిరి వ్యాపారి (దొంగ). తా వీలోకాన్ని వీడి పరలోకానికి పయనం కావలసిన తరుణ మాసన్నమాయెనన్న సంగతి తలుచుకుని, విదారిత హృదయుడై. తనలో తానే, 'వెళ్ళిపోదామా. మామా' అని గొణుగుతూ బొంగురుపోయిన గొంతుకతో ఆలపిస్తూవిలపించాట్ట. అదివిన్న వేణు మనసు అనుకంపతో కంపించిపోయిందట. అతగాడి (దొంగ) కేంతెలుసూ, తను ఆఖరిసారిగా పాడుకుంటున్న విషాదయుత గీతానికి సృష్టికర్త ఐన సంగీత బ్రహ్మ అక్కడే తనపక్కనే వున్నారనీ; ఇదో రకం డ్రామేటిక్ ఐరనీ.

ఇదేచిత్రంలో, తరుణ తారుణ్యతార శ్రీమతి జమునకి శ్రీమతి సుశీల పాడిన పాట. 'పాడినపాటేనా. ఇంకా పాత పాటయేనా' పాతదనంపై రోత కలిగించింది. 'రోజులు మారాయి' చిత్రానికి 'ఏరువాక' కాక కొసరాజు వ్రాసిన మరో హుషారైన. మాధవపెద్ది మజాగాపాడిన హాస్యగీతం 'ఎల్లిపోతుం డెల్లిపోతుంది—జోడెడ్లబండి'ని వేణు ముఖారి మిశ్రరాగమార్గాన ముచ్చటగా నడిపించారు. శ్రీ తాపీ వ్రాసిన 'ఇదియే హాయీ, కలుపుము చేయీ' అనే ద్విగళ గీతం మిశ్రమధ్యమావతిలో ఘంటసాల. జిక్కిలచేత కొత్త ఫక్కీలో ఖులాసాగా పాడించారు.' పెద్దరికాలు'లో జిక్కిబృందం వినిపించిన కొసరాజు గేయం 'పండగంటె పండగ. దీపావళి పండగ' వినీ. ఆనందించని వారి చెవులు వట్టి దండగ.



జడ్జి : ఇహ లాభంలేదు. రోడ్డుమీద మనుషులు నడవడం భయంగా తయారయ్యాయ్. నీ డ్రైయివింగ్ లైసెన్సు పీకేస్తున్నా.

డ్రైవరు : బాబ్బాబు ; నాబతుకంతా దానిమీద ఆధారపడివుందిబాబూ.

జడ్జి : వాళ్ళసంగతీ అంతే

"తోడికోడళ్ళు"లో శ్రీ ఆత్రేయ కూర్చిన "కారులో షికారుకెళ్ళే పాలబుగ్గల పసిడి చాన'' అనే పసిడిగీతం వింటూ. అదే కారులో, ఆ బంగారు భామతో షికారు పోవాలనిపిస్తుంది. సుశీలబృందం అందంగా ఆలపించిన "గాలిపటం" పాట శ్రోతల మానస 'వాయుచిత్రాలని అనంతానందాకాశంలోకి ఎగురవేస్తుంది. సుశీల, ఘంటసాలల "ఆడుతు పాడుతు పనిచేస్తుంటే" పాటవింటూ పనిచేస్తుంటే అలుపు సొలపుల కలనైనా తలపరెవరుగానీ. — శ్రీ శ్రీ కలంపదునుగా పలికించిన "కలకాలమీ కలత నిలిచేదికాదు" అనే సుశీల సోలో ''పీలూ" రాగానికే "సీలు" వంటిది. కలత సెలవతీసుకు పోవచ్చుగాని ఈగీతం మాత్రం కలకాలం నిలిచేదే.

"మాంగల్యబలం'' మంచిసంగీత బలం కల ఫిలిం. శ్రీశ్రీ గేయం "తెలియని ఆనందం" సుశీలగారు "తిలక్ కామోద్''లో తెలియజేశారు. తొలివలపు పిలుపుగోలుపు తీయనిహాయిని వెలయిస్తుందీమోహనగానం. కొసరాజు కొసరిన కామెడీసాంగ్‌లో "మైడియర్ మీనా, మహామంచిదానా" అని మాధవపెద్ది సత్యం జోరుగా దాయబోగా: మీనా "మైడియర్‌సారూ, తగ్గించు జోరూ" అని అతని జోరును తగ్గించే పట్టానికి దిట్టమైన మట్టుకట్టారు వేణు. శ్రీశ్రీశ్రీ మనకందరికీ అందించడానికని "ఆకాశ వీధిలో" నుంచి దించిన "అందాల జాబిలి" సుశీలా, ఘంటసాలల గళాలనుండి వెలువడి చల్లని వెన్నెల చిలకరించారు మధ్యమావతీ రాగకిరణాలద్వారా. "వాడినపూలే వికసించెనే" అనే "లక్ష్మీ ద్వయుని" గేయానికి, "పీలూ", "నటభైరవి" రాగాల స్వరాల సుగంధాన్ని చేకూర్చి, వరసకూర్చి, మంచి పాటలు వినబడని కారణంగా వాడిన శ్రోతల హృదయ కుసుమాల్ని వికసింపజేశారు వేణు.

"సుకేశి'' అనగా 'చారుకేశి' రాగం - వీరి కత్యంత ప్రీతిపాత్రమైనదని తోస్తుంది. ఆ రాగం వీరి కల్పన కతన - వింత సొబగులు తీర్చి దిద్దుకుంటుంది సుమధురస్వర దర్పణంలో. 'రాజమకుటం'లో లీలా ఘంటసాలల 'ఊరేది పేరేది ఓచందమామా'పాట వింటే ప్రజలు తమ ఊరూ పేరూ మరిచి పోయేంతటి తన్మయావస్థలో పడిపోతారు. తిరిగి 'సిరిసంపదలు'లో జానకీ ఘంటసాల లాలపించిన 'ఈ పగలు రేయిగా పండు వన్నెలగ మారినదేమిచెలీ - ఆ కారణమేమి చెలీ' అనే గీతంకూడా చారుకేశిలోనే చేశారు. ఈ రాగంలో, ఘంటసాల గానాని జానకిగారి ఆలాపనలు వెండి అంచులు.

'సిరి సంపదలు' స్వరసంపదగలచిత్రం. 'వేణుగానమ్ము వినిపించెనే చిన్నికృష్ణయ్యకనిపించడే' అని గాయనీత్రయం (జిక్కీ, సుశీల, జానకి), త్రివేణీ సంగమంలోని నదీత్రయం (గంగా యమునా సరస్వతుల)వలె కలిసి, కమ్మగా ఆలపించిన 'జయ జయవంతి' మధురస స్రవంతి. 'పువ్వు నవ్వేను, పున్నమి నవ్వేను. నవ్వలేక నేనున్నాను,' అని జానకిగారి విరహానల వ్యాకులమైన ఎదద పదే బెదద తెలుగు గేయం, వినేగుండెకు తగిలేమాయనిగాయం, మనశ్శాంతికి కలిగించే అంతరాయం అనుభవైక వేద్యం. ఈ సాహిత్యంలోని అనవద్య భావాధిక్యం శ్రీ ఆత్రేయగేయరచనా ప్రాభవాని కొక మహోన్నత నిదర్శనం. సంగీతంలోని సందర్భోచిత్యం. "వేణు" సామర్థ్యాని కొక ఉదాత్తమైన ఉదాహరణం. జానకిగారి గానం, సంగీత సరస్వతి కొక అమూల్యాభరణం. "దాటసారి"లో శ్రీమతి భానుమతి "జయ జయ వంతి"లో అతి మధురంగా, వీనులవిందుగా గానంచేశారు. "లోకమెరుగని బాలా" గీతాన్ని "నమ్మినబంటు"లో సుశీలా ఘంటసాలల స్వప్నయుగళగీతం "ఎంతమంచివాడవురా" "నటభైరవి" రాగంలో సాగింది. ఈ గీతం విన్నవారి హృదయవీణ కూడా, మ్రోగింది. వీరి ఇటీవలిచిత్రం 'పద్మశ్రీ' వారి "మురళీకృష్ణ''లో నాట్యతార శ్రీమతి గీతాంజలికి జానకిగారాలపించిన "మ్రోగునా ఈ మధురవీణ'' సింధుభైరవి, భాగేశ్రీ, చంద్రకౌంస్ రాగమాలికాలంకృతగీతిక, మధుర స్వరమణీ భూషిత స్వర్ణమయా విపంచిక "నీసుఖమే నే కోరుతున్నా'' అన్న ఘంటసాల నేపథ్యగీతిక, మధ్యమావతి రాగానికే మచ్చుతునక. "పీలూ'' ఆధారంగా శ్రీమతి సుశీల పలికిన గీతం "వస్తాడమ్మా నీ దైవం'' కోకిల కలరవం తీరని తీయని కలవరం. "హరికాంభోజి" మేళంలో సుశీలగారేమని ఏమని అనుకొంటున్నదీ, ఆ పాట విన్నవారికిగాని అవగతం కాదు.

నేను వీరి సంగీత దర్శకత్వంలో పాడిన పాటలు, సంఖ్యలో అత్యల్పాలు. కాని, విషయంలో అనల్పాలు, నిర్వికల్పాలు (తిరుగులేనివి). మొదట్లో వీరు నాచేత ఒక బేసిక్ రికార్డు యిప్పించాలని "యదుకుల సాగరచంద్రా" అనే గీతం అద్భుతంగా సంగీతీకరించారు. రిహార్సల్సుకూడా రెగ్యులర్‌గా చేశాం. కాని ఆనాడు మేమారంభించిన గీతం ఈనాటికీ అనంతంగా నిలిచిపోయింది, అసంపూర్ణంగా.

"సోమవారమహాత్యం"లో నేను జానకిగారూ పాడిన "మధురా సురాగం", 'రాగ సుధాచంద్రమా' అన్న ద్వంద్వ గీత ద్వయం అద్వితీయం. ఈ రెండు గీతాలూ, సంగీతాయ స్కాంతాలు. "జల్సారాయుడు"లో జల్సారాయుడు - శ్రీ జగ్గయ్యకి నేనూ, జల్సారాజ్ఞి' శ్రీమతి జమునకి శ్రీమతి జిక్కీ ఆలపించిన "అందాలసీమలో చందమామకాంతిలో ఆడుకుందాం పాడుకుందాం" గీతం డెందానా్నానందంతో కదళింపజేస్తుంది. భరణీవారి 'చాటసారి' కని నేనూ శ్రీమతి జమునారాణీ పాడినపాట పిక్చర్లో కట్టయినా (Cut) మంచిహిట్టై కూర్చుంది రేడియో ధర్మమాఅని. "ఇరుగుపొరుగు"లో జిక్కీ, శ్రీనివాసుల అంతర్నాటక సంగీతం వరరాగసంశోభితం. "కోటకు వచ్చిందొక చెలియా దాని దొరవయసుపై నామనసు'' అని జానపదరీతిని ప్రారంభమై, మధ్యలో మార్పులు చెంది. "గోదావరికిపోయి, గోవిందునకు మ్రొక్కి'' సాగి "నీవు నేనూకలిసి, నీటిలోపలకరిగి, ఏకమైపోదాము'' అని అఖరికి బరువెక్కిన హృదయాలతో ఆలపింపబడిన ఈ విషాదాంతపు శోకగీతం వింటే కన్నీరు మున్నీరుగా ప్రవహిస్తుంది.

శ్రీ ఎన్. టి. రామారావుగారికి నేనూ, శ్రీమతి కృష్ణకుమారికి శ్రీమతి జానకిగారూ కలిసి ఆలపించిన "సన్నజాజి తోటలోన చల్లగాలివీచెను" విన్న ప్రతి హృదయం లోనూ వలపు తుపానురేగుతుంది. అదే జంటకిదే జంట పాడిన జంటపాట "వా రే వా జోరు హై'' భలేజోరుఅంటే కాదనలేరెవరూ. అనాడు బృందావనిలో మురళీకృష్ణుని మోహనవేణుగానం విని పరవశించిన గోప గోపీజనంలా, ఈనాడు శ్రీ వేణు గానం విని భారతావనిలోని ఆబాల గోపాలం అమందానందమునందుచుందురుగావుత !



"ఈలోకంలోపనికిరానిదంటూ ఏదీ లేదనుకో, ఆఖరికి ఆగిపోయిన గడియారంకూడా రోజుకి రెండుమాట్లురైటు"

ooo

చిత్రరథుని

చైత్రయాత్ర

"కలవారి కోడలు"

రఘురాం వారి "కలవారి కోడలు"లో మృదువైన కథనం, మధురమైన సంగీతం ప్రత్యేకత. పాత్రలలో కాని, పరిణామాలలో కాని, అభినయంలో కాని మొరటుదనం, కరకుదనం, వెకిలితనం లేకపోవడం యీ చిత్రం విశిష్టత. కథ మొదలైనది మొదలు ముగిసేవరకు సాఫీగా, సుతి మెత్తనగా సూటిగా సాగిపోతుంది.

ప్రస్తుతపు తెలుగు సినిమా రంగానికి ఈ లాలిత్యం ఒకవిధంగా అలంకారమే. అయితే ఈ లాలిత్యంలోనే మరికొంత సొగసు, ఇంకొంతపదును, అదనపు అందం ఇమిడివుంటే హేమాంబరధరరావు చిత్రం మరింత హృద్యంగా వుండి వుండేది.


చిత్రం చిన్నది. కథ కొంత ఆలస్యంగా ప్రారంభమౌతుంది. మెల్లగా, చల్లగా అన్నీ కూడి ఒక్కసారి అగ్నిపర్వతం బ్రద్దలై పట్టవుతుంది.

శంకర్ (పభాకరరెడ్డి) వైణికుడు, సోదరి లత (కృష్ణకుమారి). ప్రాణస్నేహితుడు, కలవారిబిడ్డ డాక్టర్ ఆనంద్ (ఎన్. టి. రామారావు).

మైసూర్‌లో వీణా వాద్య పోటీలకు బిల వంతంచేసి ఆనంద్ శంకర్‌ను పంపుతాడు. బిరుదుపొందిన శంకర్ రేడియోగోష్ఠిలో ఆనంద్‌కు, లతకు అభివాదాలు తెల్పుతాడు.

ఇంటికి రానున్న శంకర్‌కు ఓ పూల దండ బహూమతియిచ్చేందుకు ఒకవైపు నుంచి ఆనంద్, హారతి అర్పించేందుకు ఇంకోవైపునుంచి లత వస్తారు. తొలిసారి ఆనంద్, లతలు ఒకరికళ్ళను ఒకరు, ఒకరి హృదయాన్ని ఇంకొకరు శోధించారు. ఫలితం నవప్రేమికులు పొందగల ఆనందం. వారిచెంతకు శంకర్ రాలేదు. దోవలో ప్రమాదంలో మరణించిన శంకర్ భౌతిక కాయంమాత్రం వచ్చింది. శంకర్ మృతికి పరోక్షంగా తానే కారకుడని యెంచిన ఆనంద్, అబల లతజీవిత లతకు తను ఆలంబనకాదలచాడు.

కాని అమ్మ రాజ్యలక్ష్మి (హేమలత) వేరొకవిధంగా తలచింది. తన సోదరుడు శివానందం (రమణారెడ్డి) పెద్దకూతురు రాణిని (గిరిజ) తమ గృహరాణిగా చేసుకొనేందుకు మాటయిచ్చింది. మనసు, మమతలలో మిట్టపల్లాలు లేకపోయినా ఆస్తులూ, ఆనందాలలో వాటిని పసిగట్టిన లత ఈ కలవారింటికి దూరమైంది. రైలు ప్రమాదంలో మరణించింది. అమ్మకైనా శాంతియిద్దామని రాణిని పెండ్లి



పద్మినీ పిక్చర్స్‌వారి "కర్ణ"లో శివాజీ గణేశన్,
ఎన్. టి. రామారావు.

చేసుకున్న ఆనంద్‌కు పూర్వాలోచనలతో అశాంతిమాత్రం మిగిలింది. రాణికి అనలే అనుమానం. అందులో అసూయ కలిసింది. రైలుప్రమాదంనుంచి బ్రతికి బైటపడి ఒక క్రిస్టియన్ ఫాదర్ (శ్యామలరావు) సహాయంతో ఆనంద్‌వద్ద చేరి పునరుజ్జీవనం పొందిన లతను చూసేసరికి రాణి అనుమాన అసూయలకు పగ సెగకొట్టింది. ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు, ఒక దేవుడు, ఒక దేవత, ఒక రాక్షసి. కథ చివరకు వచ్చేసరికి రాక్షసి రాక్షసకార్యమే చేసింది. ఎవరిపైనా అన్న రఘురాంవారు, ఒక మెలికతో చూపారు.

మంచిచెడ్డలు

లతను దగ్గరకు తీసుకొన్న ఆనంద్ ఆనందసీమలో విహరించడం తప్పితే బాధ్యతాయుతమైన కర్తవ్యమేదీ నిర్వహించినట్లు తోచదు. రైలుప్రమాదంలో లత మరణించిందన్నమీదట సాక్ష్యాధారాల అన్వేషణకు వెళ్ళకపోవడం సముచితంగా తోచదు. లత కోసం ఆనంద్ కష్టించింది కాని, బాధ



"కర్ణ"లో సావిత్రి.

పడింది కాని 'పిక్టోరియల్'గా చూపక పోవడంవల్ల సినిమాలు సగభాగం హెపీనెస్ లేకుండా పోయింది. తల్లీ బిడ్డల మధ్య కాని, ప్రేమీ ప్రేమికులమధ్యకాని, యువతీ ద్వయంమధ్యకాని తీవ్రమైన సంఘర్షణలను సృష్టించిన కథ నడిపిస్తే రఘురాం ద్వితీయ చిత్రంఈరీతిచిత్రాలలో అద్వితీయమయ్యేది. ద్వితీయార్థంలోనవదంపతుల(ఆనంద్,రాణి) యింటిలోవున్న లత ఆనంద్‌తో కారులో షికార్లకు వెళ్ళడం ఏ పాత్రకూ సముచితం కాదు. దానిపై రాణి ఏ పని చేసినా రాణిం చేదే అవుతుంది ఒకవిధంగా. అలాకాక వివాహితుడైన ఆ న ం ద్, పూర్వసాన్ని హిత్యంకొద్దీ లతతో చనువు పెంచుకోగా, ఆమె దూరం కాదలచినప్పుడు, ఆ విషయం తెలుసుకొనని అబల, రాణి ప్రతిబలకార్యానికి దిగిందన్నా అర్థంవుంటుంది.

కథాగతిలో ఇటువంటి స్వ ల్ప మై న గతుకులువున్నా మనోరంజకత్వానికి లోటు లేదు.

పూలదండ, కర్పూరంలతో, ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ నవదంపతుల ఫొటోలతో, పల్లెపిల్లాడు పిల్లా_పటంతో, విషం కాఫీ గ్లాసు మార్పిడితో దర్శకుడు చిత్రానికి పెట్టిన వన్నెలు మెచ్చదగినవి. హాస్యం చిత్రంలో కలవక పోయినా పాత్రోచితంగా వు న్న ం దు న విన్నంతవరకు, చూచినంతవరకు చాలా హాయిగా వుంటుంది. టి. చలపతిరావు సంగీతం మిక్కిలి అహ్లాదకరం. చిత్రం ఉత్తమ లక్షణాలలో ఇది ఒకటి.

సాంకేతికంగానేమి, అభినయ ప్రమాణంలోనేమి నాల్గింట మూడువంతుల సంతృప్తినిచ్చే 'కలవారి కోడలు' కళాబృందం వివరమిది:

నిర్మాత, దర్శకుడు—కె. హేమాంబరధరరావు, సహ నిర్మాత — ఎ. పూర్ణ చ ం ద్ర రా వు, క థ, మా ట లు — నార్ల చిరంజీవి, సంగీతం: టి. చలపతిరావు, ఛాయాగ్రహణం: ఎమ్. జి. సింగ్, కళ: బి. యన్. కృష్ణ, ఎడిటింగ్: బి. గోపాలరావు, స్టూడియో: వీనస్, కళాకారులు: రామారావు, కృష్ణకుమారి, రమణారెడ్డి, సూర్యకాంతం, గిరిజ, గీతాంజలి, పద్మనాభం అండ్ చలం.

చివరివ్యక్తి నటన ఒక కంట కనిపెట్టి చూడవచ్చు.

రఘురాం ప్రోగ్రెస్ కార్డులోకి గుడ్, బెటర్ ఎక్కినవి. 'బెస్ట్' 'మస్ట్'గా రావాలి.



బాబూ మూవీస్ వారి "తేనెమనసులు" ప్రారంభోత్సవం సందర్భంలో ఆదుర్తి సుబ్బారావు, దుక్కిపాటి మధుసూదనరావు, సావిత్రి, కాట్రగడ్డ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు ప్రభృతులు.

బా బూ మూ వీ స్ న వ శ క చి త్రం

"లవకుశ" రంగులశకం ప్రారంభమైన ఒక సంవత్సరం లోపుగానే ఇంకో యుగం ప్రారంభమౌతుందని ఎవ్వరూ ఊహించలేదు. క్రొధిపలికిన నవశకం నూతన తారా పరిచయం. సినిమాలో పూర్వానుభవం ఓ బ్రహ్మాండమైన అర్హతగా, యెంచుతున్న ఈరోజుల్లో ఆదుర్తి, సుందరంగార్లు అదే బ్రహ్మాండమైన "అనర్హత"గా చేసివేశారు.

మార్చి 16 వ తేదీ ఉదయం గం. 9.05 నిమిషాలకు హైదరాబాద్ శ్రీ సారధి స్టుడియోస్‌లో బాబూమూవీస్‌వారు "నవశకోదయం" గావించారు. తమ మూడవచిత్రం "తేనె మనసులు" నిర్మాణానికి ఉపక్రమించారు. సినిమారంగు (గ్రీజ్ పెయింట్) పూసుకోని 4000 మంది అభ్యర్థులనుంచి నటీనటులను ఎన్నుకొంటున్నారు. ఈవరకు ఎన్నడూ సినిమాలో క ని పి ం చ ని వా రే ఇందులో నటించేందుకు అర్హులు. ఏ రంగంలో అయినా ఆంధ్రులు చెయ్యక చెయ్యక చేసే యత్నం అద్వితీయమైనదై వుంటుంది. బాబూ మూవీసువారి ఈ 'బా బు లా ం టి' యత్నం బహుశా ప్ర పం చ చలన చిత్ర చరిత్రలోనే అపదృశం. ఇప్పటికి నాలుగు వేల దరఖాస్తుదారులనుంచి ఐదారుగురికి

హైదరాబాద్ శ్రీ సారధి స్టూడియోస్‌లోనే స్క్రీన్ టెస్ట్ జరిపారు. కొలది దినాలలో అంతిమ నిర్ణయాలు జరుగుతవి.

"కొత్తముఖాల"కోసం ప్రకటనలువచ్చిన రెండు వారాలలో 4000 దరఖాస్తులు రావడమే ఆశ్చర్యం. అందులో చాలామంది సమర్థులు. పనికివచ్చేవారు. పైకి రాగలవారు వుండడం మరింత ఆనందదాయకం.

స్కోరుబోర్డు ఖాళీగావున్న నటీ నటులకు 110 అయి 'సిక్సర్'తో 116 చేసుకొంటున్న 'అమెరికా బౌండ్" అక్కినేని నాగేశ్వరరావు ఆశీస్సులు పలికారు. బాబూవారి ఉద్యమం ఫలించాలంటూ 'స్కోరు' బోర్డులో బాబూమూవీస్ పరంగా 'బోణీ' చేసినవారిలో అతి సమర్థులకు "విశాల నేత్రాలు చిత్రంలో ఛాన్స్ ఇస్తానన్నారు.

అమెరికానుంచి తిరిగివచ్చేలోపుగానే "తేనెమనసులు" పూర్తిఅవుతోంది. ఈలోగా హీరో నాగేశ్వరరావు "విశాల నేత్రాలు"కు చేసే సెలక్షనులకు హీరోయిన్ సావిత్రి తగు ప్రాతిపదిక వేయబోతున్నారు. 16 వ తేదీ నిర్మాణ కార్యక్రమానికి సావిత్రి ప్రారంభోత్సవంజరిపారు. "తేనెమనసులు" కళాకారులకు తర్ఫీదుయిచ్చే భారం ఆమె వహించారు. ఈ విధంగా సారథి సినిమా శిక్షణకేంద్రంకూడా కాబోతున్నది.

బాబూవారి చిత్రాన్ని శ్రీయుతులు దుక్కిపాటి మధుసూదనరావు. శ్రీ వై. వి. రామకృష్ణప్రసాద్ మున్నగువారు ఆశీర్వదించారు "తేనెమనసులు" దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు నిర్మాత సి. సుందరం. ఉద్వేగ ఉల్లాసాలు పందెపుగుర్రాలులా పరుగిడేటట్లు స్క్రిప్టు 'కోర్సు'ను ముళ్ళపూడి వెంకటరమణ నిర్మించారు. సంగీత శాఖకు కె వి మహదేవన్, ఛాయాగ్రహణశాఖకు పి.ఎల్. రాయ్ ఆధ్వర్యం వహిస్తారు. బాబూమూవీస్ వారు తేనెటీగల దరఖాస్తులు కూర్చిన తేనె తీసి తెలుగు తేనెమనసులకు తనివితీర యివ్వగలరని ఆశించుదాము.

విదేశాలకు "మూగమనసులు"

ఇండియా ఎక్స్‌పోర్ట్ కంపెనీవారు విదేశాలలో విడుదలకు "మూగమనసులు" తీసుకొన్నారు. బాబూ మూవీస్‌వారి చిత్రానికి ఆదుర్తి దర్శకులు. రచన ఆత్రేయ, ముళ్ళపూడి. సంగీతం మహదేవన్.

ప్రత్యగాత్మ కొత్తచిత్రం

ఛాయాచిత్ర అనే కొత్తసంస్థ సాంఘిక చిత్ర నిర్మాణం వాహిని స్టూడియోస్‌లో మార్చి 20 వ తేదీ ఉదయం 9-15 గంటలకు ప్రారంభమైంది. కె. ప్రత్యగాత్మ దర్శకులు. సినిమా పెద్దలువచ్చి ఛాయా విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. చిత్ర నిర్మాతలు: కె. సుబ్బరాజు, టి. చలపతిరావు సంగీత దర్శకత్వంకూడా వహిస్తారు. ఎస్. రాజేశ్వరరావు కొన్ని పాటలకు సంగీతం సమకూర్చుతారు. రామారావు, జగ్గయ్య, జమున, గుమ్మడి, పద్మనాభం, గీతాంజలి, హేమలత, మిక్కిలినేని, తారాగణంలో కలరు. రచన : పినిశెట్టి, ఛాయ : ఎమ్. కె. రాజు, కళ : కృష్ణారావు, సంపుటీకరణ : సంజీవి.

డాక్టర్ చక్రవర్తి

అన్నపూర్ణావారి "డాక్టర్ చక్రవర్తి" చిత్రంలో మార్చినెలలో హాస్యద్వంద్వగీత చిత్రీకరణ శ్రీ సారథి స్టూడియోలో జరిగింది. ఎస్. జానకి, పి. బి. శ్రీనివాస్ పాడిన ఈ పాటను జయంతి, పద్మనాభంలపై చిత్రీకరించారు. పాటను వ్రాసినది కొసరాజు. ఆత్రేయ, శ్రీ శ్రీ, ఆరుద్ర దాశరధి వ్రాసిన పాటలకు రాజేశ్వరరావు స్వరకల్పన చేయగా ఈవరకే తెరకెక్కించారు. పోతే ఎనిమిదవపాట (ఇదే చివరిది) రికార్డు కావలసివున్నది. నాగేశ్వరరావు, సావిత్రి ముఖ్యపాత్రలు ధరించిన ఈచిత్రం తారాగణంలో యింకా జానకి, జగ్గయ్య, కృష్ణకుమారి (గెస్ట్) గుమ్మడి, గీతాంజలి, చలం, పద్మనాభం, జయంతి, మురళీకృష్ణ, సంగమేశ్వరరావు కలరు. శ్రీమతి కోడూరు కౌసల్యాదేవి నవల"చక్రభ్రమణం"కు గొల్లపూడి మారుతీరావు అనుకరణ చేశారు. ఆత్రేయ సంభాషణలు సమకూర్చారు. ఛాయ సెల్వరాజ్, కళ - సుబ్బారావు, నృత్యకళ- వసుమర్తి. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు. నిర్మాత డి. మధుసూధనరావు.

జక్కన్న వర్ణశోభ

తెలుగులో మొట్టమొదటి సంపూర్ణ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం "అమరశిల్పి జక్కన్న" వర్ణశోభ గురించి ప్రత్యేక వార్తలుఅందినవి. కొత్తగా సెన్సార్ అయిన రెండు నృత్య గేయాలకు పాట, దానిని మించిన నృత్యం. వాటిని మించి చక్కటి రంగులు అమరినట్లు రూఢిగా తెలియవచ్చింది. బి. సరోజాదేవి, నాగేశ్వరరావులపై వాటి చిత్రీకరణ జరిగింది. ఈ చిత్రంలో యింకా హరనాథ్, నాగయ్య, సూర్యకాంతం, గిరిజ, రేలంగిమున్నగువారు



"శ్రీ సింహాచలక్షేత్ర మహాత్మ్యం"లో కాంతారావు, కృష్ణకుమారి.

నటించారు. రచన సముద్రాల. దర్శకుడు, నిర్మాత బి. ఎస్. రంగా.

చంద్రహాస

బి. ఎస్. రంగా, బహుశా వేరొక బ్యానర్‌లో 'చంద్రహాస' తీయ సంకల్పించినట్లు రూఢిగా తెలియవచ్చింది. ఈ చిత్రం పిమ్మటనే "క్షేత్రయ్య" నిర్మాణానికి ఉపక్రమిస్తారు.

శ్రీరామనవమికి నవగ్రహ పూజామహిమ

విఠల్ ప్రొడక్షన్స్ "నవగ్రహ పూజా మహిమ" షూటింగ్ మార్చి మూడవ వారంలో ముగిసింది. శ్రీరామ నవమికి విడుదల చెయ్యాలని దర్శక నిర్మాత విఠలాచార్య సంకల్పించారు. ఈ చిత్రానికి కృష్ణమూర్తి సాహిత్యం సమకూర్చారు. తొలిసారి వాసంతి నాయిక భూమికధరిస్తున్నారు. నాయకుడు కాంతారావు.

రామారావు ద్విపాత్రాభినయం చేస్తున్న అపూర్వసోదరుల కథనుకూడా విఠల్ ప్రొడక్షన్స్ తెరకెక్కిస్తున్నది. ఎనిమిది రీళ్ళకు పైగా చిత్రం తయారైంది. మే, జూన్‌లకు చిత్రం సర్వసిద్ధమౌతుంది. నాయిక కృష్ణకుమారి. ఛాయ రవికాంత్. రచన కృష్ణమూర్తి.

విఠలాచార్య తదుపరి చిత్రాలు

విఠలాచార్య ప్రస్తుతం డైరెక్ట్ చేస్తున్న రెండు చిత్రాల పని పూర్తి కాగానే వేరొక సంస్థకు "మంగమ్మ శపథం" స్వంత సంస్థకు ఒక అద్భుత జానపదం, ఈ రెండూకాక ఒక డిటెక్టివ్ చిత్రం తీయవలచారు. 1964 ద్వితీయార్థం షెడ్యూల్‌క్రిందకు ఈ మూడు చిత్రాలూ వస్తవి.

కొత్త చిత్రాలు

ఆత్రేయ స్వంత బ్యానర్ తో "లేత మనసులు" నిర్మించేందుకు స్క్రిప్టు సిద్ధం చేశారు.

అనురూపావారు "పల్నాటి వీరకథ" అనే "నాయకురాలు నాగమ్మ" తీయ సంకల్పించారు. భానుమతి, రామారావు ప్రధాన పాత్రధారులు. రచన: సదాశివబ్రహ్మం. దర్శకుడు: రామినీడు. నిర్మాతలు: టి. హనుమంతరావు, డి. సూర్యనారాయణ, వై. లక్ష్మయ్యచౌదరి.

పి. ఏ. పి. వారి చిత్రానికి సదాశివబ్రహ్మం స్క్రిప్టు తయారుచేస్తున్నారు. నాగేశ్వరరావు, కృష్ణకుమారి ప్రధాన పాత్రధారులు. దర్శకుడు: ప్రత్యగాత్మ, నిర్మాత: ఏ. వి. సుబ్బారావు.

విజయవాడలో శ్రీ వెంకటేశ్వరపిక్చర్సు అనే కొత్త ఫిలిం సంస్థ నెలకొల్పబడింది. వారి చిత్రంలో నాగేశ్వరరావు నటిస్తారు. తారాగణం, సాంకేతికవర్గం నిర్ణయమౌతున్నది.

"మహామంత్రి తిమ్మరుసు" నిర్మాతలలో ఒకరైన పుండరీకాంక్షయ్య 'ప్రతాపరుద్రీయం' తీయతలపెట్టారు. రామారావు ముఖ్యనటుడు.

విజయవారు శ్రీ కె. వి. రెడ్డి దర్శకత్వంలో 'హరిశ్చంద్ర' నవ్యపంథాలో నిర్మించబోతున్నారు. శ్రీ పింగళి నాగేంద్రరావు సుదీర్ఘ సాహిత్య పరిశోధనలు జరిపి స్క్రిప్టు పని పూర్తిచేస్తున్నారు. రామారావు హరిశ్చంద్రుడు.

పింగళి పాళీ ఇంకొక కొత్తపథంలో వెళ్ళనది "ప్రమీలార్జునీయం". చిత్రంలో మూడవంతు తయారైంది. దర్శకుడు ఎమ్. మల్లికార్జునరావు. రామారావు, సరోజ, రేలంగి, పద్మనాభం, కాంతారావు, శోభన్‌బాబు మున్నగువారు తారాగణంలో కలరు. సంగీతం పెండ్యాల.

అతిత్వరలో రాగల చిత్రాలు

రామారావు తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తున్న సురేష్ ప్రొడక్షన్స్ 'రాముడు - భీముడు' బహుశా ఏప్రిల్ లో విడుదల కావచ్చు. ఛాయ అన్నయ్య, రచన నరసరాజు, దర్శకత్వం చాణక్య, నాయిక జమున నిర్మాత డి. రామానాయుడు.

శ్రీ సరస్వతి మూవీస్, శ్రీ వెంకటేశ్వర ఫిలిమ్సు 'శ్రీ సింహాచల క్షేత్ర మహిమ' కూడా ఏప్రిల్‌లోనే భక్తదర్శనం చేసుకోవచ్చు. దర్శకుడు బి. వి. ప్రసాద్, సంగీతం టి. వి. రాజు, కాంతారావు, కృష్ణకుమారి ప్రధాన పాత్రధారులు.

విశ్వశాంతివారి 'ఎవరు దొంగ?' ఏప్రిల్ లోనే అన్వేషణ ప్రారంభించవచ్చు.

శ్రీరామా పిక్చర్స్‌వారి 'దేశద్రోహులు' కూడా అద్యతన భావిలో విడుదలవుతున్నది.



ఫిల్మిస్తాన్‌వారి "హంకహాఁ జారహేహై"లో హరనాథ్, నీనా

"సిక్టా" రవి అస్తమయం

దక్షిణభారత సినీ టెక్నిషియనుల సంఘం (సిక్టా) కార్యసారధిగా, ముఖ్య కార్యకర్తగా వుండి, ఆ హోదావల్ల కొన్ని సినిమా అవకాశాలు పోగొట్టుకొని, త్యాగిగా పేరొందిన బందరు పట్టభద్రుడు సత్యవీస్ రజనీకాంత్ మార్చి 16 వ తేదీ అర్ధరాత్రి పిమ్మట మద్రాసులో అకాలమరణంచెందారు. ఎల్. వి. ప్రసాద్‌కు సహాయ దర్శకుడుగా పనిచేసి, "పిచ్చిపుల్లయ్య", "నిరుపేదలు" చిత్రాలకు దర్శకుడు తాతినేని ప్రకాశరావుకు తలలోని నాలుకగా వ్యవహరించి, ఆ తదుపరి "వదినగారి గాజులు", "కనకతార", "బలేబావ", "దీపావళి", "సతీ సులోచన" చిత్రాలకు స్వయంగా దర్శకత్వం వహించిన రజనీకాంత్ గత 15 వ తేదీనే కొత్త చిత్రం ('శ్రీ సత్యనారాయణ మహాత్మ్యం') దర్శకత్వం ప్రారంభించారు. రామారావు, కృష్ణకుమారి అందులో ప్రధాన పాత్రధారులు. రెండవరోజు షూటింగ్ పిమ్మట:రక్తపుపోటు విపరిణామాలకు గురై కొద్దిగంటలల్లోనే మరణించారు.

టెక్నిషియనుల శక్తి తారాగణం శక్తికి మించినదవి. టెక్నిషియను లెవ్వరికీ తలవంచ నవసరంలేదని, శిక్షణ సంస్థలు లేనందువల్ల టెక్నిషియనులు ఏకలవ్యులవలె

తమకు తామే విజ్ఞానాభివృద్ధికి అనుక్షణం కృషిచెయ్యాలని, ఒక టెక్నీషియను మరొక టెక్నీషియను అవకాశాలకు, అభివృద్ధికి అడ్డురాకూడదని కాంతి సూత్రాలను రవని బోధించి నిత్యజీవితంలో ఆచరించారు. 38 వ ఏటనే భార్యను, ముగ్గురు పిల్లలను, వేలాది కళాభిమానులను దుఃఖ సముద్రంలో విడిచి 'రవి' అస్తమించారు.

అమెరికా ఆస్కార్ల సంగీత నృత్య చిత్రం

తుంటరి యువకులపైతీసిన "వెస్ట్ సైడ్ స్టోరీ" ఈమధ్య మద్రాసులో ప్రదర్శించబడింది. అల్లరచిల్లరగా తిరిగి కొట్లాటలే జీవితమైన 14 - 17 సంవత్సరాల వయసు కలవారే ఈ చిత్రంలోని నటీనటులు. ఇంత తక్కువ వయసు నటులైనా ఇద్దరికి (సహాయనటుడు జార్జి ఛకిరిస్‌కు, సహాయ నటి కుమారి రిటా మొరెనోకు) ఆస్కార్ బహుమతులు సంపాదించుకోగలగడం విశేషం. రౌడీ బ్రతుకు వలదని, నవయువకులను హెచ్చరించే ఈ చిత్రం మన దేశంలో వయోజనులుమాత్రమే చూచేందుకు సర్టిఫికెట్ పొందింది. అంటే ఎవరికైతే చిత్రం ఉద్దేశించారో వారు చూడ వీలులేదన్న మాట!

చిత్రంలో అత్యధికభాగం రాత్రిదృశ్యాలు కలిగివుండడం, యాక్టింగ్, ఫైటింగ్ కూడా నృత్య సంగీత ధోరణిలో సాగడం, ఎప్పటిప్పటి లొకేషన్‌లలో తీసిన ఘట్టాలనో వేగంపెంచి పొందికగా మార్చడం, ఛాయాగ్రహణం, నటీనటులందరు, ముఖ్యంగా పైన పేర్కొన్న యిద్దరు విశిష్టంగా నటించడం మొత్తంమీద దర్శకత్వం, సంగీతం చాలా ఘనంగా వున్నాయి.

బ్రాడ్వేలో విశేష విజయం సాధించిన సంగీత నాటకం ఆధారంగా యీ సినిమా తీసినందువల్ల చాలా అసందర్భాలు కూడా దొర్లాయి. నిశ్శబ్దం అవసరమైనచోట్ల పాటలు, శోకం, ఉద్వేగం ప్రధానమైన చోట్ల పాటలు చిత్రానికి చెడగొట్టాయనే చెప్పక తప్పదు.

1961 లో మిరిష్ పిక్చర్స్‌వారు పానావిజన్ 70 స్క్రీన్ లో టెక్నికలర్‌లో నిర్మించిన ఈచిత్రం న్యూయార్క్ లోని వెస్ట్‌సైడ్ విభాగంలో 'జెట్స్' ముఠాకు, ప్యూర్టోరికో (లాటిన్ అమెరికా) సంతతి వారైన షార్క్ ముఠాకుమధ్య నిత్యసంఘర్షణల విషాద పరిణామాలను చిత్రించింది. 'జెట్స్' ముఠావారి అభిమానాన్ని చూరగొన్న శాంతివాది, షార్క్ ముఠా నాయకుడు బెర్నార్డో (జార్జి చకిరిస్) సోదరి మారియాను (నాటలీవుడ్) ప్రేమించడం ఆ సంఘర్షణలకు అగ్నిలో ఆజ్యంపోసినట్లవుతుంది. ఫలితం ముఠా నాయకుల దుర్మరణం; బెర్నార్డో ప్రేయసి అనిటా (రిటా మొరెనా) ఆత్మహుతి.

ఛకరిస్‌ను చూస్తే జేమ్సుడీను వంటి నటుడు మళ్ళీ వచ్చారనిపించింది.

ఎమోషనల్ సీన్సులో రీటా అభినయం విశేషం.

వీరుభయులకేకాక డైరెక్టరుకు, తదితర టెక్నీషియనులకు కూడా ఆస్కార్ బహుమతులు లభించాయి.

పాత్రయొక్క, సన్నివేశంయొక్క లక్షణాలు బట్టి దుస్తుల రంగులు, అంచుల రంగులు నిర్ణయించడమనేది ఈచిత్రంలో ప్రత్యేకత.

ఉత్తమ చిత్రంగాకూడా ఆస్కార్ బహుమతి యిచ్చారు కాని అందుకిది అర్హం కాదనే చెప్పాలి. □□□

